VISALAANDHRA, VIJAYAWADA Phone 6396
ఉదయం
Regd No. H. 203

విశాలాంధ్ర

702781

సంపుటి 16, సంచిక 166] విజయవాడ 8—9—1966 గురువారం [6 పేజీలు 10 పై.

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	రు. 38 00	రు. 45 00
ఆరు మాసాలు	19 00	22 50
మూడు మాసాలు	9 75	11 25
ఒక మాసం	3 25	3 75

కుష్ఠు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
మా లెప్సిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్ మార్కాపురం, కర్నూలు జిల్లా.

శ్రీ సుబ్రహ్మణ్యానికి సంబంధించిన మరో కుంభకోణం

ఒక కంపెనీ దరఖాస్తుపై "ఇది నా కంపెనీ, దానికి సహాయంచేయాలి" అని వ్రాసినట్లువెల్లడి

ప్రధాన మంత్రిపై అశ్లీలమైన పోస్టర్ల ఉదంతం

ఢిల్లీలో ఇద్దరు కమ్యూనిస్టు వ్యతిరేకుల అరెస్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీని అశ్లీలమైన పదజాలంతో దూషించే పోస్టర్లను ఢిల్లీలో గోడలకు అతికించిన నేరానికి ఇద్దరు కమ్యూనిస్టు వ్యతిరేకులను పోలీసులు అరెస్టు చేశారు.

కమ్యూనిస్టుపార్టీ పేరుతో ఈ అశ్లీలమైన పోస్టర్లను ఫోర్జరీ చేసిన ఒక కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థకు ఈ ఇద్దరు వ్యక్తులు చెందినవారని తెలుస్తున్నది.

ఈ సందర్భంలో మరికొందరు వ్యక్తుల కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు.

కమ్యూనిస్టుపార్టీ సెప్టెంబరు 1 న ఢిల్లీలో జరిపిన మహాప్రదర్శనను అప్రతిష్ఠపాల్జేయాలన్న దృష్టితో కమ్యూనిస్టు వ్యతిరేకులు ఈ ఫోర్జరీ పోస్టర్లను సృష్టించిన సంగతి పాఠకులకు విదితమే.

అమెరికా - చైనా టాంకుల సయోధ్య

పాకిస్తాన్‌లో ప్రదర్శన

కరాచీ, సెప్టెంబరు 6

పాకిస్తాన్ రాజధాని రావల్పిండిలో అమెరికన్ టాంకుల సరసనే చైనా టాంకులు నేడు ప్రదర్శించబడ్డాయి.

గత సంవత్సరం భారత్‌తో పాకిస్తాన్ జరిపిన సైనిక సంఘర్షణ ప్రథమ వార్షికోత్సవాన్ని అయూబ్ ప్రభుత్వం నేడు దేశమంతటా రక్షణ దినోత్సవంగా జరుపుతున్నది.

పంజాబ్ సరిహద్దు సమీపంలో గల లాహోరు నగరంలో వాస్తవంగా పోరాటం జరుగుతున్నట్లు నకిలీ పోరాటాన్ని ఏర్పాటు చేశారు.

కరాచీలో అయూబ్‌ప్రభుత్వం ప్రదర్శించిన భారీయుద్ధ పరికరాలను, యుద్ధనౌకలను లక్షమంది ప్రజలు తిలకించారు.

ఇది పరిశీలించవలసిన వ్యవహారమని రాజ్యసభ అధ్యక్షుడు జాకిర్ హుస్సేన్ వ్యాఖ్య

ఇదే నిజమైతే ఇతను బాధ్యతాయుత స్థానంలో వుండదగడని కాంగ్రెస్ సభ్యుల ఒప్పుకోలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

శ్రీ సుబ్రహ్మణ్యం భారీ పరిశ్రమలమంత్రిగా వున్నప్పుడు జరిగిన మరొక కుంభకోణం నేడు రాజ్యసభలో బయటపడింది.

కోయంబత్తూరుకు చెందిన ఒక యంత్ర పరికరాల కంపెనీ 1962 లో దిగుమతి లైసెన్సుకై పెట్టుకొన్న ధరఖాస్తుకు సంబంధించిన ఫైలుపై అప్పుడు భారీ పరిశ్రమల మంత్రిగా వున్న శ్రీ సి. సుబ్రహ్మణ్యం ''ఇది నా కంపెనీ, తగిన సహాయం చేయాలి'' అనీ "ఈ కంపెనీకిచెందిన దొరైరాజ్ ఉపయోగపడే మనిషి సహాయానికి అర్హుడు" అని వ్రాసినట్లు యస్. యస్. పి. సభ్యులు శ్రీ రాజ్‌నారాయణ్ శ్రీ మురహరి నేడు రాజ్యసభలో బయట పెట్టారు.

"ఈ విషయాలు ప్రభుత్వం పరిశీలించదగినవి. దీన్ని గురించి ఏమిచేయాలో ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావడం అవసరం" అని రాజ్యసభ అధ్యక్షుడు డా. జాకిర్‌హుస్సేన్ సైతం వ్యాఖ్యానించారు.

ఈ విషయమై వచ్చిన అల్ప వ్యవధి ప్రశ్నపై సభలో 45 నిమిషములపాటు చర్చ జరిగినది.

ఈ కంపెనీకి యిచ్చిన లైసెన్సు న్యాయసమ్మతమైనదేననీ, ఈ వ్యవహారాన్ని తాను పూర్తిగా దర్యాప్తుచేశాననీ వాణిజ్యమంత్రి శ్రీ మనూభాయ్‌షా సమాధానమిచ్చారు కాబట్టి చర్చ ఇంతటితో ముగిద్దామని డా. జాకిర్ హుస్సేన్ అన్నారు.

అయితే శ్రీ సుబ్రహ్మణ్యం లైసెన్సు మంజూరును సిఫార్సుచేస్తూ ఫైలుపై వ్రాసిన మాటలను గురించి ప్రభుత్వం స్పష్టమైన సమాధానా లివ్వాలని కాంగ్రెస్ సభ్యులు శ్రీ చంద్రశేఖర్, శ్రీ అర్జున్ అరోరా, డా. ఎం. ఎం. సిద్ధు కూడ కోరారు.

"ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజం కాదని ప్రభుత్వం బహిరంగంగా చెప్పాలి. లేక అవి నిజమే అయితే వాటికి బాధ్యుడైన వ్యక్తి బాధ్యతాయుత స్థానంలో ఒక్క క్షణంకూడా ఉండరాదు. ప్రభుత్వం అవినీతికి ఆలవాల మయిపోయిందనే అభిప్రాయాన్ని ప్రతిపక్షాలు ప్రజలలో కలిగిస్తారని శ్రీ చంద్రశేఖర్ అన్నారు.

ప్రభుత్వ ఫైళ్ళలో ఏమున్నదో ప్రతిపక్షాలు ఉదహరించడం పట్ల శ్రీ రామిరెడ్డి మొదలగు కాంగ్రెస్‌సభ్యులు కొందరుఆక్షేపణ తెలియజేశారు. వారు ఈ విధంగా చేస్తే సభ కార్యక్రమాన్ని కొనసాగించ లేవన్నారు.

సభ్యుడు ఏదైనా అధికార పత్రంలోని మాటలను ఉదాహరించ దలిస్తే, అలాఉదహరించడం అవసరమని ముందుగా సభాధ్యక్షునికి రుజువు చేయాలని శ్రీ బి. కె. ఎ. సిన్హా (కాం) అన్నారు.

సెక్రటేరియట్‌లోని ఫైళ్ళలోని విషయాలను ప్రతిపక్ష సభ్యులు బయటపెట్టడంతప్పని అది అధికార రహస్యాల చట్టం కింద నేరమని శ్రీ పాండే అన్నారు.

"అలాంటప్పుడు సెక్రటేరియట్ తన ఫైళ్ళవిషయమై జాగ్రత్త వహించాలి" అని

(మిగతా 5 వ పేజీలో)

వియత్నాంపై రోజుకి 4 అమెరికన్ విమానాలు ధ్వంసం

హాంకాంగ్, సెప్టెంబరు 6

జూన్ 29 వ తేదీ నుండి, హనోయ్, హైఫాంగ్‌లపై అమెరికా విమాన దాడులు ప్రారంభించిననాటినుండి సరాసరిన రోజుకు నాల్గువిమానాలను ఉత్తర వియత్నాం దళాలు నేల కూల్చుతున్నాయి.

గత రెండు నెలలో 250 అమెరికన్ యుద్ధ విమానాలను ఉత్తర వియత్నాం నేలకూల్చిందని హనోయ్ రేడియో ప్రకటించింది.

జూలై, ఆగస్టు నెలల్లో దొరికిన అమెరికా పైలెట్ల సంఖ్య, అంతకుముందు 8 మాసాలలో దొరికినవారి సంఖ్యను మించిపోయింది.

కెనడా ఆందోళన

ఉత్తర వియత్నాంపై అమెరికాసాగిస్తున్న దాడుల పట్ల కెనడాలో ఆందోళన రానురాను అధికం అవుతున్నదని ఒట్టావా పత్రికలు ప్రకటించాయి.

బాంబువాడులవల్ల కమ్యూనిస్టులు సంభాషణలకు సిద్ధంకావడానికి బదులు, మరింత దూరమవుతున్నారని, పొరపాటున ఈదాడులు చైనామీద జరిగే ప్రమాదం వున్నదని కెనడా అధికారవర్గాలు భయపడుతున్నాయని కొన్ని పత్రికలు పేర్కొన్నాయి.

ఉత్తర వియత్నాంపై అమెరికా దాడులు

(మిగతా 6 వ పేజీలో)

భారత్ - పాక్ వివాద పరిష్కారం

ఇండొనేషియా విదేశాంగ మంత్రి ఆశాభావం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

తాష్కెంట్ ప్రకటన ఆధారంగా, శాంతియుత సంప్రదింపుల ద్వారా ఉభయ దేశాల మధ్యగల ప్రధాన సమస్యలను భారత పాకిస్తాన్‌లు పరిష్కరించుకోగలవనే ఆశాభావాన్ని ఇండొనేషియా విదేశాంగ మంత్రి ఆదమ్‌మాలిక్ వెలిబుచ్చారు.

భారత దేశంలో నాల్గు రోజుల పర్యటన అనంతరం వెలువడిన సంయుక్త ప్రకటనలో ఆయన ఈ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

సంపూర్ణ సార్వభౌమాధికారాలుగల దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు జరిగే అన్ని ప్రయత్నాలపట్ల ఇండొనేషియా, భారత దేశాల విదేశాంగ మంత్రులు విచారాన్ని వ్యక్తం చేశారని సంయుక్త ప్రకటనలో వుంది.

అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి బలప్రయోగం జరపటం, జరుపుతామని బెదిరించటం పొరపాటని ఉభయులు అభిప్రాయపడినట్లు ఆ ప్రకటన తెలిపింది.

బాండుంగ్ సూత్రాలపట్ల ఇరు దేశాల మంత్రులు విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

బాండుంగ్ సూత్రాల ఆధారంగారూపొందించబడిన స్వతంత్ర విదేశాంగ విధానం, బడుగుదేశాల రాజకీయ ఆర్థికస్వాతంత్ర్యాన్ని రక్షించగలదని పేర్కొన్నారు.

1954 జెనీవా ఒప్పందం ఆధారంగా సాధ్యమయినంత త్వరగా వియత్నాంసమస్యా పరిష్కారానికి సంప్రదింపులు ప్రారంభం అయ్యేటట్లు సకల యత్నాలుచేయాలని అభిప్రాయపడ్డారు. సాయుధ సంఘర్షణ ద్వారా ఈ సమస్య పరిష్కారం అసాధ్యమని, వాంఛనీయంకాదని విదేశాంగ మంత్రులు స్పష్టం చేశారు.

ఉభయదేశాల మంత్రుల మధ్య అత్యంత హృద్యావ వాతావరణంలో చర్చలుజరిగాయని సంయుక్త ప్రకటన తెలిపింది. ఇరు దేశాలమధ్య సంబంధాల అభివృద్ధిగురించి నొక్కి చెప్పింది.

త్వరలో ఇండొనేషియా ఉన్నతాధికార ఆర్థిక ప్రతినిధివర్గం ఢిల్లీ వస్తుంది.

వియత్నాంకు పంపేందుకుగాను, సోవియట్‌లోని ఇలిచెవ్‌స్క రేవులో నౌకలలోకి ఎక్కించబడుతున్న సరుకు

అత్యవసర పరిస్థితి రద్దు సమస్య లేదు

లోక్ సభలో శ్రీ నందా ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

అత్యవసర పరిస్థితిని రద్దుచేసే సమస్యపై నిర్ణయమేమీ తీసుకోలేదని హోం మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా నేడు లోక్‌సభలో అన్నారు.

దేశం ఎదుర్కొంటున్న విదేశీ ప్రమాదాల దృష్ట్యా ఆ సమస్యను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని శ్రీ యస్. యం. బెనర్జీకి సమాధానమిస్తూ చెప్పారు.

బడ్జెటు సమావేశ సందర్భంగా ఆ సమస్యపై వివిధ ప్రకటనలద్వారా పూర్తి పరిస్థితిని వివరించడం జరిగిందని అన్నారు.

కాంగ్రెసుకు పెద్దమొత్తాలు విరాళమిచ్చిన కంపెనీలకు అక్రమ కోటాలు

రాజ్యసభలో ప్రతిపక్షాల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

కాంగ్రెస్‌పార్టీకి పెద్ద మొత్తాల విరాళాలను యిచ్చిన కొన్ని బొంబాయి కంపెనీలకు రాగి మొదలగు లోహాల కోటాలను ప్రభుత్వం పెంచిందని సంయుక్త సోషలిస్టుపార్టీ సభ్యులు శ్రీ మధులిమాయే ప్రభృతులు నేడు లోక్‌సభలో వెల్లడించారు.

గనుల లోహాల మంత్రి శ్రీ యస్. కె. దే ఈ ఆరోపణలను నిరాకరించారు.

ఈ విషయంపై శ్రీ మధులిమాయే ప్రభృతులు స్వల్పకాలిక ప్రశ్నను లేవనెత్తారు.

కాంగ్రెసుపార్టీకి యిచ్చిన విరాళాలకు ఆ కంపెనీలకు యిచ్చిన కేటాయింపులకు సంబంధం లేదని శ్రీ దే తెలిపారు.

పరిశ్రమల మంత్రిత్వశాఖను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో, శ్రీదే జోక్యం కలిగించుకొని సమాధాన మిచ్చినందుకు శ్రీ లిమాయే ఆక్షేపణ తెలిపారు.

విలాసవంతమైన స్నానాలగదుల్ల గృహ నిర్మాణాల సామాగ్రిని తయారుచేసే గాకా మనీస్. ఇండియా స్మెల్టింగ్ దేవిదయాళ్ కంపెనీలకు నాన్‌ఫెర్రస్ లోహాల కోటాలను పెంచిన విషయం యదార్థమేనా? అని తాము తెలుసుకో గోరుచున్నామని శ్రీ లిమాయే అన్నారు.

ఈ రకంగా కోటాలను పెంచడంద్వారా చిన్నతరహా ఉత్పత్తి దారులను నిరుత్సాహపరచలేదా? అని కూడ ప్రశ్నించారు.

ఈ కంపెనీలకు రాగికోటాలు 1961-62 లో రు. 127 లక్షలుంటే, 1964-65 లో రు. 213 లక్షలకు పెంచామని మంత్రి శ్రీ దే అంగీకరించారు. తుత్తునాగం విషయంలో ఆ కంపెనీల కోటాలను రు 26,32,000 నుంచి రు 35 లక్షలకు పెంచామన్నారు.

ఈసామాగ్రిని దిగుమతి చేసుకొనడానికి ఎంత విదేశీ మారకద్రవ్యాన్ని కేటాయించిన విషయం తెలిపాలంటే కొంత వ్యవధికావాలన్నారు.

ఆ కంపెనీలు సక్రమంగా పని చేయడం కారణంగానే కోటాలను పెంచామని చెప్పారు. ఆ కంపెనీలు అవసరమైన యంత్రసామాగ్రినిపొందాయని, పారిశ్రామిక వస్తువులను తయారు చేయడం ఎలాగో తెలుసుకున్నారని తెలిపారు.

ఆ కంపెనీలు స్నానాలగదుల సామాగ్రిని, యంత్ర పరికరాలు కానివాటిని తయారు చేస్తున్నాయనే విషయాన్ని మంత్రి నిరాకరించారు. అవి పారిశ్రామిక వినియోగాలకు సంబంధించిన యంత్ర సామాగ్రులను, ఇంజనీరింగు పరికరాలను ఉత్పత్తిచేస్తున్నాయని అన్నారు.

మంత్రి చేసిన వాదనను శ్రీ లిమాయే నిరాకరిస్తూ, స్నానాల గదుల అమరికలకు ఆ కంపెనీలు చేసిన ప్రకటనను సభముందు పెట్టారు.

ఆ కంపెనీలు స్నానాల గదులకు కావల్సిన సామాగ్రిని తయారు చేయడం లేదని చెప్పి, మంత్రి సభను తప్పుదారిన పట్టిస్తున్నారని కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీమతి రేణూ చక్రవర్తి పేర్కొన్నారు.

శ్రీ జలాన్‌కు చెందిన ఒకకంపెనీ కాంగ్రెస్ పార్టీ నిధికి పెద్ద మొత్తాలు విరాళంగా ఇవ్వలేదా? అని ఇండిపెండెంట్ సభ్యులు శ్రీ యస్. యం. బెనర్జీ అడిగారు.

బ్లాక్ లిస్టులో చేర్చిన ఒక కంపెనీ నాన్‌ఫెర్రస్ లోహాల కోటాలను పొందలేదా అని కూడ శ్రీ బెనర్జీ ప్రశ్నించారు.

సభ్యులు తెలిపిన ఆ కంపెనీ విషయమై తనవద్ద సమాచారం లేదని, ఆయన గనుక నోటీసు యిచ్చినట్లయితే తాను సమాచారాన్ని సేకరించి సభకు అందించగలనని మంత్రి తెలిపారు.

గుజరాత్ ముఖ్యమంత్రి పుత్రుడు ఆ కంపెనీలలో పెద్ద జీతంపై పనిచేస్తున్నాడా లేదా? అని శ్రీ అర్. యస్. యాదవ్ ప్రశ్నించారు.

దీనికి మంత్రి సమాధాన మివ్వలేదు.

కాంగ్రెసుపార్టీ నిధికి ఆ కంపెనీలు ఎంత డబ్బు చెల్లించినదీ ఈ మంత్రికి తెలియక పోవచ్చునని, అందుచే ఇతర మంత్రులను అడుగమని శ్రీ ఆచార్యకృపలానీ ప్రతిపక్షంలోని తన సహచరులకు చెప్పారు.

కాశ్మీర్ కాంగ్రెస్ సభకు ప్రధాని, కాంగ్రెసుఅధ్యక్షులు హాజరు కాలేని స్థితి

శ్రీనగర్, సెప్టెంబరు 7

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్‌లను తీసుకువెళుతున్న విమానం వాతావరణం సరిలేని కారణంగా బనిహాల్ పర్వతాలను దాటలేక న్యూఢిల్లీ తిరిగి వచ్చింది.

ఆ పర్వతాలను దాటడానికి ఆ విమానం రెండుసార్లు ప్రయత్నించింది.

ఉ. వియత్నాంపై విమాన దాడి తక్షణం ఆపాలి

భారత్ - ఇండొనేషియా సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

ఉత్తర వియత్నాంపై అమెరికా తన విమానదాడులు తక్షణమే ఆపడం, వియత్నాం సమస్యను శాంతియుతంగా పరిష్కరించడానికి తీసుకోవలసిన చర్యలలో ఒకటి అని ఇండొనేషియా భారత దేశాల సంయుక్త ప్రకటనలో ఉద్ఘాటించారు.

ఇండొనేషియా విదేశాంగ మంత్రి శ్రీ మాలిక్ భారతదేశ పర్యటన పూర్తి అయిన సందర్భంలో నేడు ఈ సంయుక్త ప్రకటన వెలువడింది.

వియత్నాం యుద్ధం ప్రత్యేకించి ఆసియా దేశాల కన్నిటికి తీవ్రమైన ఆందోళన కలుగజేసే విషయమనీ, ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి తీవ్రకృషి చేయడం అవసరమనీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తుంగభద్ర ప్రాజెక్టుకు తక్షణం సైనిక రక్షణ

మైసూరు విద్రోహ చర్యలపై ప్రధాన మంత్రికి శ్రీ తెన్నేటి తంతి

వెంటనే శాసనసభను సమావేశపర్చాలని డిమాండ్

విజయవాడ, సెప్టెంబరు 7

తుంగభద్ర ప్రాజెక్టును, హెడ్ స్లూయిసెస్‌ను వెంటనే సైనిక రక్షణ క్రింద వుంచాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్ర ప్రజాపార్టీ నాయకులు శ్రీ తెన్నేటి విశ్వనాథంనేడు ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి టెలిగ్రామ్ పంపారు.

తుంగభద్ర ఎగువ కాలువ గట్టను డైనమైట్లతో పేల్చి, కాలువ నీటిని తమ వైపుకు మైసూరు వాసులు తరలించిన ఉదంతం ఆంధ్ర ప్రజలలో విపరీత ఆందోళన కల్గించినదని, ప్రజలలో విశ్వాసం నెలకొనాలంటే తుంగభద్ర ప్రాజెక్టును, హెడ్ స్లూయిసెస్‌ను తక్షణం సైనిక రక్షణలో వుంచడం అవసరమని శ్రీ తెన్నేటి విశ్వనాథం తన టెలిగ్రామ్‌లో స్పష్టం చేశారు.

తుంగభద్ర ఎగువకాలువ గట్టులకు గండ్లు పెట్టినవారిపై మైసూరుప్రభుత్వం యింత వరకు ఎట్టి చర్య తీసుకొన లేదని కూడా ఆయన తన టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు.

ఈ విషయం చర్చించడానికి వెంటనే రాష్ట్రశాసన సభను సమావేశపరచాలని కోరుతూ ఆయన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డికి మరొక టెలిగ్రామ్ పంపారు.

పోలీసులతో ప్రజల సంఘర్షణ

కలకత్తా, సెప్టెంబరు 6

తూర్పు రైల్వేలోని సీల్దా - లాల్‌గోలా సెక్షన్‌లో బేతుహారి రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణ జరిగిందని. ఆ ఘర్షణలో 11 మంది పోలీసులు గాయపడ్డారని అధికార వర్గాలవారు ప్రకటిస్తున్నారు.

పేద ప్రజలు తమ సొంత వాడకానికి రైలులో తీసుకు వెడుతున్న 6 క్వింటాల్స్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొనడానికి పోలీసులు ప్రయత్నించగా ప్రజలు ప్రతిఘటించారని తెలుస్తున్నది. ఈ సందర్భంలో 150 మంది ప్రజలు పోలీసులతో ఘర్షణ పడ్డారు.

పోలీసులు 11 మందిని అరెస్టు చేశారు.

రాజమండ్రికి ముంపు ప్రమాదం

గోదావరి నీటిమట్టం రైలువంతెన క్రింద 63 అడుగులకు పెరుగుదల; ఇంకా పెరుగుతున్నట్లు వార్త

రాజమండ్రి, సెప్టెంబరు 7

గోదావరి వరదమట్టం రాజమండ్రి రైలువంతెన క్రింద 63 అడుగులకు పైగా పెరగడంతో రాజమండ్రి పల్లపు ప్రాంతాలు ఏక్షణమైనా మునిగిపొయ్యే ప్రమాదం సంభవించింది.

గోదావరి క్షణక్షణమూ పొంగుతూనే వుంది. గత 24 గంటలలో వరద మట్టం మరో 3.2 అడుగులు పెరిగింది.

ధవళేశ్వరం ఆనకట్టపై నీటి మట్టం 16.5 అడుగులూ, రైలు వంతెన క్రింద 62.11 అడుగులూ వుంది. తీరంలో పాకలు వేసుకొనివున్న కార్మిక కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేశారు. వారికి దగ్గరలోవున్న ప్రభుత్వ బాలికా పాఠశాలలో వసతి కల్పించారు. వారికి ఉచిత భోజనం తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ధవళేశ్వరం వద్ద 26 మైళ్ళ మేర రెవిన్యూ, పోలీసు, పి. డబ్ల్యు. డి. అధికారులు కరకట్టను కాపలా కాస్తున్నారు.

కొవ్వూరుకు 18 మైళ్ళ లోపులో వున్న పోలవరం గోదావరి నీటిలో పూర్తిగా మునిగిపోయింది.

కరకట్ట ఆవలివైపు ప్రభుత్వ కార్యాలయాలలోను, పాత బస్తీలోను దాదాపు 5 వేల మంది వరదబాధితులు తల దాచుకొంటున్నారు.

లోక్ సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

లోక్‌సభ నేడు నిరవధికంగా వాయిదా పడింది.



తుంగభద్ర ఎగువకాల్వకు మైసూరులో గండ్లు కొట్టిన చోటు.

గండ్లలోనుంచి నీరు ప్రవహిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర

ఎవరిదీ అదృశ్య హస్తం

అఖిల భారత కాంగ్రెసుకమిటీ కార్యాలయంలో పట్టుబడిన పాక్ గూఢచారుల ఉదంతంపై ఆనాటి కానాడు కొత్త కొత్త అంశాలు వెల్లడవుతున్నాయి. ఇవి కేవలం కాంగ్రెసుపార్టీ అంతరంగిక వ్యవహారాలు కావు. దేశ భద్రతకే సంబంధించిన అంశాలు. ప్రభుత్వ శాఖలలో అనాటి కానాడు పెరుగుతున్న గూఢచారుల ప్రవేశం, అధికారుల దర్పం, వారికి అండ దండలిచ్చే కొందరు కాంగ్రెసునాయకుల అదృశ్యహస్తం. ఇవన్నీ ఒక్కొక్కటే వెల్లడవుతున్నాయి.

పశ్చిమ బెంగాల్ కాంగ్రెసు నాయకుడు శ్రీ అతుల్యఘోష్ ఈ విషయమై లోక్‌సభలో ఒక అసత్య ప్రకటన చేశాడు.

సుసీల్‌దాసు ఇల్లు పోలీసులు సోదా చేసినప్పుడు, వకీలు సలహా పొందవలసిందిగా తాను అతనికి చెప్పినట్లు మొదట్లో ప్రకటించాడు. అసలా రోజున అతుల్యఘోష్ ఢిల్లీలో లేనే లేరనీ, కలకత్తాలో ఉన్నాడనేవాస్తవాన్ని కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీమతి రేణూచక్రవర్తి వెల్లడిచేయగా, ఇక గత్యంతరం లేక, తాను పొరపాటు పడ్డట్లు అతుల్యఘోష్ పార్లమెంటులో అంగీకరించాడు.

కాగా, తాను కలకత్తాలో ఉన్నదీ, ఢిల్లీలోఉన్నదీకూడా గమనించలేని స్థితిలో అతుల్యఘోష్ ఉన్నాడంటే నమ్మశక్యం కాదు.

ఇప్పుడు అంతకంటే విడ్డూరమైన మరొకవిషయం వెల్లడైంది. ఈ గూఢచారికేసును స్పెషల్ బ్రాంచి నుండి డిటెక్టివ్ శాఖకు మార్చినమాట నిజమేనా? అని యస్. యస్. పి. కి చెందిన మధులిమాయే ప్రశ్నించగా అలాంటిదేమీ లేదు అని హోంశాఖ సహాయమంత్రి శ్రీ హాథీ అగస్టు 17న ఒక ప్రకటన చేశాడు. అదే వ్యక్తి సెప్టెంబరు 6న లోక్‌సభలో మరొక ప్రకటనచేస్తూ తన వెనుకటి ప్రకటన పొరపాటని ఈకేసు స్పెషల్ బ్రాంచి నుండి డిటెక్టివ్ శాఖకు అగస్టు 4 ననే మార్పుచేయ బడ్డదని అంగీకరించాడు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక పోలీసుఅధికారి ఇచ్చిన సమాచారంవల్ల తాను పొరపాటు ప్రకటన చేయవలసి వచ్చిందని విచారం వ్యక్తపరిచాడు.

ఇది కేవలం విచార ప్రకటనతో ముగిసిపోయే అంశంకాదు.

గూఢచారులకు సంబంధించిన కేసిది. అతుల్యఘోష్ లాంటి కాంగ్రెసు నాయకులు నేరస్థులకు రక్షణ ఇస్తున్నారని పదే పదే ఆరోపణలువచ్చాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన పోలీసు అధికారి, కేంద్ర ప్రభుత్వానికే తప్పుడు సమాచారం ఎలా ఇవ్వగలిగాడు. ఇది ఎలా సాధ్యమైంది?

ప్రభుత్వోద్యోగులపై ముఖ్యంగా పోలీసు శాఖపై మంత్రుల కేమైనా అజమాయిషీ ఉందా? లేక కేంద్ర మంత్రులకు కూడా తప్పుడు సమాచారం ఇవ్వగల తాహతు పోలీసుశాఖ సంపాదించిందా?

మరొకఆందోళనకరమైనఅంశం కూడా ఉంది.

చైనాపై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే పేరుతో, అమెరికా గూఢచారిశాఖకు, భారత ప్రభుత్వ గూఢచారిశాఖకు మధ్య సంబంధాలు ఇప్పటికే ఏర్పడి ఉన్నాయి. ఇలాంటి ఏర్పాటు ఉన్నట్లుప్రభుత్వ బాధ్యులే అంగీకరించారు, నెహ్రూ జీవించి ఉండగా ఇట్టి ఏర్పాటును ప్రభుత్వం సమ్మతించ లేదు.

ఆ పిమ్మట జరిగిన పరిణామమిది.

శాంతిదళం వాలంటీర్ల పేరుతో, నైతిక పునరుద్ధరణసంఘం పేరుతో తదితర అనేక నామధేయాలతో, అమెరికన్ వాలంటీర్లు భారతదేశంలోకి దిగుమతి అవుతున్నారు. స్వచ్ఛందసేవ చేయటమనే పేరుతో వీరిలో పెక్కుమంది గూఢచారి చర్యలు సాగించటం పరిపాటి. విద్యావేత్తలుగా విదేశాలకు వెళ్ళే అమెరికన్లలోనే పెక్కుమంది గూఢచారులున్నట్లు అమెరికా గూఢచారిశాఖే స్వయంగా అంగీకరించింది.

అమెరికన్ గూఢచారిశాఖల ప్రాబల్యం, భారత రాజకీయ జీవితంపైనా, భారత ప్రభుత్వ శాఖలపైనా విస్తరిస్తున్నది. ఈ విషయమై పార్లమెంటు సభ్యులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. కాని ప్రణాళికామంత్రి అశోక్ మెహతాకు చీమ కుట్టినట్లు కూడా లేదు. కావాలనిచేజేతులా అమెరికన్ వర్గాలను ఆహ్వానించే ప్రబుద్ధులకు ఈప్రమాదం ఎందుకుకనిపిస్తుంది?

మార్క్సిస్టు కమ్యూనిస్టులు తలపెట్టిన "విద్రోహ పథకం" పేరుతో ఇటీవల ప్రచారమైన సీబి వార్తలోనూ ఢిల్లీలో జరిగిన మహాప్రదర్శనసందర్భంలో ప్రధానిఇందిరాగాంధిపై అసత్యంగా విమర్శిస్తూ వెలువడ్డ పోస్టర్లలోనూ, ఇంకా అనేక సందర్భాలలో అమెరికన్ గూఢచారి శాఖ ప్రచ్ఛన్న హస్తం ఉన్నదా అని ఎంచవలసి ఉంది.

ఇప్పుడీ పాక్ గూఢచారి ఉదంతంలోనూ అవే సూచనలుకనిపిస్తున్నాయి.

అమెరికన్ గూఢచారిశాఖ కార్యకలాపాలు ప్రపంచమంతటా విస్తరించి ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఆగ్నేయాసియాలో ఇవి మరీప్రబలంగాఉన్నాయి. స్వతంత్ర ప్రభుత్వాలను బలహీన పరచటం, వీలైతే పడగొట్టటం, ప్రభుత్వ వర్గాలలోకి తమ శక్తులను ప్రవేశపెట్టటం, అనేకరకమైన ప్రలోభాలకు వ్యక్తులను గురిచేయటం మొదలైన కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి.

కనుక ప్రభుత్వం ఈ గూఢచారి కేసు విషయమై సమగ్రమైన, కూలంకషమైన దర్యాప్తు జరపటం అవసరం.

మంత్రుల అసమర్థత, పోలీసు ఉద్యోగుల ధిక్కారం, అవినీతిపరులకు, గూఢచారులకు కొందరు కాంగ్రెసు నాయకుల ఆశ్రయం మొదలైన అంశాలు మాత్రమేకాక, అసలు పరిపాలనా వ్యవస్థ సౌష్టవం ఏపాటి అనికూడా ప్రశ్నించవలసి ఉంది. ప్రభుత్వ శాఖలలో, వేర్వేరు స్థాయిలలో, అమెరికన్ వర్గాల దుష్ప్రభావం, ఏ మేరకు ప్రసరించిందో కూడా పరిశీలించాలి. దానిని నిర్మూలించాలి.

ఇది కేవలం ఒక మంత్రి, లేక ఒక కాంగ్రెసునాయకుడు అసత్య ప్రకటనలు చేయటం మాత్రమే కాదు. దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాలకు సంబంధించిన సమస్య. దేశ గౌరవం ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్ర్యం భారత ప్రజలందరి సొత్తు. బ్రిటిష్‌సామ్రాజ్యవాదులతో పోరాడి దేశ స్వాతంత్ర్యాన్ని భారతప్రజ సంపాదించుకున్నది. తిరిగి అమెరికా నయా వలసవాదులకు, వారి గూఢచారి చర్యలకు దేశంలో ప్రవేశం కల్పించేందుకు కాదు.

కనుకనే ఈ సమస్యపై పార్లమెంటులో ఇంతటి ఆగ్రహం, ఆవేదన వ్యక్తమైంది.

గూఢచారిఉదంతం వెనుకవున్న అదృశ్యహస్తం ఎవరిదో పూర్తిగా నిర్ధారణజరిగి, నేరస్థులు కఠినంగా శిక్షింపబడే వరకూ ప్రజాతంత్రవాదులు విశ్రమించబోరు. విశ్రమించరాదు.

చిదంబరరహస్యాలు

జయంతి షిప్పింగ్ కంపెనీ కుంభకోణం

వ్యక్తిగతలాభం ప్రధాన సూత్రంగాగల పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అవినీతి, అక్రమార్జన, మోసాలు, కుట్రలు, ఎంత పెద్ద యెత్తున సాగిపోతాయో జయంతి షిప్పింగ్ కంపెనీ వ్యవహారాల గురించి ఇటీవల పార్లమెంటు ఉభయ సభలలోను జరిగిన చర్చలలో దేశ ప్రజలందరి దృష్టికి వచ్చింది.

పెట్టుబడిదారీ వర్గం ఒకవైపున ప్రజలను నిలువునా దోచుకొనడం అక్రమార్జనలతోబాటు మరో వైపున అధికార స్థానాల్లో ఉన్నవారిని లంచాలద్వారా లోబరుచుకొని ప్రజాధనాన్ని ఏ విధంగా తమ స్వార్థానికి వినియోగించు కుంటుందో ఈ కంపెనీ వ్యవహారాల బండారంద్వారా బైటపడింది.

ఆంశాడు. కాంగ్రెసుపాలకులు ఒకవైపున దేశ ప్రజలకు సోషలిజం, ఆర్థిక సామ్యం ఆశజూపుతూ మరోవైపు పెట్టుబడిదారీ వర్గాన్ని ఏ విధంగా పెంచిపోషించుతున్నారో ప్రజాధనాన్ని అప్పులపేర, అడ్వాన్సులపేర వారికి కట్టబెడుతూ వారి అక్రమ చర్యలను ఏవిధంగా కప్పిపుచ్చుతున్నారో కూడా ఈ సందర్భంలోమరోసారి నగ్నంగాబైటపడింది.

జయంతి షిప్పింగ్ కంపెనీ చైర్మన్ డాక్టర్ జయంతి ధర్మతేజ ఆంధ్రుడు. ఆంధ్రలో జపాన్ సహాయంతో రామగుండం విద్యుత్ కేంద్రాన్ని, హైద్రాబాద్‌లో రిపబ్లిక్ ఫోర్జి పేరిట ఒక యంత్ర పరికరాల ఫ్యాక్టరీని నెలకొల్పడానికి సన్నాహాలుచేసి, ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి ఎంతో కృషిచేస్తానని హామీలు పల్కడం వలన ఆంధ్ర ప్రభుత్వం, ఆంధ్ర ప్రజలు సహజంగానే కొంత హర్షం వ్యక్తం చేశారు. ఇన్నాళ్ళకు ఒక ఆంధ్రుడు ఒక పెద్ద నౌకావ్యాపార కంపెనీని నెలకొల్పి పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రాష్ట్రానికి కొన్ని పరిశ్రమలనైనా తీసుకొని రానున్నారని అభిమానంతో ఎదురుచూస్తూ వచ్చారు.

కాని ఆదిలోనే హంసపాదు అన్నట్లు జయంతి షిప్పింగ్ కంపెనీ ప్రారంభంలోనే ఆయన యిసుక పునాదులపైమేడలు నిర్మించుతున్నాడనీ, స్వల్ప పెట్టుబడితో ప్రారంభించి కేంద్రప్రభుత్వంవద్ద రు. 20 కోట్ల రూపాయలకు పరపతి సంపాదించాడనీ ఇందులో ఏదో కుంభకోణం లేకపోలేదనీ వార్తలు పొక్కాయి.

ఏ ఆస్తుల హామీపై ఇంత పెద్దమొత్తానికి భారతప్రభుత్వం డాక్టర్ ధర్మతేజకు పరపతి కల్పించిందని పార్లమెంటులో ఆనాడే పలువు సభ్యులు ఆక్షేపణలు తెలియజేశారు.

డాక్టరు తేజ చూపిన ‘ఆకర్షణీయమైన’ పథకం

అయితే భారతదేశ విదేశాంగవ్యాపారం అమెరికా, బ్రిటిష్ నౌకా కంపెనీలమీదనే అత్యధిక భాగం ఆధారపడిఉండటం, వారి చెప్పుచేతల్లో వారి రవాణారేట్ల ప్రకారమే సాగడం, దేశీయ నౌకా కంపెనీల టన్నేజి గణనీయంగా లేకపోవడం, ఈ పరిస్థితిలో డాక్టర్ ధర్మతేజ అత్యల్పకాలంలో భారత వాణిజ్య నౌకా బలాన్ని గణనీయంగా పెంపొందించుతాననిప్రతిపాదించడం, దీనితో ధర్మతేజ పథకం ఆనాడు నెహ్రూ ఆమోదముద్ర పొందిందని చెప్పబడుతూంది.

డాక్టర్ ధర్మతేజ ఆంధ్రా యూనివర్శిటీ మద్రాసు యూనివర్శిటీలలో చదివి ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్ళి రసాయన శాస్త్రంలో అక్కడ డాక్టరేట్ బిరుదు పొంది అక్కడే స్థిరపడ్డారు. 1960 లో భారతదేశం వచ్చి ఆంధ్రకాంగ్రెస్ నాయకులు శ్రీ మొసలికంటి తిరుమలరావు మొదలైనవారి సహాయంతో నెహ్రూ పరిచయం సంపాదించారు. భారత ప్రభుత్వానికి నౌకా కంపెనీ గురించిన ప్రతిపాదన చేసేముందు వచ్చి నౌకానిర్మాణ కేంద్రాలను సందర్శించి, నౌకాభివృద్ధి పథకాన్నొకదానిని తయారుచేసి సమర్పించారు. ఇది తెలిసి జపాన్ నౌకా కంపెనీలు డాక్టర్ తేజాను తమదేశం ఆహ్వానించి, నౌకలను నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారు.

డాక్టర్ ధర్మతేజ చైర్మన్‌గా జయంతి షిప్పింగ్ కంపెనీ ఏర్పడింది. పార్లమెంటు సభ్యుడు, ఆంధ్ర కాంగ్రెస్ నాయకుడు శ్రీ మొసలికంటి తిరుమలరావు కంపెనీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. కంపెనీలో తన వాటాగా ధర్మతేజ 2 కోట్ల 20 లక్షలను పెట్టుబడిపెట్టారు. ఈ పెట్టుబడి, కంపెనీ స్టాంపు డ్యూటీకి చెల్లించిన పెద్ద మొత్తాలు ఆయన ఏ విధంగా తెచ్చారనే అంశం ఇప్పటికీ ఒక ప్రశ్నగానే ఉన్నట్లు తెలుస్తున్నది. అమెరికాలో స్థిరపడిన విదేశస్థుడైన ఒక పెద్ద నౌకాకంపెనీ యజమాని కుమార్తెను ధర్మతేజ వివాహమాడారనీ, ఆ తరువాత ఆమె మరణించడంతో, అనేక కోట్లరూపాయల ఆస్తి, నౌకలు ధర్మతేజకు సంక్రమించాయనీ తెలుస్తూంది.

జయంతి షిప్పింగ్ కంపెనీ అనుకున్న ప్రకారమే అనతికాలంలోనే అంటే 1964 మధ్య భాగానికి కొన్ని భారీ వాహక నౌకలతోసహా 11 నౌకలను కొనుగోలు చేసి భారతనౌకా వాణిజ్యంలో దాదాపు 5 లక్షల టన్నేజిపెంచింది. అయితేఈనౌకల కొనుగోలు ఏ విధంగా జరిగింది? చెల్లింపులు ఏవిధంగా జరుగుతున్నాయి? ఆర్జించిన విదేశమారకం ఏ విధంగా ఖర్చుపెట్టడం జరుగుతున్నది? భారత ప్రభుత్వం యిచ్చిన పెద్ద మొత్తం అప్పు దృష్ట్యా కంపెనీ వ్యవహారాలపై అజమాయిషీ ఏవిధంగా జరుగుతూంది మొదలైన విషయాలు 1966 ఫిబ్రవరిలో మొదటి సారిగా ఈ కంపెనీ ఒడిదుడుకులు బైటపడేదాకా ఎవరికీ అణామణా తెలియదు.

షిప్పింగ్ ఏజంట్లకు, స్టీవిడోర్లకు, రేవు పనివారికి ఆఖరుకు కంపెనీ కార్యాలయం ఉద్యోగులకు చెల్లించవలసిన బిల్లులు, జీతాలుకూడా చెల్లించ లేక పోవడంతో కంపెనీ వ్యవహారాలు గుప్పుమని పైకి వెల్లడైనాయి.

సుఖ్తాంకర్ కమిటీ నివేదిక

ఇందుపై లేచిన అలజడితో ప్రభుత్వం ఈ కంపెనీ వ్యవహారాలను పరిశీలించడానికి సుఖ్తాంకర్ నాయకత్వాన ఒక కమిటీని గత మార్చిలో నియమించింది.

ఈనివేదికతో జయంతి షిప్పింగ్ కంపెనీ లోగుట్టు అంతా బైటపడింది. సుఖ్తాంకర్‌కమిటీ పరిశీలనలో బైటపడిన విషయాలు ఇవి:

కంపెనీ జాలూతు ఖాతా పుస్తకాలను కమిటీ పరిశీలన చేయలేక పోయింది. అసలు పరిశీలన చేయడానికి ఖాతా పుస్తకాలు అక్కడ లేనేలేవు. ఎక్కువ కాలం ఖాతాలు వ్రాయబడలేదు.

కాని పరిశీలన కమిటీ ముందుకువచ్చిన సాక్ష్యాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ద్రవ్యాపహరణ, తప్పుపద్దులు, అర్థంలేని అప్పులు, ఉద్యోగ నియామకాలలో ఆశ్రిత పక్షపాతం, యాజమాన్యంలో అవకతవకలుమున్నగునవి.

ఇక కంపెనీ ఆర్థిక వ్యవహారాలు మరింత గందరగోళంగా ఉన్నాయి. ముఖ్యమైన విషయాల గురించి చైర్మన్ డైరెక్టర్ల బోర్డుకు తెలియజేయలేదు.

కంపెనీకి పెద్ద పెద్ద నష్టాలు సంభవించడమేకాక షిప్పింగ్ ఏజంట్లకు స్టీవిడోర్లకు రేవుపనివారికి కూడా డబ్బు యివ్వలేని పరిస్థితి యేర్పడింది.

ఆర్జించబడిన విదేశీ ద్రవ్యంలో కొంత విదేశాలకు కమీషన్లని, రిబేటులని, డిస్కౌంటులని పేరుచెప్పి తరలించడం జరిగింది.

ఒక సందర్భంలో డాక్టర్ ధర్మతేజ, ఒక జపాన్ షిప్‌యార్డునుండి రిబేటు క్రింద పుచ్చుకొన్న 32,000 డాలర్ల మొత్తాన్ని కంపెనీకి రిఫండు చేయలేదు.

ఇవేగాకయింకాఅనేకవిషయాలను ఈవిషయాలలో ప్రభుత్వ బాధ్యతారహిత విధానాన్ని సుఖ్తాంకర్‌కమిటీతన నివేదికలో పొందుపరచి ప్రభుత్వానికి సమర్పించింది.

అందుపై ప్రభుత్వం జయంతి షిప్పింగ్ కంపెనీని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆర్డినెన్సు ప్రకటించింది. జూన్ 10 వ తేదీన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈకంపెనీ మేనేజిమెంటునువశపరచుకుంది.

ఆర్డినెన్సు స్థానే ప్రభుత్వం తీసుకొని వచ్చిన బిల్లుపై పార్లమెంటు ఉభయ సభలలోను అగస్టు ఆఖరు వారంలో జరిగిన చర్చ సందర్భంలో ఈకంపెనీ లొసుగులు గురించే కాక ఈ కంపెనీపట్ల ప్రభుత్వం ఎంతలోపభూయిష్టమైన విధానాన్ని, అవలంబించిందో, కాంగ్రెస్ పాలకులు పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలు నెరవేర్చడానికి తమ అధికారాన్ని ఏవిధంగా దుర్వినియోగపరస్తున్నారో తెలిపే ఉదంతాలు అనేకం బైటపడ్డాయి.

పార్లమెంటు చర్చలో బైటపడ్డ అనేక రహస్యాలు

జయంతి షిప్పింగ్ కంపెనీలో డైరెక్టర్ల బోర్డులో 1½ సంవత్సరాల కాలం ప్రభుత్వ డైరెక్టర్లు లేరు.

రిజర్వుబ్యాంకుకు, జయంతి షిప్పింగ్ కంపెనీ విదేశీ ద్రవ్యం జాబితా నివేదికలు లేవు. యిచ్చిన కొద్ది లెక్కలు సరిగా లేవు.

కాని ఈ కంపెనీపనిచేసిన అయిదు సంవత్సరాల కాలంలోను ప్రభుత్వం అపారంగా అప్పులు సమకూర్చింది. తలమునిగే అప్పులు చేస్తున్నా చూస్తూ వూరుకుంది. భారత ప్రభుత్వం యిచ్చిన రు. 20 కోట్లు గాక ఈ కంపెనీ మొత్తం 3500 మందివద్ద రుణాలు తీసుకుంది ఇందులో వివిధబ్యాంకుల నుండి తీసుకున్నది రు. 27 కోట్లవరకు ఉంది.

అమెరికా నుండి అప్పులు సంపాదించడానికి డాక్టర్ తేజ తన కంపెనీ పేర ఒక తీర్మానాన్ని ఫోర్జరీ చేశారు.

కంపెనీ చైర్మన్ డాక్టర్ ధర్మతేజ ఈ అయిదు సంవత్సరాలలోను అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండు, భారతదేశాలలో ఏఒక్క దేశంలోను160నుండి 170 రోజులవరకు ఏక కాలమందు ఉండకుండా ఏ దేశానికి ఆదాయపు పన్ను చెల్లించకుండా ఉండటం జరిగింది: ఇది యాదృచ్ఛికంగా జరిగిన విషయం కాదు.

ప్రభుత్వం ఎందుకు విఫలమైంది?

బిల్లుపై జరిగిన చర్చనుబట్టి, సుఖ్తాంకర్ కమిటీ నివేదికనుబట్టి జయంతి షిప్పింగ్ కంపెనీ వ్యవహారాలను ఎప్పటికప్పుడు తగిన అజమాయిషీ చేసే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టంగా తేలిపోయింది.

ఈ కంపెనీ ప్రైవేటు కంపెనీయే అయినప్పటికీ ప్రజాధనం రు. 20 కోట్లను ప్రభుత్వం ఈ కంపెనీకి సమకూర్చింది. అందుచేత ఎప్పటికప్పుడు ఈ కంపెనీ వ్యవహారాలను తనిఖీ చేయవలసిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. కాని అయిదు సంవత్సరాల కాలంలోను ఏ ఒక్కటీ ప్రభుత్వ దృష్టికి ఎందుకు రాలేదు?

1963 నాటికే కంపెనీ చెల్లించవలసిన బిల్లులు చాలా ఉండిపోయాయి మరి ఈ విషయం ప్రభుత్వానికి ఎందుకు తెలియలేదు?

విదేశీ ద్రవ్యం గురించి కంపెనీయిస్తున్న లెక్కలు సరిగాలేవనీ, సమగ్రమైన నివేదికలులేవనీ తెలిసి కూడా రిజర్వుబ్యాంకు ఎందుకు మాట్లాడక వూరుకుంది? వెంటనే దాడిచేసి పట్టుకోవలసిన బాధ్యతను ఎందుకు నిర్వర్తించలేదు.

కంపెనీ చైర్మన్, డైరెక్టర్లకు తెలియకుండా ఇన్ని వ్యవహారాలను సాగిస్తున్నప్పుడు కిమన్నాస్తిగా ఎందుకు వూరుకున్నారు?

కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యం

వీటన్నిటికి కారణం ఒక్కటే, అది పాలకవర్గపార్టీ అయిన కాంగ్రెస్ పక్షంలోని వారికి వారి బంధువులకు కంపెనీ అవినీతి, అక్రమార్జన, దుర్వ్యయాల్లో భాగస్వామ్యం ఉండటమే.

ఈ కంపెనీ ఉపాధ్యక్షుడు శ్రీ మొసలికంటి తిరుమలరావు ఆంధ్ర కాంగ్రెస్ నాయకుల్లో ఒక ముఖ్యుడు. పార్లమెంటు సభ్యుడు, మాజీ లెఫ్టినెంట్ గవర్నరు. జయంతి షిప్పింగ్ కంపెనీ వ్యవహారాల్లో ఈయనకు ప్రముఖపాత్ర ఉంది. కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని అడ్డం పెట్టుకొని అనేక అక్రమ విధానాలకు ఈయన తోడ్పడ్డాడు. ప్రభుత్వ పలుకుబడి నంతా ఈ కంపెనీ ప్రయోజనాలకు ఒడ్డాడు.

ఒక వాణిజ్య సంస్థకు వైస్ చైర్మన్‌గా ఆ కంపెనీనుండి నఖా పొందేటప్పుడు, పార్లమెంటు సభ్యుడుగా, పార్లమెంటుఅధిపతులకు- రాజ్యసభ చైర్మన్‌కుగాని, లోక్‌సభ స్పీకరుకుగాని తన సాంవత్సరిక ఆదాయం గురించిన జమా ఖర్చులను నివేదించాలి. శ్రీ తిరుమలరావు ఆ విధంగా నివేదించలేదని రాజ్యసభ సభ్యులు బైట పెట్టారు.

కాని లోక్‌సభలో ఇంతకంటే తీవ్రమైన, విస్మయకరమైన విషయాలను సభ్యులు వెల్లడించారు.

ధర్మతేజ అంతరంగిక సిబ్బందిలో ఒక ఉద్యోగిగా సంవత్సరానికి మూడులక్షలజీతం, ఎలవెన్సులు ఇచ్చే ఏర్పాటుపై(అందులో ఒక లక్షఆదాయపుపన్ను లేకుండా ఇచ్చేషరతుపై) మాజీ లెఫ్టినెంట్ జనరల్ కౌల్‌ను నియమించుకున్నారు. జనరల్ కౌల్, ఇంతకుముందే కంపెనీ డైరెక్టర్లుగా ఉన్న గౌతమ్ సైగాల్, లాల్జీమల్‌హోత్రావీరుముగ్గురూనెహ్రూకుటుంబానికి, ప్రధాని ఇందిరాగాంధీకి బంధువులని లోక్‌సభ చర్చసందర్భంలో సభ్యులు తెలియజేశారు. అయితే ఇందులో అందరూ తమకు బంధువులు కారనీ, ఒక్కరు మాత్రమే బంధువులని శ్రీమతి ఇందిరాగాంధిఅన్నారు.

ప్రభుత్వాధినేతల బంధువులకు పదవులు

ప్రభుత్వాధినేతల బంధువులకు ఆశ్రితులకు కంపెనీలో డైరెక్టర్ల పదవులు ఇతర పుష్కల పదవులు ఎందుకు యివ్వబడతాయో ఎవరికీ తెలియని రహస్యం కాదు.

అయితే లోక్‌సభలో జయంతి షిప్పింగ్ కంపెనీ స్వాధీనం బిల్లుపై చర్చకు సమాధానం చెప్పే సందర్భంలో రవాణాశాఖ మంత్రి శ్రీ సంజీవరెడ్డి బైటపెట్టిన మరికొన్ని విషయాలుకూడ గమనించ దగినవి.

డాక్టర్ ధర్మతేజ మేనల్లుడు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ, ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి జయంతి షిప్పింగ్ కంపెనీ వ్యవహారాలకు సంబంధించిన కొన్ని పత్రాలను అందజేశారు. అయితే అవి పరిశీలించే లోగానే ఆయన మరణించడం జరిగింది. ఆ తరువాత ఆ పత్రాలు రవాణాశాఖకు పంపబడినాయి.

ఇందులో వున్న విషయాలు ఏమిటి? సకాలంలోనే కంపెనీ లొసుగుల గురించి ప్రభుత్వానికి తగు సమాచారం ఈ పత్రాల ద్వారా అందిందా? అందితేప్రభుత్వంఅప్పటి నుండి 1966 ఫిబ్రవరి వరకు ప్రభుత్వం ఎందుకు మాట్లాడక వూరుకొంది?

ధర్మతేజ మేనల్లుడే కంపెనీ వ్యవహారాలలో రచ్చకెక్కడానికి కారణం. అన్యాయాన్ని బైటపెట్టే సదుద్దేశ్యంతోనా? లేక అక్రమార్జన సంపదలో తప్పిన తగవులలో వాటాలు తెగక బైటపెట్టాడా? లేక ఉత్తరాది గుత్త పెట్టుబడిదారీ వర్గం కొత్తగా రంగంలోకి వచ్చిన ఈ ఆంధ్ర పెట్టుబడిదారుని దిగతొక్కడానికి, తమకు పోటీలేకుండా చేసుకోడానికి ధర్మతేజ బంధువులను లోబరుచుకొనడం వలన జరిగిందా? మొదలైన అనేక ప్రశ్నలు, ప్రవాదాలు ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ ఇంకా తేలవలసిన రహస్యాలు. అంతర్యాలున్నూ.

ఆమ్-ఇండో షిప్పింగ్ కంపెనీ, మెరిడియన్ స్టీమ్ షిప్ కంపెనీల పేర్లతో అమెరికాలో డాక్టర్ తేజ రెండు నౌకా కంపెనీలను నెలకొల్పి జయంతిషిప్పింగ్‌కంపెనీకి వారిని ఏజంట్లుగా నియమించాడు. జపాన్‌లోని మిట్సుబిషిహెవీ ఇండస్ట్రీస్ కంపెనీకి జయంతి కంపెనీ తరఫున 4 లక్షల 86 వేల డాలర్లను బాకీ యిచ్చినట్లు, అమెరికాపతు తమకు 85 లక్షల డాలర్లు జయంతి కంపెనీ బాకీ ఉన్నట్లు ఈ కంపెనీలు చెబుతున్నాయి. ఇందులో ఎన్ని నిజమైనబాకీలో ఎన్నిగూడు పుటాణీ బాకీలో తెలియదు.

ప్రభుత్వ కుంటి సమర్థన

కాని ప్రభుత్వం సకాలంలో ఎందుకు మేల్కొనలేక పోయిందో శ్రీసంజీవరెడ్డిచెప్ప లేక పోయారు. డాక్టర్ ధర్మతేజ మోసం చేసినట్లు తెలియగానే ఆరురోజుల్లోనే ప్రధానినిర్ణయానికి వచ్చారనీ, ఆర్డినెన్సు ప్రకటించి కంపెనీ స్వాధీనపరచుకోడానికి ప్రభుత్వం నిర్ణయించిందని మాత్రం గొప్పగా చెప్పారు.

ఆరు సంవత్సరాలకాలం నిద్రపోయి ఆరురోజులలో మేల్కొన్నామని శ్రీ సంజీవరెడ్డి చెప్పిన సమాధానం పార్లమెంటులోపల, బయట ఎవరినీ సంతృప్తిని పరచలేదనడం నిస్సందేహం.

డాక్టర్ ధర్మతేజను శిక్షించడానికి భారత దేశం తీసుకురావడం తథ్యమనీ. శ్రీతిరుమల రావు అయినాసరే, ఎవరైనాసరే ఈ కంపెనీ కుంభకోణంలో భాగస్వామ్యం ఉన్న ఎవరినీ వదలిపెట్టేదిలేదని శ్రీ సంజీవరెడ్డి బీరాలు పల్కారు.

శ్రీ ధర్మతేజ ఇంగ్లండులో ఉన్నతను భవనాలు ఆదరాబాదరాగ అమ్మి పారవేసి ప్రస్తుతం ఫ్రాన్సులో ఉన్నట్లు తెలుస్తూంది. ఆయన ప్రస్తుత భార్యకు, ఆయనకు విడాకులు పొడసూపాయనీ. ఆమె ద్వారా మరి కొన్ని రహస్యాలు వెల్లడి కాగలవనీ తెలుస్తూంది.

జరగవలసిన కథ అంతా జరిగిపోయిన తరువాత, పిట్టచేజిక్కకుండా దాటిపోయిన తరువాత అంతవరకు చల్లగా మాట్లాడక వూరుకొని మన మంత్రివర్యులు ఆ తరువాత యిచ్చే హామీలకు ఎటువంటి విలువ ఉంటుందో వేరుగా చెప్పనవసరంలేదు.

జయంతి కంపెనీ కుంభకోణంలో పాలక వర్గం కుత్తుక బంటిగా దిగబడి ఉన్న విషయం సుఖ్తాంకర్ నివేదికలోను, పార్లమెంటు చర్చ సందర్భంలోను అతినగ్నంగా బైటపడింది, ఎంత దాచడానికి ప్రయత్నించినా అది దాగని సత్యం.

19 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పెట్టుబడిదారీవర్గం కోటానుకోట్ల ప్రజల కష్టార్జితాన్ని దోచుకొని పెరిగింది అందులో ఎంగిలి మెతుకులను పాలకవర్గంలోని వారికి విదిపి ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజాధనాన్ని తన స్వప్రయోజనాలకు స్వార్థానికి వినియోగించుకుంటూంది. జయంతి షిప్పింగ్ కంపెనీలో జరిగిన కుంభకోణం ఇందుకు మరొక ఉదాహరణ మాత్రమే.

నెహ్రూ సూచనలపై కొండ ప్రాంతాల పరిపాలనా వ్యవస్థ

లోక్‌సభలో నందా వివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

'కొండ ప్రాంతాలకు స్వయంనిర్ణయ ప్రతిపత్తి' విషయంలో స్వర్గీయ నెహ్రూ చేసిన సూచనలే ఆ ప్రాంతంలో ఏర్పడే పరిపాలనా వ్యవస్థకు ప్రాతిపదికగా వుంటాయని హోంమంత్రి నందా ఈరోజు లోక్‌సభాప్రశ్నోత్తరాలసమయంలో అన్నారు.

పటాస్కర్ కమిటీ నివేదికను, ఆ నివేదికపై కొన్ని రాజకీయ సంస్థలు వెలిబుచ్చిన అభిప్రాయాలను కేంద్ర మంత్రివర్గం పరిశీలిస్తున్నదని నందా చెప్పారు.

డాక్టర్ జి జి స్వేర్ ప్రశ్నకు మంత్రి జవాబు చెప్తూ అస్సాం కొండ ప్రాంతం సమస్యలకు రాజకీయ పరిష్కారం కనుగొనటానికి ప్రభుత్వం కృతనిశ్చయముతో వుందనీ, అందుకుయత్నిస్తున్నదనిహోంమంత్రిఅన్నారు.

కొండప్రాంతం రాజకీయ సంస్థలు చేసే ప్రతిపాదనలలోసామాన్యంకనుగొనటంలేదని శ్రీమతి జె. చందా ప్రశ్నకు జవాబుగా నందా చెప్పారు.

మిగతా ప్రాంతం ప్రజల నుండి, కొండ ప్రాంతం ప్రజలను వేరుగా వుంచాలనే బ్రిటిష్ విధానాన్నే ప్రభుత్వం కొనసాగించుతుందా? లేక వారిని మిగతా ప్రాంత ప్రజలలో సమ్మిళితం చేయటానికి అవసరమయిన చర్యలు తీసుకుంటారా? అని శ్రీ సి. సి. బామవా మంత్రిని ప్రశ్నించారు.

భారత సహకార రంగంపై అమెరికా కబంధ హస్తాలు

ఎరువులు వగైరా ఫ్యాక్టరీలు నెలకొల్పుతామని ఎర

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

భారతదేశ సహకార రంగంలో ఎరువుల ఫ్యాక్టరీలు, నూనె విత్తనాల ఫ్యాక్టరీలు విద్యుత్ కో ఆపరేటివ్‌లు నెలకొల్పే విషయంలో అమెరికా కో-ఆపరేటివ్ లీగ్ సహాయపడగలనని సంసిద్ధతను తెలియజేసింది.

ఈవిషయమై భారతప్రభుత్వంతో చర్చలు జరపటానికి ముగ్గురు సభ్యులుగల అమెరికా ప్రతినిధి వర్గం ఒకటి ఢిల్లీ చేరుకున్నది.

ఎరువుల పరిశ్రమల స్థాపనకు పనికివచ్చే స్థలాలను కూడా ఈ ప్రతినిధివర్గం పరిశీలించుతుంది.

తన మూడు మాసాల పర్యటన అనంతరం ఈ ప్రతినిధి వర్గం తన తాత్కాలిక నివేదికను అందజేస్తుంది.

నూనె విత్తనాల ఫ్యాక్టరీలు. విద్యుత్ కో-ఆపరేటివ్‌లకు సంబంధించిన ప్రతినిధి వర్గాలు త్వరలో వస్తాయి.

అమెరికా అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ ఈ మూడు ప్రతినిధివర్గాల పర్యటన కార్యక్రమాన్ని మన దేశంలో ఏర్పాటు చేసింది.

బ్యాంకుల జాతీయకరణ

అవసరమని కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీలో శ్రీ ఆజాద్ ప్రభృతుల ఉద్ఘాటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

బ్యాంకింగ్ పరిశ్రమను జాతీయం చేస్తే తప్ప, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచడంగానీ, ఆరంగానికి అవసరమైన వనరుల్ని సమకూర్చడంగానీ సాధ్యంకాదు, అని శ్రీ భగవత్‌ఝా ఆజాద్ నిన్న యిక్కడ జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గ సమావేశంలో మరోసారి గట్టిగా వాదించాడు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక ముసాయిదాపై ఈ సమావేశంలో రెండు గంటలపాటు చర్చ జరిగింది. శ్రీ మోహన్‌ధారియా అనే మరో సభ్యుడుకూడా శ్రీ ఆజాద్ ప్రతిపాదనను బలపరిచాడు.

కేవలం 20 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టిన గుత్తాధిపతులు యీ నాడు రెండువేల కోట్లు సుమారుగావున్న బ్యాంక్ నిధులమీద పెత్తనం చేస్తున్నారు అని శ్రీ ఆజాద్ చెప్పారు.

శ్రీ రామేశ్వర్ తాంతియా, శ్రీ ఆర్.యస్. పాండే (ప్రత్యేకఆహ్వానితుడు), శ్రీహిమ్మత్‌సింగ్‌కా ఈ ప్రతిపాదనను ఎదుర్కొన్నారు. సమావేశానికి పార్టీ ఉపనాయకుడు శ్రీ యస్. యం. ఘోష్ అధ్యక్షత వహించారు.

జాతీయం చేసిన పరిశ్రమల నిర్వహణ యేమంత సంతృప్తికరంగా లేదు, అందుకని బ్యాంకుల జాతీయకరణ పనికిరాదు అని శ్రీ హిమ్మత్‌సింగ్‌కా వాదించారు.

వాణిజ్య బ్యాంకులచేత వ్యవసాయ రంగానికి మరింతగా పెట్టుబళ్ళు యిప్పించాలని శ్రీ ఆర్. యస్. పాండే సూచించారు.

భూసంస్కరణలకు పెద్దఎత్తున ప్రయత్నాలు చేయాలి. ఎరువుల వుత్పత్తిని, నీటి పారుదల సౌకర్యాలను అభివృద్ధి చేయాలి. అలాచేస్తేతప్ప ఆహారధాన్యాలు, పత్తి, జనపనార వంటి వాటివిషయంలో పెట్టుకున్న ప్రణాళికా లక్ష్యాలు నెరవేరవు అని శ్రీ రామేశ్వర తాంతియా చెప్పారు. చిన్నవర్తకాన్ని వ్యాపారస్థులకే వదిలిపెట్టాలి. లేకపోతే నిరుద్యోగం మరింతగా ప్రబలుతుంది అని ఆయన అన్నారు.

చైనాలో ముఖ్యులపై రెడ్ గార్డుల నేరారోపణలు

పెకింగ్, సెప్టెంబరు 6

చైనా ఆరోగ్యశాఖామంత్రి షీన్ సిన్ చుంగ్ తన ఆధిపత్యంలోగల వైద్య సంస్థలో విప్లవోద్యమ వ్యాప్తిని నిరోధిస్తున్నాడని రెడ్ గార్డులు జారీచేసిన ఒక పోస్టరులో నేడు ఆరోపించారు.

షీన్ సిన్ చుంగ్ 1955 లో ఆరోగ్య శాఖ మంత్రి పదవిని స్వీకరించారు. ఆయన అనేకసార్లు క్యూబా, సోవియట్ యూనియన్ దేశాలను సందర్శించారు. 1965 లో చైనా రెడ్‌క్రాస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1961 నుంచి కాన్సూ రాష్ట్ర కమ్యూనిస్టు కేంద్ర కమిటీ ప్రథమ కార్యదర్శిగా పని చేస్తున్న వాంగ్‌ఫెంగ్ హానికరమైన శక్తులను సహిస్తున్నాడని ఆరోపిస్తూ, రెడ్‌గార్డులు జారీ చేసిన మరొక పోస్టర్‌లో పేర్కొన్నారు.

పెకింగ్‌లో రెడ్ గార్డుల రాజభోగాలు

ప్రాగ్, సెప్టెంబరు 6

పెకింగ్‌లో రాజభోగాలు అనుభవిస్తున్న అనేక మంది రెడ్‌గార్డులను శనివారంలోగా రాజధానీ నగరం వదలి పోవాలని చైనా అధికారులు ఆదేశించినట్లు చెకోస్లావాకియా వార్తాసంస్థ పెకింగ్ విలేకరి తెలుపుతున్నాడు.

అనేకమంది రెడ్‌గార్డులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చినవారు రాజధాని నగరంలో మావోసేటుంగ్ రచనలను అధ్యయనం చేయడానికి కాదు. రాజభోగాలు అనుభవిస్తున్నారని చైనా అధికారులు ఆరోపిస్తున్నారు.

సాంస్కృతిక విప్లవాన్ని అనుసరించే పేరుతో, పెకింగ్ నగరానికి వచ్చిపడిన అనేక వేలమంది విద్యార్థులలో "నమ్మదగని శక్తులు"వున్నట్లు పెకింగ్‌వీధులపై వెలుస్తున్న అధికార పోస్టర్లు వెల్లడిస్తున్నవి.

చైనా ప్రజా రిపబ్లిక్ వార్షికోత్సవాలు అక్టోబరు 1 వ తేదీన జరుగుతున్న దృష్ట్యా "నమ్మదగని" ఈ శక్తులన్నింటినీ పెకింగ్ నుంచి బహిష్కరించాలని అధికారులు నిశ్చయించినట్లు తెలుస్తున్నది.

బీహార్ బంద్‌లో సత్యాగ్రహులపై అత్యాచారాలు

శాసనసభలో నిరసన

పాట్నా, సెప్టెంబరు 6

అగస్టు 9 న జరిగిన బీహార్ బంద్ సందర్భంలో మోన్‌ఘీర్ జిల్లా లఖీసరాయ్‌లో 14 మంది సత్యాగ్రహులపై పోలీసులు జరిపిన అత్యాచారాల గురించి ప్రతిపక్ష సభ్యులు కొందరు తెచ్చిన వాయిదా తీర్మానంమీద యీ రోజు రాష్ట్ర శాసనసభలో రెండుగంటలపాటు తీవ్రమైన చర్చ జరిగింది.

బంద్ నిర్వాహకులు ప్రజలను హింసాచర్యలకు పురికొల్పారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారని ముఖ్యమంత్రి ప్రతిపక్షులపై ప్రత్యారోపణలు చేశారు.

తీర్మానంమీద ఓటింగ్ జరగలేదు.

పాకిస్తాన్ 'రక్షణ' దినోత్సవం

కరాచీ, సెప్టెంబరు 6

1965 సెప్టెంబరు 6 వ తేదీ పాకిస్తాన్ స్వాతంత్ర్య పోరాటంలో మరువలేని రోజని అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నాడు.

పాకిస్తాన్"రక్షణ"దినోత్సవ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ గత సెప్టెంబరులో పాక్ ప్రజలు దురాక్రమణ శక్తుల్ని జయప్రదంగా ఎదుర్కొన్నారని అన్నారు.

"ఈ కాలంలో పాకిస్తాన్‌కు నిజమైన మిత్రులెవరో శత్రువులెవరో తేలింది. తన భవిష్యత్ ఏమిటో పాకిస్తాన్‌కు అవగతమయ్యింది" అని చెప్పారు.

అవసర సమయంలో సాయపడిన దేశాలకు కృతజ్ఞత తెలుపకుండా వుండలేమని వారి ఋణాన్ని పాకిస్తాన్ తీర్చుకొంటుందని అన్నారు.

కామన్వెల్తు దేశాల సభకు వెళ్ళిన పాక్ విదేశాంగమంత్రి పీర్జాదా లండన్ నుంచి ఈ సందర్భంలో సందేశం పంపుతూ, కాశ్మీర్ వివాదం పరిష్కారం అయితే భారత పాకిస్తాన్‌లు శాంతిగా వుండగలవని అన్నారు.

కలకత్తా లారీసమ్మె విరమణ

కలకత్తా, సెప్టెంబరు 7

పది రోజులుగా సాగుతున్న కలకత్తా లారీ యజమానుల సమ్మె నేడు ముగిసింది.

రేపటినుండి లారీలు మామూలుగా తిరగడం ప్రారంభం అవుతుంది.

మలేషియా ఇండొనీషియాల మధ్య చర్చలు ప్రారంభం

కౌలాలంపూర్, సెప్టెంబరు 6

ఇండొనీషియా, మలేషియా దేశాల రక్షణ, భద్రతల విషయంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకొనడానికి ఉభయ దేశాల ప్రతినిధుల మధ్య నేడిక్కడ చర్చలు ప్రారంభమయ్యాయి.

మహాప్రదర్శనను దిగ్విజయంచేసిన వాలంటీర్లకు భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్రకార్యదర్శివర్గ అభినందనలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

భారత ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు ఆర్థిక విధానాలకూ, రూకవిలువ తగ్గింపునూ వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ పిలుపునందుకొని ఈ నెల 1వ తేదీన పార్లమెంటుభవనం ముందు మహా ప్రదర్శనజరిపిన లక్ష 50 వేల వాలంటీర్లనూ, ఈ ప్రదర్శనను జయప్రదం చేయడానికి అన్నివిధాలా కృషిచేసిన పార్టీ కార్యకర్తలను అభినందిస్తూ భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యదర్శి వర్గం ఒక ప్రకటన చేసింది.

ఈ ప్రకటనలో ఇలా వుంది.

"సెప్టెంబరు 1 వ తేదీన పార్లమెంటు భవనంముందు మహాప్రదర్శన జరపడానికి భారత కమ్యూనిస్టుపార్టీ పిలుపిచ్చింది.

"వివిధ రాష్ట్రాలలోపోరాటాలు కొనసాగుతున్న దృష్ట్యా భారత కమ్యూనిస్టుపార్టీ పతాక ఛాయల్లో పోరాటం కొనసాగిస్తున్న లక్షలాది మంది ప్రజానీకంలో లక్షమంది వాలంటీర్లు ఢిల్లీలోని పార్లమెంటు ముందు సమీకృతులు కావాలని కోరింది. పార్టీ కార్యకర్తలు ఈ పిలుపును దిగ్విజయం చేశారు. లక్షన్నరమంది వాలంటీర్లు రాజధానికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బంద్ ఉద్యమాలు, సమ్మెల నిర్వహణార్థం అనేక వేలమంది ప్రజానీకం ఈ ప్రదర్శనలో పాల్గొనలేక పోయినందుకు అనేకమంది తమ విచారాన్ని వెల్లడించారు.

1963 మార్చిలో జరిగిన మహా విజ్ఞాపన యాత్రను తిలకించినవారు ఈ ప్రదర్శన నాటి యాత్రకు యే విధంగానూ తీసిపోదని అభిప్రాయపడ్డారు. ఆనాటి యాత్రతోపాటు కోటి సంతకాల విజ్ఞాపనా పత్రాలు ఉన్నాయి. నేటి మహా ప్రదర్శనకు అవి లేవు. అయితే నేటి మహా ప్రదర్శనకు వచ్చిన వలంటీర్లు సరాసరి పోరాట రంగం నుండి వచ్చారు. ఆ పోరాటాలను, సంక్షోభ తీవ్రతనూ ఈ మహా ప్రదర్శన ప్రతిబింబించింది.

ఈ మహాప్రదర్శనలో పాల్గొన్న వారందరినీ, వారి వెనుక శ్రేణిలో నిలిచి, దేశాన్ని మహా విపత్తు పాల్జేస్తున్న కాంగ్రెస్ పాలకులకు తుది హెచ్చరిక సందజేసి వారి చర్యలను ప్రజలిక సహించబోరని స్పష్టం చేసేటందుకు వారిని ఈ మహా ప్రదర్శనకు పంపిన ప్రజలనూ భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శివర్గం అభినందిస్తున్నది.

విజయవాడ ఉపాధ్యాయులకు గృహవసతి

మున్సిపల్ ఛైర్మన్‌కు ప్రాథమికోపాధ్యాయుల విజ్ఞప్తి

విజయవాడ, సెప్టెంబరు 6

తమకు గృహ వసతి. వేతనాల చెల్లింపు, అక్రమ బదిలీలు, ఫర్నిచర్, స్పెషల్ పాఠశాలలకు కంటిన్జెన్సీల నియామకం మున్నగు విషయాలలో సత్వర చర్యకు విజ్ఞప్తిచేస్తూ విజయవాడ మున్సిపల్ ఛైర్మన్‌కు, పట్టణంలోని ప్రాథమికోపాధ్యాయులు 'ఉపాధ్యాయ దిన' సందర్భంగా విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు.

విజయవాడలోని ఎయిడెడ్ మిషన్, మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలకు చెందిన 600 మంది ఉపాధ్యాయులు గుజరాతి విద్యాలయ హాలులో 'ఉపాధ్యాయ దినం' జరుపుకున్నారు.

మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీ దళవాయి సుబ్బరామయ్య. పతాకావిష్కరణ జరిపారు. అనంతరం జరిగిన సభకు మున్సిపల్‌ఛైర్మన్ శ్రీ ఖుద్దూస్ అధ్యక్షత వహించారు. వేదికపై పట్టణములోని ప్రజాప్రతినిధులు శ్రీ పి.వి. రాఘవయ్య బస్వా అప్పలస్వామి, దళవాయి సుబ్బరామయ్య, కొల్లుకొండలు, ప్రకాశరావు. శ్రీమతి పోతిన అచ్చాయమ్మ, శ్రీమతి కోట సునందమ్మ. స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ దమ్మాలపాటి నాగేశ్వరరావు, సూపర్వైజర్ శ్రీ కృష్ణారావు, రిసెప్షను టీచరు శ్రీ ఎస్. మెషక్ ఆసీనులయ్యారు. అకాల మరణం చెందిన ఉపాధ్యాయులు బి. ఏసుదాసు, ఎన్. ఆనందరావు, యలమంచిలి సుబ్బయ్య, కనకరత్నమ్మలస్మృత్యర్థం కొంతసేపు మౌనం పాటింపబడింది.

తరువాత రిసెప్షనుటీచరు శ్రీ ఎస్.మెషక్‌కు శ్రీ పొంగూరి వెంకటేశ్వరరావుచే ఖద్దరు వస్త్రములు రాధాకృష్ణ జీవిత చరిత్ర, సన్మాన పత్రం సమర్పించబడింది.

మున్సిపల్ ఉపాధ్యాయుల తరఫున శ్రీ కొండయ్యచే ఖుద్దూస్‌కు మెమొరాండం సమర్పించబడింది. ఉపాధ్యాయులకు గృహవసతి, వేతనాల చెల్లింపు, అక్రమ బదిలీలు ఫర్నిచరు వసతి, స్పెషల్ పాఠశాలలకుకంటిన్జెన్సీలు నియమించుట మొదలగు వాటిని వినతి పత్రంలో పొందుపరచారు.

మున్సిపల్ కౌన్సిలరు శ్రీ పొన్నం వీరరాఘవయ్య తమ ప్రారంభోపన్యాసంలోఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యం వివరిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపట్ల తమ సానుభూతిని వ్యక్తం చేశారు. తదుపరి స్కూల్స్ ఇనస్పెక్టరు శ్రీ దమ్మాలపాటి నాగేశ్వరరావు, విజయవాడలోకూడా సెంటరుక్లాసు నడుపుటకు ప్రకటించవలసిందిగా మున్సిపల్ అధికారులను కోరారు. తదుపరి ఉపాధ్యాయుల ప్రతినిధి శ్రీ పి. వి. సుబ్బారావు శ్రీ లింగాల సుందరం మాట్లాడారు, ఇంకా శ్రీ యుతులు యలమంచిలి నాగభూషణం, కౌరి. డి. సాంబశివరావులు కూడా ప్రసంగించారు.

శాసనమండలిలోని ఉపాధ్యాయ ప్రతినిధి శ్రీ వి. శ్రీరామమూర్తి తమ ఉపన్యాసంలో 'కొఠారి కమిషన్' సిఫార్సులను అమలుజరపాలని, పేకమిటీ నివేదిక వెంటనే ప్రకటించబడాలనీ, చెప్తూ ఉపాధ్యాయుల కోర్కెలు కేవలం ఉద్యమాల ద్వారానే పరిష్కరింపబడగలవన్నారు. సెప్టెంబరు 6 నుండి 12 వ తేదీ వరకు 'ఉపాధ్యాయ రక్షణదినం' జరిపి డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి. పెద్దల దృష్టికి తీసుకరావలసిన అవసరాన్ని ఉద్ఘాటించారు.

పట్టణంలోని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను చేయగల్గినంత సహాయం చేయగలనని అధ్యక్షులు శ్రీ ఖుద్దూస్ తమ ఉపన్యాసంలో వాగ్దానం చేశారు. గృహవసతి ఏర్పాటు పథకం రూపొందింపబడగలదన్నారు. పాఠశాలలకు ఫర్నిచరు వెంటనే అందజేయగలమని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. బదిలీలుకూడా కొన్ని సూత్రములననుసరించి జరుపబడగలవనీ, సంవత్సర మధ్యకాలంలో బదిలీలు జరుగకుండా చూడగలననీ హామీ ఇచ్చారు.

కన్వీనరు శ్రీ తల్లపెనుమర్తి పూర్ణచంద్రరావుగారు వందనసమర్పణ జరిపారు. జనగణమన, విందుల తర్వాత సభ ముగిసింది.

అమలాపురం సమితి ప్రాథమికోపాధ్యాయసంఘం

అమలాపురం, సెప్టెంబరు 6

అమలాపురం సమితి ప్రాథమికోపాధ్యాయసంఘ జనరల్ కౌన్సిల్ సమావేశము ఇటీవల అమలాపురం శెట్టిబలిజ గ్రంథాలయములో శ్రీ వి. దుర్గారావు అధ్యక్షతను జరిగినది. జిల్లా సంఘ కార్యదర్శి శ్రీ సి.హెచ్. నాగేశ్వరరావుప్రారంభించారు. జిల్లాసంఘ ఉపాధ్యక్షులు శ్రీ ఎం. నరసింహస్వామి, తదితరులు హాజరై మాట్లాడారు.

శ్రీ కె. అప్పలస్వామి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా దానిపై 10 మందికి పైగా మాట్లాడారు. దీనితోపాటు వీరు ప్రవేశపెట్టిన జమా-ఖర్చులుకూడా చర్చించిన తర్వాత ఏకగ్రీవముగా సభ ఆమోదించారు,

రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ చేయుట, 60 ఏండ్ల పరిమితి జి.ఓ. అమలు జరుపుట మొదలగు 41 తీర్మానములను సభఆమోదించింది.

శ్రీ వై. సత్యనారాయణ అధ్యక్షులుగా నూతన కార్యవర్గం ఎన్నికయింది.

వేములపల్లి మహిళా మండలి నూతన భవన ప్రారంభం

వేములపల్లి, సెప్టెంబరు 6

కృష్ణాజిల్లా వేములపల్లి గ్రామములో స్వయంకృషితో మహిళామండలి నిర్మించుకొన్న భవనమును (మెడికల్ ఆఫీసరు) డాక్టరు దావ రామలింగయ్య ప్రారంభోత్సవం చేశారు.

మహిళామండలి భవన నిర్మాణమునకు,

రిక్షా కార్మిక కోర్కెల్ని త్రోసేసేందుకు యజమానుల ఎత్తు

రాజమండ్రి రిక్షా వర్కర్సు యూనియన్ ఖండన

రాజమండ్రి, సెప్టెంబరు 4

రాజమండ్రి రిక్షావర్కర్సు యూనియన్ కార్యవర్గ సమావేశం ఆగస్టు 25న శ్రీ పప్పు దేముడు అధ్యక్షతను జరిగినది.

రాజమండ్రి రిక్షా యజమానుల సంఘం వారు 10-9-66 వ తేదీ నుండి 0-97పైసలు అద్దెలను 1-37 పైసలకు పెంచుతున్నామని పంపిన నోటీసు పైనా, రిక్షా వర్కర్సు యూనియన్ మాజీ అధ్యక్షులు శ్రీ జి. ఎస్. బాలాజీదాసు సంఘ వ్యతిరేక కార్యకలాపాలపైన శ్రీ గేదెల సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. రిక్షా వర్కర్సు యూనియన్ 10 వ వార్షిక మహాసభలో రిక్షా కార్మికులకు సంబంధించిన సమస్యలపై చేసిన తీర్మానాల నుండి తప్పించుకొనే వుద్దేశంతో రిక్షా యజమానులు 10-9-66 నుండి పెంచుతున్నామని నోటీసు యివ్వడాన్ని తీవ్రంగా నిరశిస్తూ యీ పరిస్థితులను ఏదుర్కొనుటకు కార్మికులంతాఐక్యతతో వుండాలని ఆయన హెచ్చరించారు.

యూనియన్ మాజీ అధ్యక్షులు శ్రీ బాలాజీదాస్, ప్రజాస్వామ్య పద్ధతులను విడనాడి సంఘ విచ్ఛిన్నకులతో జతకట్టి సంఘనియమాలకు విరుద్ధంగా రిక్షావర్కర్సుయూనియన్ పేరుతో తప్పు ప్రకటనలుచేస్తూ కార్మికులలో అనైక్యతను కలిగించడాన్ని నిరసించారు.

శ్రీ కాపు యరకయ్య తదితరులు శ్రీ బాలాజీదాస్ సంఘ వ్యతిరేక చర్యలను ఖండిస్తూ మాట్లాడిన తరువాత యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

రిక్షాను కండిషన్‌లో వుంచి తేలికగా నడుచుచున్నట్లు తయారుచేసి యివ్వాలి. వర్షాకాలంలో కనీసం కార్మికుని తడతడవకుండా వెనుస్‌టోప్ యివ్వాలి. కార్మికుడు ప్రమాదానికి లోనైనప్పుడు జబ్బు పడినప్పుడు తగిన ఆర్థిక సహాయం చేయాలి. 1962 సంవత్సరంలో యూనియన్‌లో చేసుకున్న ఒడంబడిక ప్రకారం అద్దెలు పెంచరాదు. ఆదివారం అద్దె లేకుండగా రిక్షాలను వుచితంగా యివ్వాలి. ప్రతి కార్మి కార్మికునికి 6 మాసాలకు ఒక జత యూనిఫారం యివ్వాలి.

రిక్షా వర్కర్సు యూనియన్ 10 వ వార్షిక మహాసభ వేదిక నుండి కోరిన పై కోర్కెలను అమలుపరుస్తూ 10-9-66 వ తేదీనుండి రిక్షా అద్దెలు పెంచుటకు చేసిన తీర్మానాన్ని నిలుపుల చేయవలసినదిగా రిక్షా యజమానుల సంఘమువారిని కోరారు,

యూనియన్ మాజీ అధ్యక్షులు శ్రీ జి. యస్. బాలాజీదాస్ సంఘనియమాలను గౌరవించి యూనియన్ 10వ వార్షికమహాసభ నిర్ణయానుసారం యూనియన్ రిజిష్టర్లు వగైరా నూతన అధ్యక్షునికి స్వాధీనపరచి సంఘ ఐక్యతకు తోడ్పడవలని కోరారు, ఆలాపాటింక యిక ముందు యూనియన్ పేరుతో ఏవిధమైన కార్యకలాపములు జరిపినా తగిన పటిష్టమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరిస్తూ తీర్మానించారు.

నవారు నేత. కుట్టుపని, ప్రథమ చికిత్స గ్రంథాలయ నిర్వహణ, చిన్న మొత్తాల పొదుపు పథకము, చేతి పనుల అవరణను ప్రశంసిస్తూ, ప్రసంగించారు. కార్యక్రమములో పాల్గొన్న పెద్దలు శ్రీ వెంపటి కృష్ణమూర్తి, శ్రీ వెంపటి వెంకట గంగాధరశాస్త్రి శ్రీ సూర్యదేవర భాస్కరరావు (సర్పంచ్). కూడా జరుగుతున్న కృషిని ప్రశంసిస్తూ, ప్రసంగించారు. సంఘ కార్యదర్శిని సూర్యదేవర వరలక్ష్మి ప్రథమాంబ వార్షిక నివేదిక సమర్పించారు. సంఘ అధ్యక్షులు, పంచాయతి సభ్యురాలైన సూర్యదేవర శకుంతలాదేవి వందన సమర్పణతో కార్యక్రమము ముగిసింది. ఆ రాత్రి విందు జరిగినది.

బొంబాయిలో బార్ కౌన్సిల్ విద్యార్థుల నిరసన సమ్మె

బొంబాయి, సెప్టెంబరు 5

ఇటీవల అమలు జరిపిన ఒక సంవత్సరం నిర్బంధ శిక్షణ, పరీక్షలకు నిరసనగా బొంబాయి బార్ కౌన్సిల్ విద్యార్థులందరూ నేడు తమ తరగతులను బహిష్కరించి నిరసన సమ్మె జరిపారు.

బొంబాయి బార్ కౌన్సిల్ విద్యార్థుల కార్యాచరణ సమితి నేడొక ప్రకటన జేస్తూ ఇదే సమస్యమీద ఢిల్లీలో ఆందోళన జరుపుతున్న న్యాయ కళాశాల విద్యార్థుల పట్ల సానుభూతిగా నేడిక్కడ ఈ సమ్మె జరిపినట్లు తెలియజేసింది.

కొత్త నిబంధనల ప్రకారం ఎల్. ఎల్. బి. రెండవ సంవత్సరం పూర్తిచేసిన తర్వాత మరొక పూర్తి సంవత్సరం వరకు న్యాయకళాశాలవిద్యార్థులు ఏఉద్యోగం లోను ప్రవేశించటానికి అవకాశంవుండదని, కొత్త నిబంధనలు రద్దుచేసే పర్యంతం విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగించగలరని కార్యాచరణసమితి తన ప్రకటనలో పేర్కొన్నది.

స్వాతంత్ర్యానంతరం యువతరంలో రాజకీయ దృక్పథం పూజ్యం

ఇందిరా గాంధి విమర్శ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

స్వాతంత్ర్యానంతర దశలో యువతరంలో రాజకీయ. ఆర్థిక సమస్యలపట్ల ఉత్సాహం కన్పడటంలేదని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నేడిక్కడ ప్రపంచ క్రైస్తవ యువ మహిళల సదస్సులో మాట్లాడుతూ అన్నారు.

ఆర్థిక స్వాతంత్ర్య సాధనా పోరాట ప్రాముఖ్యతపట్ల యువజనుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించేందుకు ఏదో ఒక మార్గాన్ని కనుగొనాలని ఆమె అన్నారు.

ప్రపంచ ప్రధాన సమస్యలమీద, ముఖ్యంగా దేశ ఆర్థిక స్వాతంత్ర్యంపట్ల యువతరం అధికాధిక ఆసక్తిని ప్రదర్శించాలని ఆమె అన్నారు.

ప్రపంచంలో పలు ప్రాంతాలలో, రాజకీయమైన, ఆర్థిక సంబంధమైన ఉద్రిక్త పరిస్థితులు నెలకొని వున్నాయని ఆమె అన్నారు.

ధనిక, పేదప్రజల మధ్య వ్యత్యాసం పెరుగుతూవున్నదని, ప్రపంచ ఉద్రిక్తతకు దారితీసే కారణాలలో ఇదొకటని ఆమె అన్నారు.

ప్రస్తుతపరిస్థితుల్లో అంతర్జాతీయ ఆర్థిక సహకారం తప్పనిసరి అని ఆమె అన్నారు. పురోభివృద్ధి స్వాతంత్ర్యంవలెనే అవిచ్ఛిన్నమైనది. అయితే పురోభివృద్ధిని వెన్వెంటనే సాధించటం సాధ్యం కాదు.

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా ఆఫ్రికాదేశాల పెక్కింటిపై వివిధరకాలఆర్థిక వత్తిడులు తేబడుతున్నాయని ఆమె అన్నారు.

ఆమె ఇంకా ఇలా అన్నారు:

"ప్రపంచ రాజకీయరంగంలో ఉద్రిక్తత ప్రపంచంలో కొన్ని ప్రాంతాలలో యుద్ధాలు, అణ్వస్త్రాల నిల్వలు, వలసతత్వం జాతి వివక్షత కొనసాగుతున్నాయనేది నిజం.

ప్రపంచాన్ని ప్రస్తుతం ఎదుర్కొంటున్న వానిలో పెక్కు సమస్యలు ప్రమాదకరమైనవి. ఉద్రిక్తతను సడలించేందుకు మనం సకాలంలో పని చేయకపోతే, ఆ సమస్యలు పెద్ద ప్రళయాన్ని తెచ్చిపెడతాయి. ముఖ్యంగా బడుగు దేశాలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడతాయి.

ప్రపంచ క్రైస్తవ యువ మహిళల సదస్సుకు హాజరైన వివిధ దేశాల మహిళల ముందు భారతదేశం శాంతి సాధనకై అవిరామంగా కృషిచేయగలదని ఆమె ఉద్ఘాటించారు.

అయితే ఈ లక్ష్యసాధనకు, ఇతర దేశాలు మా సరిహద్దులపై దాడిచేసినప్పుడు కొన్ని ఇబ్బందులు కల్గుతాయి. అయితే, యుద్ధాల వల్ల ప్రజల అభివృద్ధి కుంటుపడుతుందని గమనించటంవల్ల మేము శాంతిసాధనకు తీవ్ర కృషి సల్పటానికి దృఢంగా నిశ్చయించుకున్నాం అని ఆమె అన్నారు,

భారత దేశంవలె బడుగు దేశమేదైనా సరే, త్వరితంగా అభివృద్ధిచెందితే, ఇతర దేశాల స్థాయికిచేరి. తమ దేశం ప్రజల అవసరాలను తీర్చగల్గాలి అని ఆమె అన్నారు.

వియత్నాంలో అమెరికా జరిపే దురాక్రమణ వ్యయం

ప్రతి నెలకు 200 కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

అమెరికా తన దురాక్రమణ యుద్ధంలో వియత్నాంలో 3 లక్షలకు పైగా సైన్యాలను దించింది. వీటిగాక, అమెరికా సప్తమ నౌకా దళానికి చెందిన మరో 70 వేలమంది సైనికులు దక్షిణ చైనా సముద్రంలో ఉంచింది. వియత్నాంకు తక్కిన ప్రపంచానికి మధ్య మామూలు సముద్రయానం జరగకుండా నిరోధించటంతోపాటు శాంతియుతవియత్నాం గ్రామాలపై వీరు నిత్యమూ నాపాం బాంబుల వర్షం కురిపిస్తూ ఉంటారు.

సైన్యాలు; అంతేకాదు: దక్షిణ కొరియా, ఫిలిఫ్ఫైయిన్సు, థాయ్‌లాండ్ నుండి అమెరికా దాదాపు 30 వేలమందిని రప్పించింది, స్పష్టమైన మాటల్లో చెప్పాలంటే వీరు మందు గుండు సామగ్రి కింద ఉపయోగింపబడుతున్నారు. అంతేగాదు. 53 వేలమంది అమెరికా వైమానిక సైనికులను (వీరిలో 15 వేలమంది థాయ్‌లాండ్‌లో, 30 వేలమంది ఒకినావాలో, 8 వేలమంది గువామ్‌లో ఉన్నారు,) అట్టిపెట్టారు. అవసరం వచ్చినప్పుడు యుద్ధంలో పాల్గొనడానికై వీరు సర్వసిద్ధంగా ఉన్నారు.

ఈ విధంగా విదేశాల్లోదింపివేసిన మొత్తం అమెరికా సైన్యాలలో దాదాపు 42 శాతం వియత్నాం యుద్ధంలోనే నిమగ్నమైఉన్నాయి.

ఖచ్చితంగా యుద్ధంలో పాల్గొంటున్న అమెరికా నావిక నౌకాబలం 5 డివిజనులు, రిజర్వుదళాలు రెండు వైమానికదళాలురెండు. ఇందులో "బిగ్ రెడ్ వన్" అని పిలువబడే ప్రథమ పదాతిదళం 1917 లోనే యేర్పడింది. ఇది యూరపులో ప్రపంచ ప్రథమ యుద్ధంలో పాల్గొన్నది. "ట్రాపికల్ లైట్నింగ్" అని పిలువబడే 25 వ పదాతి దళం కొరియా యుద్ధంలో పాల్గొన్నది. మొదటి వైమానిక డివిజన్ పాశ్చాత్య దేశాల కూటమిలోకెల్లా ప్రసిద్ధికెక్కింది.

మొదటి నౌకాదళం అమెరికా భూభాగం నుండి తరలింపబడింది. మూడో నౌకా దళం పసిఫిక్ సముద్రంలోని అమెరికా మొదటి యూనిట్లు. అమెరికాకువున్న మొత్తం నౌకా బలంలో మూడింట రెండువంతులు వియత్నామ్ లోనే పోరాడుతున్నది.

సైనికాధికారుల్లో 40 మంది మంచి అనుభవం గలవారు. వీరు ద్వితీయ ప్రపంచ యుద్ధంలో, కొరియా యుద్ధంలోపోరాడారు.

వైమానిక బలం: అమెరికా 17,000 హెలికాప్టర్లతోపాటు 4,500 విమానాలను ఉపయోగిస్తున్నది. అమెరికాకు ఉన్న మొత్తం యుద్ధవిమానాలలో 25 శాతం ఒక్క వియత్నాంలోనే వున్నాయి. తనకు వియత్నాంలో వున్న విమాన స్థావరాలనే కాకుండా థాయ్‌లాండులోని విమాన స్థావరాలను ఫిలిప్పైన్సులో వున్న క్లార్కు విమాన స్థావరాన్ని గువామ్, ఒకినావాలలో వున్న విమాన స్థావరాలను, అలాగే సప్తమ నౌకాదళ విమానాలన్నిటినీ అమెరికా ఉపయోగిస్తున్నది. సప్తమ నౌకా దళాధిపతి వైస్-అడ్మిరల్ జాన్ హైలెండ్ మాటల్లో చెప్పాలంటే. సప్తమ నౌకాదళానికి చెందిన 145 యుద్ధ నౌకలు, 2,700 విమానాల్లో 70 శాతం యుద్ధంలో ఉపయోగింపబడు తున్నాయి.

అణ్వాయుధాలు మినహాయిస్తే, యితర అత్యాధునిక ఆయుధాలన్నీ వియత్నాంలో ఉపయోగపడుతున్నాయి. ప్రయోగింపబడుతున్నాయి. వివిధ రకాలైన 2,000 టాంకులు 2,500 మరఫిరంగులు, మారణ రసాయనిక పదార్థాలు, మిసిలీలు, రాడార్లు. ఈ పాటి గుండుకు అంటుకునే కవచాలు, ఇనపబూట్లు అమెరికా సైన్యాల అధీనంలో ఉన్నాయి.

డిసెంబరు 31 వ తేదీతో అఖరయ్యే ఈ తొమ్మిది నెలల్లోను అమెరికా 3 లక్షల టన్నుల బాంబులను వియత్నాంపై వేయదలచిందని రక్షణ మంత్రి మెక్‌నమారా ప్రకటించారు. కొరియా యుద్ధంలో 37 నెలల కాలంలో ఉపయోగించిన మొత్తం ప్రేలుడు పదార్థాలకు ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ.

ఖర్చు: ప్రస్తుతం వియత్నాంలో అమెరికా దురాక్రమణకు నెలకు 2,000 శతకోట్ల డాలర్ల ఖర్చు అవుతున్నది. సెనెటర్ పుల్‌బ్రైట్ గత ఫిబ్రవరిలో కాంగ్రెస్ కమిటీ ముందు సాక్ష్యం ఇస్తూ, వియత్నాంలో అమెరికా యుద్ధవ్యయం 1950 నుండి 1954 దాకా 2800 శతకోట్ల డాలర్లు, 1955 నుండి 1964 దాకా 4000 శతకోట్ల డాలర్లు, 1965 లో 15300 శతకోట్ల డాలర్లని తెలియజేశారు.

అధికారరీత్యా యిచ్చిన లెక్కల ప్రకారం అమెరికా మొత్తం సైనిక బడ్జెట్‌లో నూటికి 27 వంతులు 1965లో వియత్నాంలో జరిపిన యుద్ధం క్రింద ఖర్చుపెట్టారు. 1966 లో ఈ ఖర్చు నూటికి 40 వంతులదాకా పెరగవచ్చుననుకొనుచున్నారు. గత రెండేళ్ళలోను ఆయిన మొత్తంఖర్చు కొరియా యుద్ధంలో మూడేళ్ళ కాలానికి ఖర్చుపెట్టిన దానికి దాదాపు రెట్టింపు.

గత అయిదేళ్ళలోను అమెరికా 69 000 మంది సైనికులను బలియిచ్చింది. 1966 ఆగస్టు 18 తేదీతో అంతమైన రెండేళ్ళలో 1,369 విమానాలు నాశనమైనాయి.

చిలకలూరిపేటలో అధిక ధరల నిరోధక ఉద్యమ విజయం

చిలకలూరిపేట, సెప్టెంబరు 6

నానాటికీ ధరలు పెరిగిపోతున్న పరిస్థితిలో గుంటూరులో జరిగిన విద్యార్థుల యువజన ప్రత్యక్ష కార్యాచరణ అవి సాధించిన విజయమూ చిలకలూరిపేట యువకుల ఉత్సాహ పరచింది. ప్రజలను కార్యాచరణకు పూనుకొనేటట్లు చేసింది. అక్కడ సాధించిన విజయంతోపాటు, అక్కడజరిగిన కొద్దిపొరపాట్లు గూడా గమనములోకి తీసుకొన బడింది.

పట్టణ యువజన సంఘంవారు చొరవతో ముందుకొచ్చి, ప్రదర్శన, అఖిలపక్ష బహిరంగ సభకు ఏర్పాటు చేశారు. వారే కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ కర్ణం నరసింగరావు సహకారంతో పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాల కార్యకర్తలను, హోటలు యజమానులను సమావేశపర్చి సంప్రదింపులకు ఏర్పాటు చేశారు. ప్రజల ఐక్యతను గమనించిన హోటలు యజమానులు పదార్థముల ధరలను తగ్గించుటకు ఒప్పుకొన్నారు. ప్రజా సంఘాల వారితో అగ్రిమెంటు వ్రాసుకొని, తగ్గించిన ధరలను 1-9-66 నుండి అమలు జరుపుతున్నారు.

ఈ సందర్భంలో 31-8-66 న యువజన సంఘ నాయకులు శ్రీ తోట నరసింహారావు అధ్యక్షతన అఖిలపక్ష బహిరంగ సభ జరిగింది, సభలో కాంగ్రెసు. ఉభయ కమ్యూనిస్టుపార్టీలనాయకులు, స్వతంత్ర పార్టీ, జనసంఘం, సోషలిస్టుపార్టీ నాయకులు మాట్లాడారు.

అడిగినంతనే ధరలను తగ్గించి, వాటిని వెంటనే అమలుజరుపుటకు అంగీకరించిన హోటలుయజమానుల నిర్ణయంపట్ల హర్షాన్ని వెలిబుచ్చుతూ తీర్మానించారు.

ప్రభుత్వంవారు హోటలు యజమానులకు, అవసరమైన సరుకులను సక్రమమైన ధరలకు క్రమ పద్ధతిలో సరఫరా అగుటకు అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా మరొక తీర్మానంలో కోరారు.

తెనాలిలో పాల వ్యాపారుల సమ్మె

తెనాలి, సెప్టెంబరు 7

సెప్టెంబరు 6న తెనాలితాలూకాపాలవ్యాపారుల సంఘ ఆదేశానుసారం గ్రామాలనుంచి తెనాలికి పాలు సప్లయి కాలేదు. ఫలితంగా పట్టణంలోని చిన్నచిన్న దుకాణాలతో సహా మొత్తం హోటళ్ళు మూసివేయబడినాయి.

(వి. వి.)

సభలు - సమావేశాలు

విశాఖజిల్లా యస్.జీ.ఓ.ల అసోసియేషన్ వారి వార్షిక మహాసభను యీ నెల 11వ తేదీన విశాఖపట్నంలో జరుపుటకు చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా కలెకటరు శ్రీ ఎస్. అబీద్ హుస్సేన్ ప్రదేశ్ ఎన్.జీ.ఓ.ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎ. శ్రీరాములు ప్రసంగిస్తారు. శ్రీ పి. సత్యనారాయణ జిల్లా అసోసియేషన్ వారి సావనీర్‌ను ఆవిష్కరిస్తారు.

రైల్వే ఆస్తి బిల్లుపై శ్రీ నంబియార్ విమర్శ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

నేడు లోక్‌సభలో రైల్వే ఆస్తి బిల్లుపై జరిగిన చర్చలో మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు శ్రీ ఆనంద నంబియార్ పాల్గొంటూ, బిల్లులోనిఅనేక క్లాజులను విమర్శించారు. 2 క్లాజులపై ఓటింగునుకోరారు.

అరెస్టయిన వ్యక్తులపైనున్న అభియోగాలను దర్యాప్తు జరపడానికి, ఆనేరాల దర్యాప్తు సందర్భంలో పోలీసు స్టేషను అధికారికున్న అధికారాలను రైల్వే భద్రతాదళ అధికారి నిర్వహించాలని అందులో ఒక క్లాజులో తెలిపారు. దీనిపై ఓటింగు తీసుకొనగా అనుకూలంగా 82 వ్యతిరేకంగా 10 వచ్చాయి.

రైల్వే భద్రతాదళం చేసే దర్యాప్తు న్యాయ విచారణగా భావించాలని వున్న 9వ క్లాజును తొలగించాలని శ్రీ నంబియార్ కోరారు. ఈ సవరణకూడా వీగిపోయింది.

రైల్వే ఆస్తి దొంగతనాల కేసుల విచారణకు రైల్వే భద్రతా దళానికి అధికారమిచ్చే రైల్వే ఆస్తి బిల్లును నేడు లోక్‌సభ ఆమోదించింది.

రాజ్యసభ ఈ బిల్లును లోగడనే ఆమోదించింది.

సరిహద్దు తగవుపై జనవాక్య సేకరణ

శ్రీ నిజలింగప్ప ప్రతిపాదన

బెంగుళూరు, సెప్టెంబరు 6

మైసూరు-మహారాష్ట్ర సరిహద్దు వివాదాల పరిష్కారానికి జనవాక్య సేకరణ సమస్య సెప్టెంబరు 10 న ఢిల్లీలో జరుగనున్న, ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రముఖంగా చర్చకు రావచ్చునని మైసూరు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప నేటి రాత్రి యిక్కడ పత్రికా విలేకరులతో అన్నారు,

వివాద పరిష్కారానికి నూతన పద్ధతులను గురించి శ్రీ నిజలింగప్ప నాగపూర్‌లో చేసిన ప్రకటనకు అర్థం జనవాక్య సేకరణ సమస్యను పరిశీలించడమా అని పత్రికా విలేకరులు ప్రశ్నించగా ఆయన పై విధంగా చెప్పారు.

తమ చర్చలవలన యేమంత ఫలితం రాలేదని తెలిపారు.

తాము కొంతసేపు చర్చించామని, కొన్ని నూతన సమస్యలను, నూతన పద్ధతులను తాము చర్చించాలని శ్రీ నాయక్ తలంచారని, దానిపై తాను సరేనన్నానని ఆయన పేర్కొన్నారు.

మైసూరు-మహారాష్ట్ర సరిహద్దు వివాద పరిష్కారానికి యేవిధమయిన నిర్ణయంచేసే దేశంలోని ఇతర రాష్ట్రాలమధ్య సరిహద్దు వివాదాల పరిష్కారానికి కూడ అదే నిర్ణయాన్ని వర్తింపజేయాలని అన్నారు.

గోవాలో జనవాక్య సేకరణ జరపబోయే ముందుగా నూతన ఎన్నికల జాబితాను తయారు చేయాలని, గోవా వెలుపలనున్న గోవన్లను కూడ జనవాక్య సేకరణజాబితాలో చేర్చాలని తెలిపారు.

ఆచ్ఛాదనలేని వాగన్లలో ఆహార ధాన్యాల రవాణా

అధిక దిగుమతులవల్ల తప్పనిసరి అని లోక్‌సభలో శ్రీ రామ్‌సుభాగ్‌సింగ్ వివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

ప్రస్తుత సంవత్సరంలో ఆహారధాన్యాలు అధికంగా దిగుమతి కాబడుతున్నదృష్ట్యా కరువు ప్రాంతాలకు వాటిని త్వరితంగా తరలించటానికి కొంతమట్టుకు కప్పులు మూతలేని రైల్వే వేగన్లు వాడవలసి వస్తున్నదని రైల్వేశాఖ స్టేట్‌మంత్రి శ్రీ రామ్‌సుభాగ్ సింగ్ లోక్‌సభలో నేడు చెప్పారు.

1966-67 వ సంవత్సరంలో ఒకకోటి 40 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు దిగుమతి కాగలవని భావిస్తున్నామని గత సంవత్సరం (1965-66)లో ఈ దిగుమతులు 79 లక్షల టన్నులని ఆయన తెలిపారు.

శ్రీ ఎన్. జి. రంగా. శ్రీ రామ్ సింగ్, మరికొందరు సభ్యులుయిచ్చినకాల్ అటెన్షన్ నోటీసుకు సమాధానంగా ఆయనపై విషయం తెలియజేశారు. ఎటువంటి ఆచ్ఛాదనమూతలు లేనిరైల్వేవాగన్లలో ఆహారధాన్యాలను గుంతకల్లునుండి ఆంధ్రప్రాంతంలోని చిత్తూరు, కడప మొదలగు ప్రాంతాలకు రవాణా చేసే సందర్భంలో అనేక లక్షల రూపాయలు నష్టం సంభవించినట్లు వచ్చిన వార్తల విషయం వీరు కాల్ అటెన్షన్ నోటీసులో ప్రస్తావించారు.

ఆచ్ఛాదనలు లేని రైల్వే వేగన్లలో ఆహార ధాన్యాలను తీసుకుపోయే సందర్భంలో అవి తడిసి పాడవకుండా వుండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోబడ్డాయని శ్రీ రామ్ సుభాగ్ సింగ్ తెలిపారు. గుంతకల్లునుండి ఆంధ్రప్రదేశ్‌లోని కడప చిత్తూరు మొదలగు ప్రాంతాలకు కప్పులు, మూతలేని వేగన్లలో ఆహార ధాన్యాలు ఎగుమతికానట్లు దక్షిణ రైల్వే అధికార్లు జరిపిన దర్యాప్తువల్ల తెలిసింది. అయితే గుంతకల్లునుండిగాక యితర స్టేషన్లనుండి రవాణా కాబడిన ఆహార ధాన్యాలకు నష్టం కలిగినట్లు తమ దృష్టికి వచ్చిందని. ఈ నష్టం కాల్‌అటెన్షన్ నోటీసులో ఉదహరించినంత పెద్ద మొత్తంలో జరగలేదని మంత్రి చెప్పారు.

చతుర్థ ప్రణాళికలో వైద్య పరిశోధనలకు ప్రాముఖ్యం

శ్రీ బి. ఎస్. మూర్తి వివరణ

బెంగుళూరు, సెప్టెంబరు 5

వైద్యంలో, ముఖ్యంగా వైద్యకళాశాలల్లో పరిశోధనలు కొనసాగించటంపట్ల నాల్గవ పంచవర్ష ప్రణాళికలో ప్రాముఖ్యమివ్వబడుతుందని కేంద్రఆరోగ్యశాఖ సహాయ మంత్రి శ్రీ బి. ఎస్. మూర్తి నేడిక్కడ చెప్పారు.

ఈ రంగంలో గత ప్రణాళికల ద్వారా ఇంతవరకు సాధించిన అభివృద్ధిని పదిలపర్చుకొని, వైద్యరంగంలో పరిశోధనలను మరింత ముందుకు కొనిపోవలసివుందని ఆయన అన్నారు.

పది రోజులపాటు శిక్షణ పొందుటకు, ఇక్కడకు వచ్చిన యూరోపు, ఆఫ్రికా, ఆసియాలకుచెందిన వివిధ దేశాల వైద్యాధికారుల సమావేశంలో శ్రీ బి. ఎస్. మూర్తి ప్రసంగించారు. ఈ సమావేశం జాతీయ క్షయ రోగ నివారణా సంస్థవద్ద జరిగింది. వివిధ దేశాలనుంచి వచ్చిన వీరు, ఈసంస్థలో శిక్షణపొందుతారు.

శ్రీ బి. ఎస్. మూర్తి తన ప్రసంగంలో ప్రపంచంలో జరుగుతున్న ఆరోగ్య ప్రచార ఉద్యమాలలో భారత దేశంలో జరుగుతున్న బి. సి. జి. టీకాలఉద్యమంఒకటని అన్నారు. భారతదేశంలో 22 కోట్ల 20 లక్షల మందిని పరీక్షించి, 8 కోట్ల 80 లక్షల మందికి బి. సి. జి. టీకాలు వేయటం జరిగిందని తెలిపారు. ఇరవై సంవత్సరాల వయస్సుకు తక్కువగా వున్న వారందరికీ పరీక్షలు జరిపే అవసరం లేకుండానే, యింటింటికి తిరిగి బి. సి. జి. టీకాలువేసే ఉద్యమం నేడు కొనసాగుతున్నదని చెప్పారు.

క్షయరోగం రాకుండా వుండేందుకు వాడే మందులను భారత దేశం ఉత్పత్తి చేస్తున్నదని, అయితే అవసరాలకు తగినంతగా వీటి ఉత్పత్తి జరగటం లేదని చెప్పారు.

పారిశ్రామిక ధ్వనుల నుంచి రక్షణకు కొత్త సాధనం

అఖిల యూనియన్ కార్మిక పరిరక్షణ పరిశోధకసంస్థలో పనిచేసే సోవియట్ ఇంజనీరు వ్లాదిమిర్‌బైదిన్ పారిశ్రామిక ధ్వనులనుంచి రక్షణ నిచ్చే కొత్త సాధనాన్ని ఒక దానిని తయారు చేశారు. ఆ సాధనంలో సన్నగా కాలగా మిగిలిన ఉన్ని పోగలు పొరలుగా అమర్చబడివుంటుంది. ప్రతి పొరలోనూ ఈ ఉన్ని వేరు వేరు విధాలుగా అమర్చబడుతుంది. ఈ ఉన్ని పొరలలో ఒక దానికి మరొక దానికి మధ్య కొంత ఖాళీఉంటుంది. శబ్దం ఒక పొరలోనుంచి మరొక పొరలోకి ప్రయాణించేటప్పుడు తన శక్తిని కోల్పోతుంది.

ఈ సాధనంలోనున్న మరొక విశేషం ఏమంటే, అది మన చెవులకు బాధ కలిగించే కర్కశ శబ్దాలను మాత్రమే హరిస్తుంది. మానవ కంఠధ్వనిని ఏ మాత్రం అడ్డగించదు.

ఇది చాలా అనువైన సాధనం. నమ్మకంగా పని చేస్తుంది. దాని బరువు 150 కిలోగ్రాములు మాత్రమే.

(నొవోస్తి వార్తాసంస్థ)

ప్రజల, రైతుల పీడనకుపయోగంగా ప్రభుత్వ రుణ సేకరణ

శాసన సభ్యులు శ్రీ లక్ష్మణస్వామి విమర్శ

కంకిపాడు. సెప్టెంబరు 6

కంకిపాడునుండి శాసనసభ్యులు శ్రీ మైనేని లక్ష్మణస్వామి యిలా ప్రకటిస్తున్నారు.

"ప్రజలనుండి ఆంధ్ర ప్రభుత్వం అప్పు తీసుకోడానికి ప్రకటన చేసింది. ఇది ప్రతి సంవత్సరం మామూలుగా జరిగేదంతే, ఈ సంవత్సరం మరొకసారి ప్రకటన వచ్చింది.

ప్రభుత్వ ఉద్యోగులందరు గ్రామాలవెంట బయలుదేరినారు. ఎరువుల కోటాలుయిచ్చే పెత్తనం సమితులది. అందుచేత బి.డి.ఓలు బయలుదేరుతున్నారు. ప్రతి ఎరువుల బస్తాకు అదనంగా అయిదు రూపాయలు వసూలు చేయమనేది వీరు రైతులకు చేస్తున్న సౌకర్యము. ఈ వసూలు చేసిన మొత్తాలు ఏమవుతాయి. కొన్ని ఆఫీసర్ల స్వంతఖాతాకు పోతవి. మిగిలిన సొమ్ము వడ్డీ వ్యాపారులకు కమీషన్ క్రింద యిస్తారు. ప్రభుత్వ అప్పులను ప్రకటిస్తే జిల్లాలవారీగా యింత పెట్టుబడి పెట్టినారు అని ప్రకటనలు వస్తవి. ఇలా రైతుల వద్ద వసూలుచేసి వడ్డీ వ్యాపారులను దాగుచేసేకంటే వారినే వత్తిడిచేయవచ్చుగా? దీని అర్థం యీ ప్రభుత్వం చేసే పనులు గుత్త పెట్టుబడిదారీ వర్గాన్ని సృష్టించడం కాదా? అవినీతిని బహిరంగా ప్రోత్సహించడం కాదా?

పంచాయతీరాజ్ డిపార్టుమెంటులో మరొక వర్గం పంచాయతీ ఆఫీసర్లు. వీరు అప్పులు వసూలుచేసే పద్ధతి రెండురకాలు. ఒకటి కమిషన్లు వసూలుచేయుటం, రెండవది పంచాయతీకున్న డబ్బు ప్రభుత్వానికి అప్పుగా యిప్పించటం.

కంకిపాడు పంచాయతీవారు పంచాయతీ భవనం కట్టుకోడానికి 28 వేలకు ఎస్టిమేటు వేయించుకున్నారు. ఈ భవన నిర్మాణానికి ఆంధ్రప్రభుత్వం 5 వేల రూపాయలు గ్రాంటు యిచ్చింది,

కాని యీ భవన నిర్మాణానికి పంచాయతీ డిపార్టుమెంటు అవసరమైన శాంక్షను యివ్వలేదు. భవన నిర్మాణ దృష్ట్యా పంచాయతీలో డబ్బు నిల్వ ఉంచుకుంటే అందులో 10 వేలు అప్పుపెట్టమని వత్తిడి చేస్తున్నారు.

లంచగొండి యంత్రాంగం

లంచంలేకుండా పనిజరగని దుస్థితి. సోషల్‌వెల్‌ఫేర్ స్కాలర్‌షిప్‌లకు డిప్యూటీ తహసిల్‌దారు హోదాకు తక్కువకాని రెవిన్యూ ఉద్యోగులు సర్టిఫై చెయ్యాలి. అందుచేత వేలాది విద్యార్థులు విజయవాడ తాలూకా ఆఫీసుకి వెళుతున్నారు. ప్రతి దరఖాస్తుదారునికి అర్ధరూపాయి మామూలు తీసుకుని ఫారం సరిగా చూడకుండానే సర్టిఫై చేస్తున్నారు.

ఒక హరిజన క్రిష్టియన్‌ని డినోటిఫైడ్ ట్రైబ్‌గా సర్టిఫై చేసిన ఉదంతంకూడా ఉన్నదంటే సర్టిఫికెట్‌పై సంతకాలు ఎంత గుడ్డిగా జరుగుతున్నవో అర్థమవుతున్నది,

అందుచేత ప్రజలను హింసించి పెట్టుబడిదారీవర్గాన్ని పోషిస్తున్న యీప్రభుత్వాన్ని అవినీతికి లంచగొండితనానికి ఆలవాలమైన యీ ప్రభుత్వాన్ని ఏవిధంగా శిక్షించాలో ప్రజలే ఆలోచించాలి. ఎల్లెడలా ప్రతిఘటించాలి."

సెప్టెంబరు 8, 9 తేదీలలో వర్తకుల హర్తాళ్

విజయవాడ, సెప్టెంబరు 6

ఆంధ్రప్రదేశ్ కిరాణా వర్తక మహాసభ కార్యాచరణ సంఘ కన్వీనరు శ్రీ కె. రోశయ్య ఇలా ప్రకటిస్తున్నారు.

"సెప్టెంబరు 8,9 తేదీలలో రాష్ట్రవ్యాప్తముగా వ్యాపారుల హర్తాళ్ జరుపుటకై తీసుకొనిన నిర్ణయం ఎవరినీ బెదిరించుటకై ఉద్దేశించబడినది కాదు. ప్రజలను ఇబ్బంది పరచటం మా వుద్దేశ్యం కాదు, యీ నాడు ఆంధ్రప్రదేశ్‌లోని వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికిదెచ్చి ప్రజలకు వివరించేందుకు మాత్రమే కార్యక్రమం తీసుకున్నాం. దీనిని ప్రజానీకం సానుభూతితో అర్థం చేసుకొని సహకరింపగోరుచున్నాము. వ్యాపారులు కోరుతున్నది కల్తీలు కొనసాగాలనికాదు. కల్తీదారులను శిక్షించవలదనుట లేదు. వాస్తవమైన కల్తీదారులను శిక్షిస్తూ తప్పు చేయనివారికి రక్షణ కల్పించమని కోరుచున్నారు. అమ్మకం పన్ను శాఖాధికారులచే నిరంకుశంగా కాంపౌండింగ్ ఫీజుల పేరున చేయిస్తున్న అక్రమ వసూళ్ళను రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఆపు చేయించవలెనని వ్యాపారులు ముక్తకంఠముతో కోరుచున్నారు. ఈ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వమునకు విజ్ఞప్తులద్వారా వ్యాపారులు ఎంతోకాలంగా తెల్పుకొనుచున్నా పరిష్కారం కాలేనందునయీహర్తాళ్ నిర్ణయం తీసుకొన్నారు. దీనిని ప్రజానీకం సానుభూతితో అర్థం చేసుకొని సహకరింప గోరుచున్నాము సెప్టెంబరు 8, 9 తేదీలలో ప్రజలకు వలయు నిత్యజీవితావసర వస్తువులు వ్యాపారులు సరఫరా చేయలేరు గనుక ప్రజలు మన్నిస్తూ వారికి వలయు వస్తు సముదాయమును ముందుగానే కొనుమని గోరుచున్నాము. వివిధ పత్రికలు మాకు ఇంతవరకు యిస్తున్న సహకారమునకు కృతజ్ఞత. ఇకముందు కూడా ఇలాంటి సహకారమునే అర్థిస్తున్నాము."

సోవియట్ యూనియన్‌లో మూడవ అంతర్జాతీయ విద్యార్థి వేసవి పాఠశాల

వేసవినెలల్లో కాలేజీలలోని, విశ్వవిద్యాలయాలలోని లేబరేటరీలు నిర్మానుష్యమవుతాయి. అయితే ఆ సమయంలో విద్యార్థులకు అంతర్జాతీయ విద్యార్థి మహాసభలు, ఉత్సవాలు, గోష్ఠులు, వేసవి పాఠశాలలు మొదలైన ఇతర కలాపాలుకూడా ఉంటాయి. ఈ సంవత్సరం సోవియట్ విద్యార్థి సంఘ కౌన్సిలు అంతర్జాతీయ విద్యార్థి వేసవి పాఠశాలను నిర్వహించవలది కొన్ని ఇతరదేశాల విద్యార్థులకు ఆహ్వానాలు పంపింది.

నిజానికిలాంటి విద్యార్థి వేసవి పాఠశాలలు, ఫ్రాన్సులోని కేన్సులో గత అర్ధ శతాబ్దంగా జరుగుతున్నాయి. 50 సంవత్సరాలక్రితం, కేన్స్ విశ్వవిద్యాలయ నిర్వాహకాధికారులు, వేసవిలో ఖాళీగా వుండే తమ విశ్వవిద్యాలయ భవనాలను మరేదైనా మంచి పనికి వినియోగించాలని నిర్ణయించారు. చక్కని విశ్రాంతి మందిరాలని ప్రపంచమంతటా పేరుగాంచిన తమ విశ్వవిద్యాలయ భవనాలలో, ఫ్రెంచి భాషను నేర్చుకోవాలనే కుతూహలంగలవారు వచ్చి వేసవికాలాన్ని ఆ భాషాధ్యయనంలోనూ, ఫ్రెంచి నాగరికతను గురించి తెలుసుకోడంలోనూ గడపవలసిందిగా ఇతరదేశాల వారికి ఆహ్వానాలు పంపారు. చాలామంది ఆ ఆహ్వానాన్ని అంగీకరించి వచ్చారు. ఆ తరువాత నార్వే. స్వీడన్, తదితర యూరపియన్ దేశాలలో కూడ ఇదేమాదిరి వేసవి పాఠశాలలు నెలకొల్పబడసాగాయి. పాఠశాలలను ఏర్పాటు చేసిన దేశపు భాషను నేర్పుకోడంవరకే ఆ పాఠశాలల కార్యక్రమాలు పరిమితమై వుంటూవచ్చాయి. ప్రతిరోజూ సాయంకాలం, అతిథులకు జాతీయ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయబడేవి.

1960 లో సోవియట్ విద్యార్థికౌన్సిలు మొట్టమొదటిసారిగా తమ దేశంలో అంతర్జాతీయ విద్యార్థి వేసవి పాఠశాలను ఏర్పాటు చేయదలచింది. అది క్రిమియాలో ఏర్పాటు చేయబడింది. ఆ పాఠశాల నిర్వహణ అంతా సంప్రదాయ సిద్ధాంగానే జరిగింది. పాఠశాల ఏర్పాటు చేయబడినచోటు ఒక అందమైన సముద్రతీరం. అక్కడ రష్యన్ భాష నేర్పబడింది. వినోదయాత్రల్లు, నృత్య ప్రదర్శనలు వగైరాకూడ ఏర్పాటు చేయబడ్డాయి. పాఠాలతోపాటు ఆసక్తిదాయకమైన రాజకీయ చర్చలుకూడా ప్రారంభమైనాయి. గురుజుఫ్‌లో ఏర్పాటైన పాఠశాలలో 'జాతీయ స్వాతంత్ర్యమూ సంస్కృతి' సమాజమూ ఉన్నత పాఠశాల "విద్యార్థులూ నిరాయుధీకరణ" మొదలైన విషయాలపై చర్చలు జరిగాయి. ఈ చర్చలు చాలామందిని ఆకర్షించాయి. అనతికాలంలోనే ఈ పాఠశాలకు అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమంలో మంచి పేరువచ్చింది.

62 దేశాల ప్రతినిధులు

మూడు సంవత్సరాల తరువాత కీవ్ నగరంలో రెండవ అంతర్జాతీయ విద్యార్థి వేసవి పాఠశాల ఏర్పాటు చేయబడింది.

ఆ పాఠశాలకు 62 దేశాలనుండి విద్యార్థి ప్రతినిధులు వచ్చారు. ఇతర కార్యక్రమాలతోపాటు, 'విద్యార్థులు, విశ్వ విద్యాలయము, నేటి ప్రధాన సమస్యలు' అనే విషయంపై చర్చలు జరిగాయి. అలాగే, సమాజాభివృద్ధికి, వ్యక్తి అభివృద్ధికి గల అవకాశాలేమిటనే విషయమైకూడ చర్చలు జరిగాయి. ఈ చర్చ 18 గంటలసేపు విరామం లేకుండా జరిగింది.

ఇప్పుడు ఏర్పాటుచేయబడే మూడవ అంతర్జాతీయ విద్యార్థి వేసవి పాఠశాల లెనిన్‌గ్రాడ్ నగరంలో జరిగింది. "విద్యార్థులు - సాంఘిక పురోగమనం" అనే విషయంపై చర్చలు జరిగాయి.

లెనిన్‌గ్రాడ్ నగరవీథులు ఈ పాఠశాలకు సంబంధించిన బేనర్లతో అలంకరింపబడ్డాయి. ఈ సంవత్సరం జరిగిన చర్చకు లెనిన్‌గ్రాడ్ నగరం ఎంతో తగివుంది. ఎందుచేతనంటే దాదాపు 50 సంవత్సరాలక్రితం సాంఘిక ప్రగతిలో నూతనదశ ఈనగరంలోనే ఆరంభమైంది.

లావోస్ రాజధాని మెకాంగ్ నదిపాలు

వియాతియానె, సెప్టెంబరు 6

మెకాంగ్‌నది పొంగటంతో లావోస్ రాజధాని జలమయం అయ్యింది. పట్టణంలో మూడింట రెండు వంతులు నీటమునిగిపోయింది.

"నష్టం ఊహించలేనంతగావుంది. దీనిని నివారించటం అలవిగాని పని. ఇంత పెద్ద యెత్తున వరదలు వస్తవని ఎవరూ ఊహించలేదు" అని లావోస్ రాజు అన్నారు.

దేశంలో ఈ వరదలవల్ల నష్టం కొన్ని కోట్ల డాలర్లు వుంటుందనుకుంటున్నారు.

రాజధాని చుట్టూవున్న ధాన్యం పండే పొలాలు నీటమునిగిపోయాయి. నగరంలో నడవటం కష్టంగాకుండా వుంది. రవాణా బంద్ అయింది. వార్తా సంబంధాలు దెబ్బతిన్నాయి.

రాజధానిలో 10 వేలమందికి తిండి, మందులుకూడా అందని స్థితి ఏర్పడింది.

రేడియో

శుక్రవారం — సెప్టెంబరు 9
శక 1887 ★ భాద్రపద 18

విజయవాడ

357.1 మీ. (840 కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, శుభోదయం, ప్రసారవిశేషాలు; 6-10 భక్తిరంజని తరంగాలు; 6-40 అం.వా; 6-45 సూక్తిముక్తావళి; 6-50 బజారు ధరలు; 7-00 తె. వా; 7-15 గాంధీ మార్గము: 7-40 వీణ; 8-00 అం. వా; 8-15 హిం. వా; 8-30 హై. రిలే; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 మాధ్యమిక పాఠశాలలకు; 12-05 గానసుధ; 12-30 కార్మికుల కార్యక్రమం; 1-00 వనితావాణి; 1-30 అం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 హై. రిలే; 6-00 అం. వా; 6-05 వాద్య బృందం; 6-15 ప్రాం. వా; 6-25 ముఖ్య ప్రకటనలు; 6-30 పంట సీమలు; 7-00 తె. వా: 7-15 దీక్ష; 7-30 హై. రిలే; 7-45 హై. రిలే; 9-00 అం. వా; 9-15 వార్తలు; 9-20 విరామ సంగీతం. 9-30 రూపకం; 10-15 వీణ; 10-30 అం. వా; 10-35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (ఏ)

405.4 మీ. (740కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, కార్యక్రమ వివరణ; 6-10 భక్తిరంజని; 6-40 అం. వా: 6-45 సూక్తిముక్తావళి: 6-50 వి. రిలే; 7-00 తె. వా; 7-15 వి. రిలే: 7-40 విరామ సంగీతం: 7-45 సంగీతశిక్షణ: 8-00 అం. వా; 8-15 హిం. వా; 8-30 ఖయాల్; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 వి. రిలే: 12-05 ప్రసార సమాప్తి.

12-30 వి. రిలే; 1-00 వి. రిలే; 1-30 అం. వా; 1-40 చిత్రపట్‌సే; 1-50 తె. వా; 2-00 వాతావరణ సూచన; 2-10 ఉ. వా; 2-20 ప్రాదేశిక్ సంగీత్; 2-30 సమాప్తి;

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 లలిత సంగీతం; 5-50 పద్యపఠనం: 6-00 అం. వా; 6-05 ప్రాం. వా. - ఉర్దూ: (హైద్రాబాద్, కడపలు మాత్రమే) 6-15 ప్రాం. వా; 6-25 ముఖ్య ప్రకటనలు; 6-30 గ్రామస్థుల [illegible], 7-00 తె. వా; 7-15 దీక్ష; 7-30 రూపకము: 7-45 వయొలిన్; 9-00 అం. వా; 9-15 ఉ. వా: 9-30 ఆంగ్లం; 10-15 ఖయాల్; 10-30 అం. వా; 10-35 హిం. వా; 10-40 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (బి)

కడప

333.3 మీ. (900 కిలో సై.)
సాయంత్రం 5-30 నుండి రా॥ 10-40 వరకు
శనివారములు మాత్రము
(సా॥ 5-30 నుండి రాత్రి 11-10 వరకు)

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5-40 నుండి రా॥ 10-35 వరకు

89.42 మీ. (3355 కిలో సై.)
[హైద్రాబాద్ మాత్రమే]

ఉదయం: 6-30 హై.ఎ.వలె; 7-45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై)

8-00 హై. ఎ. వలె; 8-30 పాకాల సావిత్రీదేవి; 9-00 ప్రసార సమాప్తి.

11-45 గాత్రం; 12-05 ప్రసారసమాప్తి.

42.02 మీ. (7140 కిలో సై.)
[హైద్రాబాద్ మాత్రమే]

మధ్యాహ్నం: 12-30 హై. ఎ. వలె; 2-10 గానసుధ; 2-20 హై. ఎ. వలె: 2-30 ప్రసార సమాప్తి.

62.50 మీ. (4800 కిలో సై.)

సాయంత్రం: 5-30 హై. ఎ. వలె; 7-00 తె. వా; 7-15 హై. ఎ. వలె; 9-15 వార్తలు; 9-20 విరామసంగీతం; 9-30 హై. ఎ. వలె; 10-15 పాకాల సావిత్రీదేవి: 10-30 హై. ఎ. వలె; 10-40 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై)

ఉదయం: 6-00 వందేమాతరం, మంగళ గానం; 7-00 తె. వా: (193.5 మీటర్లపై గూడా); 7-15 సంగీతమంజరి; 7-30 నాదస్వరం: 8-00 అం. వా; 8-15 సమాప్తి.

మధ్యాహ్నము: 11-55 ప్రాంతీయ కెయిదిగళ్: 1-00 పాశ్చాత్యసంగీతం: 1-30 అం. వా: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 వేణువు: 2-30 ప్రసార సమాప్తి.
(6-30నుండి6-40వరకు 60.98 మీ.పైగూడ)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం, 6-00 అం.వా; 6-05 ప్రాంతీయ కెయిదిగళ్: (193.5 మీటర్లపైగూడా) 6-20 వాతావరణ సూచన, స్థానికప్రకటనలు: వాణిజ్యవార్తలు; కార్యక్రమ వివరణ; 6-40 విరామ సంగీతం; 6-45 నాదస్వరం; 7-00 తె. వా: (193.5 మీటర్లపై గూడా) 7-15 గీతమాలిక; 7-30 విశ్వవిద్యాలయాలకు; 8-00 ఆంగ్లప్రసంగం; 8-10 విరామ సంగీతం: 8-15 జయభేరి - రూపకం; 8-30 మెల్లిశై, 8-45 వాద్య సంగీతం; 8-50 విరామ సంగీతం; 9-00 అం. వా; 9-15 వార్తలు; 9-20 విరామ సంగీతం; 9-30 ఆంగ్లం; 10-15 పాశ్చాత్య సంగీతం; 10-30 అం. వా; 10-35 వాతావరణసూచన - జన గణ మన - సమాప్తి.

అగస్టు 31 నాటికి జాతీయ రక్షణ నిధికి 79.41 కోట్ల రూపాయలు విరాళం వచ్చాయి.

అరబ్ రాజ్యాలలోని అభ్యుదయ శక్తులమధ్య సమైక్యత

సెప్టెంబర్ 5న జరగాల్సిన అరబ్‌లీగ్ శిఖరాగ్రసభ, అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ అభ్యంతరం పెట్టడంతో నిరవధికంగా వాయిదా పడింది. ఇది అరబ్ రాజకీయ రంగంలోని బలాబలాలమధ్య వస్తున్న పరిణామాలను సూచిస్తున్నది.

అల్జీరియాలోనూ, కైరోలోనూ లీగ్ సచివాలయంపై శిఖరాగ్రసభకు అవసరమైన సన్నాహాలన్నీ యించుమించుగా పూర్తిచేసిన తరుణంలో నాజర్ జూలై మాసంలో ఈజిప్టు విప్లవం 14వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తూ చేసిన ప్రకటనలో, లీగ్ కార్యాలయానికి చేసిన అభ్యర్థనతో ఈ సభ నిలిచిపోయింది. అభివృద్ధినిరోధకశక్తుల సరసన తమ దేశం ఆ సభలో పాల్గొనజాలదనీ, అలాంటి సభ జరిగితే, దానిని ఆ శక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకొనేసావకాశం వుండటమే తమ నిర్ణయానికి కారణమని ఆయన ప్రకటించారు.

“అయితే మేము శిఖరాగ్ర సమావేశాల్లో అసలే పాల్గొనమని దాని అర్థంకాదు...... అరబ్ జాతీయశక్తులకు వ్యతిరేకంగా కొన్ని కొన్ని రాజ్యాలు సామ్రాజ్యవాదులతో పెట్టుకుంటున్న పొత్తు అంతమైతే, పాలస్తీనా సమస్యపై ఐక్య కార్యాచరణకు కలిసివస్తే, మేము మా వైఖరిని పునరాలోచించుకోవడానికి సిద్ధమే. అలాంటప్పుడు శిఖరాగ్రసభ జరపడానికి వీలవుతుంది.” అని నాజర్ చెప్పారు.

నాసర్ చేసిన ఈ ప్రతిపాదనపట్ల అరబ్ రాజ్యాల వైఖరుల్లో వైవిధ్యం కన్పించింది. అరబ్ రిపబ్లిక్‌తోసహా 9 రాజ్యాలు శిఖరాగ్ర సభ వాయిదా వేసేటందుకు సుముఖత తెలిపాయి. సౌదీఅరేబియా, జోర్డాన్‌లు వ్యతిరేకించాయి. అరబ్ లీగ్‌కు దూరంగా వుంటున్న టునీషియా ఈ సభలో తాను పాల్గొనబోవడంలేదని చెప్పింది.

శిఖరాగ్రసభ నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, వివిధ అరబ్ రాజ్యాల ఉమ్మడి సంస్థల భవితవ్యం గురించి చర్చించే కోసం బహుశా విదేశాంగ మంత్రుల సమావేశం జరగవచ్చు.

అరబ్ ప్రపంచంలో నూతన పరిణామాలు

ఈ తాజా పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే 1964 జనవరిలో కైరోలో తొలిసారి అరబ్ శిఖరాగ్రసభ జరిగిన దరిమిలా అరబ్ ప్రపంచంలో వచ్చిన పరిణామాలను తెలుసుకోవాలి. 1964 సభలో అరు రాజ్యాల అధ్యక్షులు, రెండు దేశాల ప్రధానులు, ముగ్గురు రాజులు, యిద్దరు అమీర్‌లు (ఫ్యూడల్‌వర్గ పాలకులు) పాల్గొన్నారు.

1964 తరువాత యిలాంటి మరో రెండు సమావేశాలు, ఒకటి అలెగ్జాండ్రియాలోనూ, మరొకటి కాసాబ్లాంకాలోనూ జరిగాయి. పాలస్తీనా సమస్యతోపాటు ఈ సమావేశాల్లో అరబ్ దేశాలకు సంబంధించిన యింకా అనేక సమస్యలను యీ సభలో చర్చించడం జరిగింది. వివిధ అరబ్ దేశాలమధ్య యేర్పడిన అనేక వివాదాలను, సంఘర్షణలను, యీ సమావేశాలద్వారా పరిష్కారం లభించింది. అరబ్ లీగ్ మరింత పటిష్టమైన సంస్థగా రూపొందింది.

అయితే, ఆ తరువాత దశలో యిలాంటి శిఖరాగ్ర సమావేశాల్లోని వైరుధ్యం భిన్నత్వం వ్యక్తంగా నారంభించింది. పెట్టుబడిదారీయేతర అభివృద్ధి పంథాను స్వీకరించి, సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ విధానాన్ని అనుసరించే వాటికీ, అరబ్ దేశాల మొత్తం అభివృద్ధికి అడ్డంకిగా వైట సామ్రాజ్యవాదులతో పొత్తుకోసం తాపత్రయ పడుతూ, అంతరంగిక వ్యవహారాల్లో భూస్వామ్య వ్యవస్థను అంటిపెట్టుకొని వుండగోరే శక్తులకు మధ్య వైరుధ్యం పెరిగింది.

ఇలాంటి సమావేశాల అనంతరం యదార్థ పరిస్థితు లేవిధంగా వున్నవో పైకి గోచరించకుండా లాంఛనప్రాయమైన ప్రకటనలు వెలువడుతూ రావడంతో అరబ్ వ్యవహారాల్లో అంతా సజావుగానే వుందనే భ్రమకు ఆస్కారం కల్గింది.

అరబ్ రాజ్యాలలోని అభివృద్ధి నిరోధక శక్తులు

ప్రస్తుత సందర్భంలో అంటే జూలై నాటి ప్రకటనలో, ప్రత్యేకించి సౌదీ అరేబియా పాలకుల్ని దృష్టిలో పెట్టుకొని నాజర్ 'అభివృద్ధి నిరోధక వర్గాల సరసన' శిఖరాగ్రసభలో పాల్గొనేది లేదని ప్రకటించారు. ఈ వర్గాలు ప్రజాభిప్రాయాన్ని పెడచెవులు పట్టించేటందుకూ, అరబ్ జాతీయ జీవనంలో ప్రగతిని నిలవరించేటందుకూ యీ సమావేశాల్ని వినియోగించుకుంటూ వచ్చాయి. ఈ శక్తులే అరబ్ రిపబ్లిక్‌లోనూ, సిరియాలోనూ తిరుగుబాటును ప్రోత్సహించాయి. అరబ్ దేశాల్లోని అభ్యుదయకర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రచారంచేసేటందుకుసౌదీఅరేబియా 50లక్షల పౌన్లువెచ్చించినట్లు యీమధ్యనే ఈజిప్షియన్ పత్రికలు రాశాయి. అంతమాత్రమేగాదు, సౌదీ అరేబియా పాలకులు అమెరికా, బ్రిటనుల నుండి భారీమొత్తన ఆయుధాలు కొనుగోలు చేసింది. ఆ దేశాలనుంచి సైనిక ప్రతినిధివర్గాలను సైతం ఆహ్వానించింది.

ఫైజల్ (సౌదీఅరేబియారాజు), మధ్య ప్రాచ్యంలోనూ, ఉత్తరఆఫ్రికాలో అరబ్ అభివృద్ధినిరోధకవర్గాలన్నింటినీ కూడగట్టేటందుకు 'ఇస్లామిక్ రాజ్యాల కూటమి' అంటూ ప్రారంభించారు.

ఎమెన్ - సౌదీఅరేబియా సంబంధాల్లో ఫైజల్ సామ్రాజ్యవాద అనుకూలత స్పష్టంగా కొట్టవచ్చినట్లు గోచరిస్తుంది. ఏడాది క్రితం అమెరికాలో రాచరిక వాదులకూ, రిపబ్లికన్‌లకూ మధ్య పోరాట విరమణ జరిగినప్పుడు, రాచరిక వాదులకు సాయం చేస్తూ వచ్చినసాయంఅంతా నిలిపివేస్తానని ఫైజల్ ప్రభుత్వంచెప్పింది. ఆ వాగ్దానాన్ని నిలుపుకో లేదుసరికదా సౌదీ అరేబియాలోని బలీయమైన భూస్వామిక పాలకగుబురా ఒకటి లోపాయికారిగా ఎమెన్‌లో వలసవాదులకు తోడ్పడుతూ వుంది. ఆ దేశంపై పదే పదే కవ్వింపు చర్యలు జరుపుతున్నది.

సౌదీ అరేబియా భూభాగం నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గులాముగా వున్న నామమాత్రపు దక్షిణ అరేబియా సమాఖ్య ఎమెన్‌పై దండయాత్ర ప్రారంభించింది. బ్రిటిష్ వలస వాదులూ ఆ దేశంపై విమాన దాడులు ప్రారంభించారు. ఈ రెండూ యేక కాలంలో జరగడం యాదృచ్ఛికం మేమీకాదు. ఈ

పి. డెమ్ చెంకో

పరిస్థితి ఫలితంగానే అరబ్‌రిపబ్లిక్ తన సైన్యంలో ఒక పెద్ద భాగాన్ని గత నాలుగేండ్లుగా ఎమెన్‌లో అట్టేపెట్టాల్సి వచ్చింది. ఇది నిజంగా ఆదేశానికి తలకుమించినబరువే.

ఈ రంగంలో విభిన్న, విరుద్ధ శక్తుల సంఘర్షణ ఫలితమే అరబ్ శిఖరాగ్ర సభ వాయిదా.

* * *

అరబ్ రాజకీయ రంగంలో వస్తున్న పరిణామాలగురించి పారిస్‌నుండి వెలువడే 'మొండే' అనే పత్రిక యిలా రాసింది:

“......అరబ్ రాజ్యాల మధ్య కాంతియుత సహజీవనం కొనసాగే స్థితి ముగిసింది. ఫైజల్-నాజర్‌లమధ్య సంఘర్షణ అనివార్యమనిపిస్తున్నది.

ఇలాంటి జోస్యానికి బొత్తిగా ఆస్కారం లేదని చెప్ప వీల్లేదుగాని. అరబ్ రాజ్యాల మధ్య సహకారానికి నూతన అవకాశాలు, కొత్త ప్రాతిపదికలు పెంపొందుతున్నవనే యదార్థాన్ని విస్మరించ వీల్లేదు.

సామాజికంగా మార్పులు

ఈ రంగం అంతటా జాతీయ విముక్తి ఉద్యమాలు బలపడుతున్నవి. అరబ్ రిపబ్లిక్ సిరియా, అల్జీరియాలు తమ దేశాల్లో సమూలమైన సాంఘిక, ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెడ్తున్నవి. పెట్టుబడిదారీ ఆస్తుల పైనా, భూస్వామ్య వ్యవస్థపైనా పెద్ద పెట్టున దాడిచేస్తున్నవి. వలస పాలన అవశేషాలను నిర్మూలించే కార్యక్రమాలు అమలు జరుపుతున్నవి. ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలో యీనాడు ప్రభుత్వరంగానిదే పై చేయిగా వుంది. సిరియా ప్రభుత్వం, పెద్ద, మధ్యశ్రేణి పరిశ్రమలలన్నింటినీ జాతీయం చేసింది. భూస్వామిక ఆస్తుల రద్దు కొనసాగిస్తున్నది. అరబ్ రిపబ్లిక్ ఆర్థిక వ్యవస్థలో సమూలమైన మార్పులు వచ్చాయి. ఆ దేశ పారిశ్రామికోత్పత్తిలో 85 శాతం యీనాడు ప్రభుత్వ రంగంనుండే లభ్యమౌతున్నది. భూస్వామ్యవ్యవస్థను సమూలంగా మట్టుపెట్టేటందుకు అవసరమైన చర్యలు తీసుకునేకోసం ఉపాధ్యక్షుడు మార్షల్ అమర్ ఆధ్వర్యాన ఒక ఉన్నతాధికార సంఘం నియమించబడింది.

సోవియట్ యూనియన్‌తో స్నేహ సంబంధాలు

ఈ దేశాల్లో జరుగుతున్న మార్పుల్లో యిది ఒక భాగం మాత్రమే. జాతీయ పురోభివృద్ధి సాధన రంగంలోకి ప్రజల్ని సమీకరించేకోసం రాజకీయ సంస్థలను పునర్వ్యవస్థీకరించడమూ జరుగుతూవుంది. అభ్యుదయకరమైన యీఅరబ్ రాజ్యాలు సోవియట్ యూనియన్‌తోనూ, యితర సోషలిస్టు దేశాలతోను తమ సంబంధాలను పెంపు చేసుకొంటున్నవి. సోషలిస్టు దేశాలు మొత్తంపైన అరబ్ రాజ్యాలన్నింటితోనూ, ఆర్థిక, వాణిజ్య సాంస్కృతిక సంబంధాలు కలిగి వుంటున్నప్పటికీ, ఐక్య అరబ్ రిపబ్లిక్, సిరియా, అల్జీరియాలలో ఆ సంబంధాలు మరింత సన్నిహితంగా వున్నవి. ఇరాక్ సోవియట్ దేశాల మధ్య సంబంధాలుకూడా యిటీవల యితోధికంగా పెంపొందుతున్నవి.

భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్య వాద వ్యతిరేక అరబ్ రాజ్యాలకు ఉమ్మడి ఆశయా లున్నవి. అవి వెలుపలసామ్రాజ్యవాదంతోనూ అంతరంగికంగా స్వీయాభివృద్ధి సాధన కోసం భూస్వామ్య అభివృద్ధి నిరోధక శక్తులతోనూ పోరాడవలసి వుంటున్నది. ఈ పరిస్థితి ఫలితంగానే ఈ దేశాలమధ్య నూతనమైన విలక్షణమైన సంబంధాలు ఏర్పడుతున్నవి. దీని ఫలితంగా అరబ్‌రంగంలోనూ అంతర్జాతీయ రంగంలోనూ ఒక నూతనమైన రాజకీయశక్తి ఆవిర్భావం చెందుతున్నది. అంటే యీ దేశాలు యేదో ఒక కొత్త రాజకీయ కూటమిగా యేర్పడుతున్నవని అర్థం కాదు.

జాతీయాభివృద్ధి పథకాలనిర్వహణలోనూ, విదేశాంగ విధానంలోనూ పరస్పరం అనుభవాన్ని అందించుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాయి.

ఐక్యఅరబ్ రిపబ్లిక్, అల్జీరియాలకు చెందిన పాలకవర్గ పార్టీలైన, అరబ్ సోషలిస్టు యూనియన్, జాతీయ విముక్తి సంఘటనల మధ్య మరింతగా సహకార సమన్వయాలను సాధించటం ఒక పద్ధతి. సమకాలీన సిద్ధాంత సమస్యపై ఒకే విధానాన్ని రూపొందించుకోవటమూ అవసరం. జూలై 30న పై పార్టీలు సమష్టి చర్చల తర్వాత విడుదలచేసిన ప్రకటనకూడా ఇలావుంది:

సోషలిస్టు అభివృద్ధి దశను చేరుకొన్న రెండు రాజ్యాలు

“రెండు దేశాలు యిప్పుడు సోషలిస్టు అభివృద్ధి దశను చేరుతున్నాయి. కనుక ఉత్పత్తి శక్తులన్నిటినీ స్వాధీనం చేసుకొని, ప్రజలను దోపిడీనుండి విముక్తిచేసి, జాతీయ సంపదను న్యాయంగా పంపిణీచేసే దశకు ఇక పురోగమించవలసి ఉంది.”

ఇటీవల అల్జీర్స్‌లోనూ, కైరోలోనూ, ఆ వెమ్మట డమాస్కస్‌లోనూ ఈ ఉభయ పార్టీల నాయకులతోనూ, సిరియాపార్టీ నాయకుల చర్చలు సాగించారు. చాలా సమస్యలను వారు చర్చించారు.

అశ్వాన్ ఆనకట్ట నిర్మాణ అనుభవాన్ని స్వీకరించి యూఫ్రటిస్‌పై ఒక ఆనకట్ట నిర్మాణానికి సిరియా సంసిద్ధత వెలిబుచ్చింది. సిరియాలో సమష్టి రక్షణ విధానాన్ని యీపాందించుకోటానికి తన సంసిద్ధతను నాజర్ వెలిబుచ్చాడు. ఈ రెండు దేశాలకు, ఇరాక్‌కు మధ్య కూడా సంబంధాలు సన్నిహితమయ్యే సూచనలున్నాయి.

కైరో, డమాస్కస్, అల్జీర్స్, బాగ్దాద్ నగరాలలో ప్రస్తుతం ఒకే విషయమైచర్చలు జరుగుతున్నాయి. అరబ్ రాజ్యాలలోని అభ్యుదయకర విప్లవశక్తుల మధ్యగల విభేదాలనుపరిష్కరించుకొని ఐక్యతను ఎలా సాధించటమా అన్న సమస్యపై ఈ చర్చలు సాగుతున్నాయి. ఇట్టి ఐక్యత ఏర్పడని సామ్రాజ్యవాదానికి దేశీయ అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా ఈ శక్తులు మరింత దృఢంగా పోరాడగలవనే విషయంలో సందేహంలేదు.

(న్యూటైమ్స్, ఆగస్టు 24)

నదీజలాల వివాదం

చర్చలకు కాలపరిమితిని నిర్ణయించాలి

రాజ్యసభలో సభ్యుల డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8

నదీజలాలవివాదం పరిష్కారానికి సంప్రదింపులకు కాలపరిమితిని నిర్ణయించాలని నేడు రాజ్యసభలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్రీయ నదీజలాల వివాద పరిష్కారానికి జరుగుతున్న జాప్యానికి ఆందోళనను వ్యక్తంచేశారు.

ఈ సమస్యను గురించి కేంద్రప్రభుత్వం చాలా తీవ్రంగాఆలోచిస్తున్నదని, వ్యవసాయ ఉత్పత్తి పెంపుదల దృష్ట్యా ఆ వివాదానికి సంబంధించిన ముఖ్యమంత్రులుకూడ వివాద పరిష్కారాన్ని కాంక్షిస్తున్నారని కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తిమంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అన్నారు. సహనాన్ని పాటించడంతో ఆ సమస్యకు ఒక పరిష్కారం సిద్ధించవచ్చు ననడంలో తనకుసందేహం లేదని తెలిపారు.

నదీజలాల వివాదాలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించుకొనడానికి ముఖ్యమంత్రులు ముమ్మరమైన ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

వివిధ రాష్ట్రాలలోని నీటిపారుదల వనరులను, అభివృద్ధిని పరిశీలించడానికి నీటిపారుదల సంఘాన్ని నియమించే ప్రతిపాదన యేమైనవున్నదా? అన్న శ్రీ కె. యన్. బావదా ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

పెద్ద నదులను కలుపాలని కొన్ని సంవత్సరాల క్రితం డాక్టర్ సి. పి. రామస్వామి అయ్యర్ చేసిన సూచనను ప్రభుత్వం అంగీకరించిందా అని శ్రీ ఆర్. టి. పార్థసారథి అడిగారు.

ఇది చాలా పెద్ద సమస్య అని, ప్రస్తుత దశలో సాధ్యంకాదని మంత్రి తెలిపారు.

బ్రహ్మపుత్ర నదీజలాలను గంగా, ఇతర నదులకుమళ్ళించాలని [illegible] చేసిన సూచనను మంత్రి అంగీకరిస్తూ, అదిసాధ్యమైనా ప్రస్తుత దశలో సాధ్యంకావన్నారు.

ప్రాథమిక అంచనా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 7½, 8½ శాతం [illegible] మహారాష్ట్రలో 28. 21 శాతం [illegible] వున్నదని తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ 32.4 నుండి 37.4 శాతం. మహారాష్ట్ర 8.2 నుంచి 11.2 శాతం నీటి వనరులను వినియోగించు కున్నాయని శ్రీ ఫక్రుద్దీన్ తెలిపారు.

మహారాష్ట్రకన్నా ఆంధ్రప్రదేశ్‌లో నీటి వనరులు ఎక్కువగా వున్నాయని అన్నారు.

నర్మదా ప్రాజెక్టు పూర్తిచేయాలని కేంద్రం తీవ్రంగా ఆలోచిస్తున్నదా అని శ్రీ దయాభాయ్ పటేల్ ప్రశ్నించారు. నర్మదా జలాల వివాదంపై సామరస్య పూర్వక పరిష్కారానికి ప్రయత్నాలు చేశామని మంత్రి తెలిపారు.

నదీజలాల వివాదంపై జరిగే చర్చలకు కాలపరిమితిని ఎందుకు నిర్ణయించకూడదని శ్రీ అక్బర్ అలీఖాన్ ప్రశ్నించారు.

విద్యా ప్రమాణ సుస్థిరత: ఉపాధ్యాయుల కడగండ్లు

మానవ జీవితము సుసంపన్నము చేయుటకు ఉత్తమ సాధనము విద్య అని అభిప్రాయ భేదములకు తావులేదు. చిన్నా పెద్దలు విద్యాశాస్త్రజ్ఞులతోపాటు పార్టీ పక్షపాతం లేక సమస్త రాజకీయపార్టీలు "విద్య" పరమార్థమన్న సత్యమును ఏనాడో స్వీకరించాయి. ప్రభుత్వంకూడ "విద్య"ను విస్తృత పరచుటకు ప్రథమ దశలో మాధ్యమిక స్థాయివరకు బాలబాలికలకు ఉచితావకాశం కల్పించింది. ఉన్నత విద్యకూడ ప్రజకు అందింపజేయు అంశం ప్రభుత్వ దృష్టిలోనున్నది. అందరు ప్రశంసింప తగిన విషయమే. అయినప్పటికి విద్యావేత్తలువెలిబుచ్చుతున్న అభిప్రాయముల బట్టి విద్యా ప్రమాణములు దిగజారుచున్నట్లు తెలుస్తున్నది. వాస్తవంకూడా, పలువురు తమతమ అమూల్యాభిప్రాయములను పత్రికా ముఖమున పాఠక లోకమునకు ఇదివరకే అందజేశారు. ఉపాధ్యాయవర్గం అభిప్రాయం కూడ పాటింపవలసిన అవసరం ప్రభుత్వముపై ఎంతో వుంది. డాక్టర్-రోగి యేకాభిప్రాయమునకు రానంతవరకు వ్యాధికి నివారణ మార్గం కనిపింపనట్లు ఉపాధ్యాయ వర్గాభిప్రాయములను మన్నింప నంతవరకు విద్యా సఫలతకు పరిష్కారమార్గం కన్పింపదు. ఇరువురి దృష్టి యేకోన్ముఖం చేయడము ఉత్తమ మార్గం.

కొద్దికాలం క్రిందటి వరకు బోధనాభ్యసన పాఠశాలల్లో (ట్రయినింగ్ స్కూల్సు) శిక్షణ పొందుటకు విద్యార్థులను ఎన్నిక చేయడంలో ఇప్పటివలెకాక వారి పూర్వానుభవము గణనలోనికి తేసుకొనేవారు. కొన్నిసంవత్సరములు ఉపాధ్యాయానుభవం గడించిన తర్వాత తాను పొందనున్న శిక్షణ అన్ని విధముల జయప్రద మౌతుంది. ఇంతకు పూర్వమే విద్యార్థులతో అతని మనస్తత్వం పెనవేసికొని పోయింది. కాలము ననుసరించి యే వయసులో బాల్యచేష్టలు ఎలా ఉంటాయో అతను చెప్పినంత సులువుగ ఇతరులు చెప్పలేరు. తద్వారా మానసిక శాస్త్రం కరతలామలకం అవుతుంది. ఆ శాస్త్రములో అతను గడించిన అనుభవం పుస్తకరూపేణా చదువవలసినదానితో తాదాత్మ్యం చెంది శిక్షణను సులభతరం చేస్తుంది. తానే శాస్త్రం వ్రాయవలసిన అవసరం కలిగినప్పటికి పొందిన అనుభవం (విద్యార్థుల సంగ్రహ జీవిత చరిత్ర) కూర్పుజేసి గ్రంథ రూపేణ అందింప కలుగుతాడు, ప్రత్యక్ష అనుభవం కంటె శాస్త్ర సత్యాన్వేషణకు ఇతర మార్గములు ఎంతయు అనుసరణీయములు కావు.

శిక్షణ పొందుటకు పూర్వానుభవం ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నంతవరకు విద్య తారుమారుకాలేదు. అందరిని సాధించు [illegible] తయారుకాలేదు. పూర్వానుభవం అన్నపుడు ఉపాధ్యాయ వయో పరిమితిని శాసించడం జరుగలేదు. ఎంత అనుభవం తాను గడించి వుంటే ప్రవేశింప నున్న వృత్తిలో అతడు అంత చక్కగా రాణించ గలుగుతాడు. వృత్తికి సంబంధించిన శిక్షణా విద్యను పొందినతర్వాత ఉద్యోగం ప్రాప్తింప జేయడం ప్రభుత్వ కనీసధర్మం. శిక్షణ ముగించడము [illegible] వృత్తివిద్యలకు కోటానుకోట్ల రూపాయలు ప్రభుత్వం ఏటేటా ఖర్చు పెట్టుచున్నది. వీరి నుంచి వ్యయ సౌఖ్యము రాబట్టుకొను నిమిత్తం ఉద్యోగ అవకాశములు కల్పించి వారి సేవలను తీసికొనవలసిన కర్తవ్యం ప్రభుత్వంపై యుంది. అలా చేయడం ఇరుపక్షములకు ఆమోదయోగ్యం కూడ. విద్యాప్రమాణ సుస్థిరతకు ఈ పద్ధతి అవశ్య మనుసరణీయంగ కన్పించు పరమ సత్యం.

ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నత విద్యలు నేర్చుకొను అవకాశం అంతగా కన్పింపదు. ద్రవ్యాభావం ప్రధాన కారణం. ఆర్థిక వేత్తల లెక్కలనుబట్టి యీవత్తు దేశసంపద నూరింట ఇరవై కుటుంబముల స్వాధీనములో ఉన్నట్లు తెలుస్తున్నది. పేద, కార్మిక, మధ్య తరగతుల జనాభా 80 శాతం ఉన్నట్లు చెప్పవచ్చు. ధనిక వర్గముతో పోటీపడటం మిగిలిన వర్గముల వారికి అసాధ్యం.

విద్యావకాశములు అందరకు కల్పింపవలెనని కోరటం న్యాయమైనకోర్కె. అవకాశములు లభ్యమైనప్పటికీ సత్కృతం చేసికొనటం వారి వశంలో లేదు. యల్. ఐ. సి. వారు వ్యాపారము కొరకు భీమా చేయవలచిన వ్యక్తి యొక్క వంశ వృక్షమును కొంత సేకరించి అతని సమోపరిమితిని నిర్ణయించెదరు. ఈ పద్ధతి ఎక్కడో ఒకచోట అస్వస్థంగా నున్నప్పటికిని నూటికి నూరుపాళ్ల విజయవంతమై తీరుతుంది. వారి వ్యాపారాభివృద్ధి కెంతయో ఈ పద్ధతి ఉపకరిస్తుంది.

పై పద్ధతినే తమ బిడ్డలకు అన్వయింప జేస్తే అన్ని విధములవారికి మేలు చేకూర్చడమే కాక, స్వీయ ప్రయోజనం కూడ పొందినవారవుతారు. బిడ్డయొక్క వంశాభివృద్ధి వారి విద్యాసామర్థ్యము లెక్క గట్టినప్పుడు తమ బిడ్డయొక్క విద్యా పాటవము ఆరోగ్యము కూడ మదింపుజేసి అతడు నేర్వవలసిన విద్యకు మార్గాన్వేషణ చేయవచ్చును.

మాధ్యమిక విద్యను బోధించుటలో ప్రధానోద్దేశము తాను ప్రవేశించు వృత్తి విద్యలలో పాఠశాలావరణయందు నేర్చిన విద్యను ఉపకరింప జేయడమే. ఈఉద్దేశము తోనే సెలబస్ నిర్మాణమైనది. జీవితమునకు పనికివచ్చు వీలైనన్ని వివిధ విషయములు విస్తృతపరచి. తానుపుగిడు జీవితరంగంలో అతనికి పనికివచ్చురీతిగా ప్రభుత్వమువారు సెలబస్‌ను కూర్పుజేశారు. మాధ్యమిక

శ్రీ నారాయణమూర్తి
(బాపట్ల, రైలుపేట)

లేక సెకండరీ విద్యను పరిగణనలోనికి తీసికొన్నపుడు తమ బిడ్డలయొక్క బుద్ధి వికాసమును నిర్ణించి వంశ వాసనలతో సరిజూచి అవసరమని తలంచిన పై చదువులకు పంపవచ్చు. లేదా ముగింపజేసి, వృత్తి విద్యలలో ప్రవేశపెట్టవచ్చు. ఇలా చేయడం వలన కుటుంబ ఆర్థికస్తోమత బలపడుతుంది. పిల్లవానిపై మేధాశక్తికి, ఇచ్ఛకు వ్యతిరేకముగా, బలవత్తరముగ వేయదలచిన విద్యాభారం తగ్గింపుజరుగుతుంది. వృత్తివిద్యలలో కాల వ్యవధి చేయక, చేర్పించడం వలన అతనికి వృత్తియందు అనుభవం పెరిగి కుటుంబ ధనార్జనకుకూడ చేదోడు వాదోడుగ ఉండటం తటస్థిస్తుంది. వీటన్నిటితోపాటు రాష్ట్రి శ్రేయస్సు దృష్ట్యా విద్యాప్రమాణములు దిగజారకుండ చేయడం మొదలగు బహుళార్థ ప్రయోజనములు ఈ పద్ధతివలన చక్కగా ఫలిస్తాయి.

వ్యక్తి వికాసమునకు దేహ దార్ఢ్యము ఆర్థిక స్తోమత పరిసరము తోడ్పడుతాయి. సాధారణముగ నిర్ణీతవయస్సు రాకపూర్వమే బిడ్డలను తలిదండ్రులు విద్యాలయములందు ప్రవేశపెట్టడం జరుగుచున్నది. కారణాలు అనేకం కావచ్చు. యజమానిపై కుటుంబ భారము ఎక్కువకావటం అతని ధనార్జనలో తోడ్పడేవారు లేకపోవటం అధిక సంతానం ఎక్కువగుటవలన వారితో [illegible] కడవారి మగబిడ్డ తనకు అనతికాలంలో అక్కరకు వచ్చునుకోటం, ఆర్థిక పుష్టివలన పిల్లవాని ప్రజ్ఞను మదింపు చేయక అతనిపై డబ్బు కుమ్మరించడం వాటిలో కొన్ని. ప్రభుత్వం తీసికొన్న ఓల్డేజ్ పెన్షన్ పథకం, టీచర్ పెన్షన్ బుక్ స్కీము, ఫ్రీ ఎడ్యుకేషన్ స్కీము, మొదలైనవి జయప్రదమైనపుడు విద్యా ప్రమాణములు స్థిరత్వంచెందుతాయి. ప్రభుత్వమువారి విధానములు ఫలవంతమగుటకు ప్రజలు కూడ సహకరించవలసిన అవసరం ఉంది. ఏ ఒక్కరిలోపమైన దాని ఫలితం రాష్ట్రి ప్రజపై చెరగని ముద్రగా తయారవుతుంది. అందరం మంచిఫలితం ఆశించుదాం.

ఉపాధ్యాయుల కడగండ్లు

శిక్షణనుగురించి ఇంతవరకు కొంత వరకు మనవి చేసినాను. సుశిక్షితులైన వారికి వయఃపరిమితిని కొన్ని పరిషత్తులునిర్ణయింప చేయబూనడం ఉపాధ్యాయ లోకమునకు తీరని అపచారమై ఉంది. ప్రభుత్వముకూడా వీటిపట్ల స్వాగత పహింపవలసియున్నది. ఉదాహరణకు 19 జూన్ 66న అనంతపురంజిల్లా పరిషత్తు, 22 జూన్ 66న నల్గొండజిల్లా పరిషత్తు, ఆంధ్రప్రభ, విశాలాంధ్రలలో ప్రకటనలు అందజేశాయి. ఈ రెండు పరిషత్తుల వయోపరిమితి 30 సంవత్సరములు మించరాదన్నారు. శ్రీకాకుళం, కృష్ణాపరిషత్తులు ఇంక కొంచెము ముందుకు నడిచాయి, వయోపరిమితిని సడలించడం జరుగలేదు కాని ఇతర జిల్లాలవారికి ఈ రెండు పరిషత్తులు ఉద్యోగావకాశం దూరం జేశాయి. ఇది ఎందువలన జరిగివుంటుందో? బాధ్యులైనవారు దూరదృష్టితో వ్యవహరించిన అట్టి ఉపద్రవములకు స్థానముండదు. ప్రభుత్వ అప్రమత్తత కూడ ఇట్టి అరిష్టములను మత్పాదింపజేయదు. నిర్లిప్తత ఎన్నటికి ప్రదర్శింపకూడదు. ఈ సందర్భంలో ఒక విషయం మాత్రం జ్ఞప్తియందుంచుకోవలసిన అవసరం విద్యాసంస్థలపై ఎంతగానో యుంది.

విశ్వ విద్యాలయ సవరణబిల్లు శాసనసభలయందు చర్చలకై ప్రతిపాదించినపుడు ముఖ్యమంత్రి చెప్పినమాటలు గమనార్హం.

“విశ్వవిద్యాలయములు పూర్తిగ సర్వ స్వతంత్ర ప్రతిపత్తిగలసంస్థలు ఎన్నటికీకావు. విద్యావిషయకమైన మార్పులు చేయవలసి వచ్చినపుడు ప్రభుత్వముతో సంప్రతించిన మీదట చేయవలసినదేకాని తమలో తాము ఆలోచించి ఎన్నడు చేయరాదు. ఎసంబ్లీ, కౌన్సిల్, మంత్రులు,ప్రజలచే ఎన్నిక చేయబడినట్లే విద్యా సంస్థలు ప్రజాహిత సంస్థలలో పనిజేయు ఉద్యోగులుకూడ. ముఖ్యమంత్రి మోనార్క్ కానట్లు ఉన్నతాధికారియైన వైస్ ఛాన్స్‌లర్‌కూడ విశ్వవిద్యాలయములకు ప్రజా ప్రభుత్వములకు అతీతుడు కాడు.”

ముఖ్యమంత్రి సుస్పష్టంగాతెలియ చేసిన అభిప్రాయములు పరిషత్తులకు ఎందుకు వర్తింపవో అందుకు వారు చెప్పుకొను సంజాయిషీ ఏమో తెలియ వలసి వుంటుంది. పరిషత్తులు కొందరి వ్యక్తుల స్వప్రయోజనములకు సంకుచిత భావాలకు వర్గ, ప్రాంత రాజకీయ పక్షాలకు నిలయం కాకూడదు, అలాచేయడం ప్రజాస్వామ్య మూల సూత్రాలకే విఘాతం జేసినట్లవుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతేని దోహదకారి కాదు.

పరిషత్తులు యేర్పాటుచేయటంవలన జిల్లా ప్రజలకు సమానావకాశములు కల్పించడం న్యాయసమ్మతమే. న్యాయసమ్మతమైన ప్రజాకోర్కెను ఎవరు త్రోసిపుచ్చగలరు? తగినంతమంది ఉపాధ్యాయులు కొరవడిన ఇతర జిల్లాల వారికి అవకాశం కల్పించడంలో దూరదృష్టిని నిష్పక్షపాత వైఖరిని పరిషత్తులు ప్రదర్శింపవలసి ఉంటుంది. ఇచ్చిపుచ్చుకొను సహకారపద్ధతి ప్రభుత్వ ఆవశ్యమైనపుడు దానిని గౌరవించడం దానిమనుగడకు వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి నిమ్యక్తధర్మం. ఇతరజిల్లాల వారికి అవకాశం దూరంజేయడం ఏకపక్ష నియంతృత్వ పరిపాలనకు దారితీస్తుంది. తగినంతమంది విద్యాధికులు సమకూర్చనంతవరకు జిల్లా ప్రగతి విద్యారంగంలో కుంటుపడుతుంది.

విద్యా విషయంలో గుంటూరు జిల్లా పరిషత్తు ప్రశంసనీయమైన స్థానం అలంకరించింది. ప్రాథమిక, మాధ్యమికోన్నత పాఠశాలలు [illegible] అంటూ అధికసంఖ్య నందుకొన్నాయి. ప్రభుత్వంతో పోటీపడి ప్రయివేటు రంగం కొంత ముందంజ వేసింది. ఉన్నత విద్యతోపాటు కళాశాల విద్యనుకూడ [illegible] ప్రజల [illegible] అందరకు అవకాశములు కల్పించబడ్డాయి. వయోపరిమితిని శాసించి ఉపాధ్యాయవర్గమునకు నిస్పృహ, నిరాశలు సృష్టి చేయరాదు.

ఇతర జిల్లాలలో పనిచేయడం

ఉద్యోగముకొరకు జిల్లా ఎంప్లాయిమెంటు కార్యాలయములో అడుగిడినపుడు కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. ఇతర జిల్లాలకు పోవుట ఇష్టమా? అయిష్టమా? ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రాంతంలోనైనా పనిచేసే ముఖకు సిద్ధమేనా? వారి ప్రశ్నలవలన ప్రాంతీయ భేదములు ఉద్యోగావరోధములకు అతీతమైనట్లు స్పష్టమౌతున్నది. ప్రభుత్వమును అతిక్రమించి ప్రజావ్యతిరేకమైన స్వంత చట్టములను చేసికొను హక్కు కొన్ని పరిషత్తులకు ఎవరిచ్చారో? ప్రభుత్వం ఉదాసీనతకు తాపీయుక నిర్దిష్టమైన వైఖరి వీరి మొదజూపవలసిఉంది.

ఉపాధ్యాయవర్గంపై ప్రభుత్వం కూడ హ్రస్వదృష్టితో వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తుంది. కంఠశోషను సానుభూతి ప్రకటనల కంటే నిర్మాణాత్మక కృషి అత్యవసరమే అనవచ్చు పాపం! ఈ చేవ ప్రజాసేకం సంచేస్తుంది? అమరణాంతంవరకు వారికిసమస్యల పరిష్కార మార్గము అన్వేషింపవలసినదే. ఇతర రాష్ట్రములవారితో పోల్చిచూచినప్పుడు ఇచ్చట వారి జీతవ్యత్యాసము అధికమున్న సంగతి నిర్వివాదాంశము.

ఉపాధ్యాయులు ఉపాధికొరకు ప్రయివేటు యాజమాన్యమున నడచు విద్యాసంస్థలలో ప్రవేశిస్తూ ఉంటారు. అప్పటినుంచి పాలకవర్గపు నిరంతర పరిపాలనకు గురిఅవుతారు, మచ్చునకు ఒక విషయం మనవిజేస్తాను. శ్రీ జిగురు కృష్ణమూర్తిశాస్త్రి, భాషాప్రవీణ. గడచిన ఇరవైయైనసంవత్సరములనుండి 'నాట్‌వెస్ట్ ఆర్ట్స్ హైస్కూలు' బాపట్లయందు తెలుగు పండితులుగాపనిచేస్తున్నారు. మచ్చలేని కీర్తి ప్రతిష్ఠలతో పాలకవర్గం వారి మన్ననలతో తన వృత్తి ధర్మము నిర్వహిస్తున్నారు. ఈ మధ్య పండితులకు నిర్దేశించిన శిక్షణకూడ హైదరాబాదులో ముగించి తన వృత్తిలో తిరిగి ప్రవేశించారు. తనకు న్యాయముగా సంక్రమింపనున్న సీనియారిటీని మత దృష్టితో పాలక వర్గీయులకు ఆప్తులైన శ్రీ దాసుకు కట్టబెట్టి పది రూపాయల అలవెన్సును అతనికి దఖలు పరిచారు. శ్రీ దాసు గడిచిన ఇరవై సంవత్సరములు [illegible]గా పనిచేస్తూ బోధనానుభవమునకు దూరమైనారు. అయినప్పటికి వారి బంధుప్రీతి ఆశ్రితపక్షపాతములకు అలవాలమైనారు. ఇది ఎంతవరకు దారితీస్తుందో పాఠకలోకము గుర్తించవలెనుగాక!

సెకండరీ ఉపాధ్యాయుడు మొదటి ఫారం నుంచి స్కూల్ ఫైనల్ వరకు తరగతికి మూడు పుస్తకముల చొప్పున పదునెనిమిది పుస్తకములు చదువవలసి వుంటుంది. శిక్షణాకాలంలో రెండు సంవత్సరములలో బోధనయునకు సంబంధించిన పుస్తకములు తప్ప ఇతరములు చదువవలసినవని [illegible] జ్ఞానార్జనకు [illegible] భాషను ఆస్వాదించుటకు మనలో బహుకొద్దిమంది.

రెండవ గ్రేడ్ తెలుగు పండితుడు-పుట్టినప్పటినుంచి యింటా, బయటా తెలుగు భాషను వాడక రూపేణ, రచన [illegible] వినుటవలన, తెలుగు భాషను అభ్యసించడం ప్రారంభిస్తాడు. దానికి తోడు తెలుగు పరిసరం అతనికి అనుకూలమౌతుంది. పరీక్ష కొరకు ఈతడు నాలుగు తరగతులకు చదువవలసిన పుస్తకములు దరిదాపు 30 పుస్తకములున్నాయి. పరీక్షకొరకు తాను ఇదివిన పుస్తక పరిచయం వల్లను. మాతృభాష తెలుగు అవడంచేతను, వృత్తిలో ప్రవేశించినప్పటినుంచి తెలుగు సారస్వతంతో అవినాభావ సంబంధం ఏర్పరుచుకుంటాడు. నాటకాలు, జీవిత చరిత్రలు, ప్రహసనములు, పురాణేతిహాసములు పద్య, గద్య, కావ్యములు, కథానికలు మొదలగు తెలుగు ప్రక్రియలన్నీ అతని హస్తగతమౌతాయి. ఇంత చొరవ, అవకాశం, అవసరం, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కన్పింపదు. వారు యెన్నటికీ తమ సహచరులు తెలుగులో ఆర్జించిన తుల్య విజ్ఞానమును పరభాషయైన ఇంగ్లీషులో ఆర్జించి కృతకృత్యులు కాలేరు. బి. ఏ., ఎం. ఏ. చదువుచున్నవారు తమ అభిప్రాయములను వ్రాత పూర్వకముగ చర్చల ద్వారా తెలియజేయకలరేగాని, పరభాషలోగల సాహిత్య ప్రక్రియలలో కొన్నింటినైనను స్వవశం జేసికోజాలరు. తెలుగు పట్టభద్రులు, [illegible], ఛందస్సు, వ్యాకరణాది కఠిన విషయములను జీర్ణింపచేసికొని నూటికి నూరుపాళ్ళు సఫలత చెందుతారు. సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు కలుగజేసిన శాశ్వత అవకాశం విశారద అర్హతకల వారికి వర్తింప జేయడం సమంజసం, న్యాయం, పాఠశాలలు పూర్తిగా ప్రభుత్వ పరంగా నడపటం ఉత్తమమార్గం. ఉపాధ్యాయ వర్గమునకు నిర్దేశించిన చట్ట సమ్మతమైన అస్త్రరక్షణలు చేయాలి.

ప్రభుత్వం - పత్రికలు

మన ప్రభుత్వ విధానాలకీ, మనపత్రికల పోకడలకీ దగ్గర సంబంధ ముందనే విషయాన్ని చాలామంది గ్రహించక పోవటం విచార నీయం. ఖచ్చితంగా చెప్పవలసి వస్తే అన్ని పత్రికలూ ఒకే మోస్తరువని చెప్పడం కూడా పొరపాటే. ముఖ్యంగా పెట్టుబడిదారుల పత్రికలకూ, పెట్టుబడిదారీ విధాన ప్రభుత్వానికి ఒక విడదీయరానిబంధ ముంటుందన్నమాట. ఈ సత్యాన్ని మనం సోదాహరణంగా చర్చిద్దాం.

మన ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రభుత్వం.

శ్రీ ఎస్. రామమోహన్ రెడ్డి
(ఉపటూరు - కడపజిల్లా)

మన దేశంలోని చాలా పత్రికలు పెట్టుబడి దారులవే. పెట్టుబడిదారీ వర్గాన్ని సంరక్షించుకునేందుకే పోషింపబడుతున్నవే.

[illegible] ప్రభుత్వ మెప్పుడూ కోటీశ్వరులు, అనధికార్జనపరులు, భూస్వాములు, పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకోసం ప్రయత్నిస్తూంటుంది అలాగే యీ పెట్టుబడిదార్ల పత్రికలు కూడా ప్రభుత్వ విధానాలని సమర్థిస్తూ వుండటం సహజమే.

మన పాలకవర్గం యెప్పుడూ యేవో కొన్ని కొరనాని "నినాదాలని" ప్రచారం చేస్తూ, సామాన్య మానవుల్ని మోసగిస్తూ వుండటం మన మెరుగనిది కాదు. ఉదాహరణకు కాంగ్రెస్ పార్టీ దశాబ్దానికి పూర్వం ఆవడిలో సమావేశమై "సోషలిజమే" తన ధ్యేయమంది. అప్పట్నుంచీ దేశం సోషలిజం వైపుకి పురోగమిస్తుందని బాకా ఊదుతూనే వున్నది. మన పత్రికలూ దానికి తాళం [illegible] యి. మరి నిజానికి దేశం సోష[illegible] వైపు పురోగమిస్తుందా? లేదని మన [illegible] యే ఒక్కటిగాని చెప్పిన పా[illegible]దా?

మనదేశం ప్రధానంగా వ్యావసాయికదేశం. మరి వ్యావసాయిక ప్రధానమైన మన దేశంలో మనమే తిండి గింజలులేక యితరుల్ని 'దేహీ' అని అడుక్కోవాల్సిన దుర్గతి పట్టినందుకు మనప్రభుత్వవిధానం కాదా కారణం? అవును. మరి యీ నగ్నసత్యాన్ని మన ప్రభుత్వం ఒప్పుకుంటుందా? వప్పుకోదు. పైపెచ్చు ప్రజలకు నీతిబోధలు, హితవులు చెబుతుంది.

"తిండిగింజలను అధికంగాపండించండి" అనే మన పాలకవర్గ నినాదాన్ని, కుహనా విధానాన్ని కొంచెం పరిశీలించండి. తిండి గింజలు రైతు కేం చేదా? ప్రభుత్వం చెప్పినదాకా పండించక పూరకుండడానికి. పంచవర్ష ప్రణాళికల్లో వ్యవసాయానికిగాను కేటాయించబడిన ధనం మొత్తమూ రైతుకి ప్రయోజనకారిగా వెచ్చింపబడిందో మన ప్రభుత్వానికి తెలియదా? మన పత్రికలకు తెలియదా? రైతులకిచ్చే సబ్సిడీలు, [illegible] లందంకిందనే హరించుకుపోవడం మన మెరుగనిదా? ప్రభుత్వం సరఫరాచేసే రసాయనిక ఎరువులు ఏ చిన్న కారు రైతుకు అందుతున్నై? మరి విషయాలు [illegible] మన పాలకవర్గం [illegible] రైతు తప్పే అంటుంది! ఆ మాటను మన పత్రికలు ఎందుకు [illegible] యంటాయి? కొంచెం ఆలోచించండి మీకే తెలుస్తుంది.

'జై కిసాన్' నినాదంలో వుండే దొంగ తనాన్ని, ద్రోహాన్ని మన పత్రికలు మన కెప్పుడైనా తెలిపాయా? ఎందుకు తెలుపుతై? ప్రభుత్వమూ-పత్రికలూ రెండూ కలసి ఏకమై సామాన్య జనాన్ని మోసగిస్తున్నాయి. సామాన్య జనంయొక్క ఆలోచనా ధోరణినీ, చైతన్యాన్ని అవి అణచివేస్తున్నాయి.

కాకపోతే మొన్న జనవరిలో, కేరళ యువ, తమకిచ్చే బియ్యం చాలవని కమ్యూనిస్టు [illegible] "బంద్" చేస్తే, అందులో విద్యార్థులు (కాలేజి విద్యార్థులు కూడా!) పాల్గొంటే మన ఒక అనన్య ప్రచారంగల ఆంధ్ర దేశపు పత్రిక "కేరళలో కాలేజి విద్యార్థుల దౌర్జన్యాలు" అని శీర్షికతో సంపాదకీయం రాయడానికి [illegible] గుండె ఉండాలి! మాకు కడుపు నిండా అన్నంపెట్టమని [illegible] ప్రభుత్వాన్ని అడగడం దౌర్జన్యమా? మరెందుకిలా యీ పత్రికలు యీ ప్రభుత్వవిధానాలనీ, చర్యలనీ సమర్థిస్తున్నాయంటే, ఈ ప్రభుత్వ విధానాలతో మన పత్రికల అభివృద్ధి ముడిపెట్టబడివుంది గనక అవి అలా చేస్తున్నై. అంతే.

రూపాయి విలువ తగ్గించిన తర్వాత ఆర్థిక మంత్రి "వేతన స్తంభన" జరుగుతుందంటే [illegible] అంటూ మన పత్రికలు [illegible]. వేతన స్తంభన జరగాల్సిందే, [illegible] మాత్రం వేతన స్తంభనాన్ని అంగీకరించలేవా" అంటూ సంపాదకీయాల్లో గగ్గోలుపెట్టుగా అరవలేదా? అధిక ధరలకు సమానస్థాయిలో జీతాలు పెంచకుండే ఎంత మంది గుమాస్తాల, ఉపాధ్యాయుల,కార్మికుల పెళ్ళాలు, బిడ్డలు పస్తులతో అలమటిస్తారో కదా అనే భావం ప్రభుత్వానిగ్గాని, పత్రికలగ్గాని లేకపోవడం - వాటి నిర్లక్ష్యానికి - ద్రోహానికీ నిదర్శనమని గ్రహించటం మన విధి.

మొన్న రెండేండ్ల క్రిందట దేశంలో పలుచోట్ల (ఆంధ్రలో గుంతకల్లు, మైసూర్‌లో, బళ్ళారి) అన్నానికి నోచుకోని ప్రజలు [illegible], నిల్వలుంచు కున్న వర్తకుల అంగళ్ళను లూటీచేస్తే (నిజానికి అది లూటీకాదు) మన ప్రభుత్వం వారిని కాలిస్తే, మన పత్రికలు "దాడిల, గుండాల దౌర్జన్యాలు" అంటూ వార్తలు ప్రకటిస్తాయి. మరే యే ఒక్క పత్రికైనా (బ్లిట్జ్, విశాలాంధ్ర మినహాయిస్తే) మన ప్రభుత్వ దమన నీతిని నిరసించిందా? మన పత్రికల దృష్టిలో ప్రభుత్వం దృష్టిలో అన్నంలేని ప్రజలు హాహాకారాలు చేస్తే, ఆహాకారాలు చట్టసమ్మతము కాని చర్యలు. కానీ పెట్టుబడిదారులు వందలవేల బస్తాల ధాన్యాన్ని దాచుకోవడం, అధిక ధరలకు అమ్ముకోవడం సబబైన పని "లా-అండ్-ఆర్డర్"కు లోబడ్డ కృత్యాలు. ఒక వైపు అన్నంలేక మల మల మాడి పోతుంటే, ధాన్యాన్ని నిలవ చేసుకోవడం అకృత్యంగా మన ప్రభుత్వంగాని, పత్రికలు గాని భావించాయా?

దేశంలోని పెట్టుబడిదారులని మేపడం తోనే మనప్రభుత్వంకు సంతృప్తికలగలేదు. అందుకని అది కొన్ని లజ్జాకరమైన షరతులకు లొంగి, విదేశీప్రభుత్వం నుండి అప్పులు పుచ్చుకుంటే, ఆ ఘనకార్యాన్ని మన పత్రికలు కొండంత అక్షరాలతో "ఫలానా దేశపు ఆర్థిక సహాయం" అంటూ ప్రకటిస్తాయి. కాని ఆ విదేశీ ప్రభుత్వాలు మన మొత్తం ఆర్థిక వ్యవస్థనే కాజేయబోతున్న వాస్తవాన్ని ఏ పత్రిక మన ప్రజలకు వెల్లడిస్తోంది?

పదవీ వ్యామోహంతో, స్వార్థంకోసం, ఆశ్రితజన శ్రేయస్సుకోసం పాలకవర్గపార్టీ [illegible] దీర్ఘముఖ్యమైన, నిర్ణయాత్మకమైన రాజకీయాంశంగా మన పత్రికలు చిత్రిస్తాయి తప్ప అది ఎందుకోసం జరుగుతోంది, ప్రజల మేలుకోసమా? లేకపోతే పాలకదేవుళ్ళు మనల్ని [illegible]? అనే విషయాన్ని ఒక్కగానొక్క పత్రికైనా రాస్తోందా?

శాంతిలాల్ షా రాజీనామా ఆమోదించాలని గవర్నరుకు శ్రీ వి. పి. నాయక్ సిఫార్సు

బొంబాయి, సెప్టెంబరు 6

'బొంబాయి బంద్' ఉద్యమాన్ని అణచడానికి మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనందుకు నిరసనగా తన మంత్రి పదవికి రాజీనామా చేసిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి శ్రీ శాంతిలాల్‌షా రాజీనామాను ఆమోదించవలసిందిగా ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ గవర్నరుకు సిఫారసు చేశారు.

ఈ విషయాన్ని శ్రీ షా నేడు పి. టి. ఐ. విలేకరితో చెప్పారు. రాజీనామా ఆమోదించవలసిందిగా తాను గవర్నరుకు సిఫార్సు చేసినట్లు ముఖ్యమంత్రి తనకు లేఖ వ్రాశారని శ్రీ షా అన్నారు.

శ్రీ షా రాజీనామాను కేంద్రమంత్రి శ్రీ పాటిల్ సమర్థించిన విషయం పాఠకులకు విదితమే.

ఎగువ కాల్వకు గండ్లు కొట్టడంపై ఆవేశం అనవసరం

శ్రీ నిజలింగప్ప వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబరు 6

మైసూరు రాష్ట్రంలో దరోజీ చెర్వును నింపడానికై తుంగభద్ర ఎగువకాల్వ గట్లకు కొందరు రైతులు గండ్లుకొట్టడంపై ఆంధ్ర ప్రభుత్వం ఆవేశపడవలసిన అవసరంలేదని మైసూరు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప నేడిక్కడ అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకుడు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షుడు అయిన శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు నిన్న చేసిన పత్రికా ప్రకటనలో ఈ చెరువుకు నీళ్ళు మళ్ళించడానికై ఎగువకాల్వ గట్లను డైనమైట్‌తో పేల్చివేసినట్లు వెల్లడిస్తూ ఆంధ్ర ప్రభుత్వం ఈ సమస్యను ఎత్తుకోనందుకు ఆశ్చర్యం ప్రకటించారు.

బెంగుళూరువెడుతూ బేగంపేట విమానాశ్రయంలో శ్రీ నిజలింగప్ప కొంతసేపు ఆగారు.

శ్రీ పిల్లలమర్రి పత్రికా ప్రకటనను విలేకరులు ఆయన దృష్టికి తీసుకొనిరాగా ఆయన ఇలా అన్నారు:

"కాల్వగట్లను డైనమైట్‌తో పేల్చారని నేను అనుకోను. ఈ విషయంలో మా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొన్నది. నీళ్ళను దరోజీ చెర్వుకు ఉపయోగించే విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి వ్రాశాను. ఈ సంవత్సరం అలా చేయడానికి ఆయన అంగీకరించారు.

తుంగభద్రా డాంలో నీరు చాలా నిల్వ వుంది. దరోజీ చెర్వుకు నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు నష్టం కలుగుతుందనుకోను.

బహుశా ఆ చెరువు కింద ఆయకట్టు దారులకు నీళ్లు అత్యవసరమై తెగింపుతో నీళ్ళు చెర్వుకు మళ్ళించుకొనివుండవచ్చు. మైసూరు ప్రభుత్వం వెంటనే ఆంధ్ర ప్రభుత్వానికి ఆ విషయం తెలియజేసింది.

ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మె విరమణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

వైస్ ఛాన్సలర్ శ్రీ సి. డి. దేశ్‌ముఖ్ ఇచ్చిన హామీ అనుసరించి ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మె నేడు విరమణ అయింది.

అరెస్టయిన 58 మంది విద్యార్థులు విడుదల అవుతారని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఆయన గత అర్ధరాత్రి ఢిల్లీ చీఫ్ కమిషనరుతో చర్చించిన అనంతరం ఆ హామీలు ఇచ్చారు.

ఢిల్లీకి ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి వర్గం రాక

ఈ మాసాంతంలోగా సంభవం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

బెర్నార్డ్‌బెల్ నాయకత్వాన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధివర్గం ఒకటి ఈ మాసాంతంలోగా ఢిల్లీ రానున్నది.

నాల్గవ ప్రణాళిక ముసాయిదాలో చేర్చిన వివిధ పథకాలను ఈ ప్రతినిధి వర్గం పరిశీలించి, వాటికి అవసరమయిన విదేశీ ద్రవ్య సహకారం గురించి ప్రణాళికా సంఘంతో చర్చలు జరుపుతుంది.

ఈ ప్రతినిధివర్గం రెండు అంశాలపై కొన్ని ప్రధానమైన సిఫారసులు చేస్తుందని తెలుస్తున్నది.

ప్రపంచ బ్యాంక్ నుండి ప్రత్యక్షసాయం పొందే పథకాల విషయమై కొన్ని ప్రతిపాదనలు, భారత సహాయక్లబ్ దేశాల నుంచి నేరుగా పొందేసహాయం విషయం కొన్ని ప్రతిపాదనలు చేస్తుంది.

నెల్లూరులో హోటలు రేట్లు తగ్గించటానికి హోటలు యజమానులు అంగీకరించినట్లు వార్త.

అమెరికాతో చైనా చర్చలు?

జపాన్ ప్రతినిధివర్గానికి చెన్ ఈ వెల్లడి

టోకియో, సెప్టెంబరు 6

అమెరికా ఇప్పట్లో చైనాపై దాడి జరుపుతుందని తాను అనుకోవడంలేదని, చైనా విదేశాంగమంత్రి చెన్-ఈ జపాన్ పార్లమెంటు సభ్యుల బృందంతో అన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం జపాన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ నేడు ప్రకటించింది.

చైనాకు అమెరికాకు మధ్య ఉద్రిక్తత శాశ్వతంగా వుంటుందని తాను అనుకోవడం లేదనీ, వియత్నాం యుద్ధం సంప్రదింపుల ద్వారాపరిష్కారంకావడానికి తాము విముఖం కాదని చెన్-ఈ అన్నారని ఈ సంస్థ ప్రకటించింది.

జపాన్ పార్లమెంట్ కన్సర్వేటివ్ గ్రూపు సభ్యులతో (వారిలో మాజీ విదేశాంగ మంత్రి కోసాకా కూడా ఉన్నారు) చెన్ ఈ 40ని॥ పాటు సంభాషించారనీ, ఆ సంభాషణల సందర్భంలో శ్రీ చెన్-ఈ పై అభిప్రాయాలు వెలిబుచ్చారనీ ఈ సంస్థ తెలియజేసింది.

జపాన్ రేడియో, జపాన్ పత్రికలు ఈ వార్తను ప్రకటించాయి.

అయితే అమెరికా దాడి జరిపితే ముందుగానే అందుకు సిద్ధంగా వుండటానికై సాంస్కృతిక విప్లవం ద్వారా తమ దేశం సిద్ధపడుతున్నదని చెన్-ఈ అన్నారు.

వియత్నాంపై చెన్-ఈ ఇలా అన్నారట:

వియత్నాంసమస్యనుసంప్రదింపులద్వారా పరిష్కారం కావటం చైనా కిష్టంలేదనేది సరికాదు.

వాస్తవంలో చైనా అమెరికాతో వార్సాలో సంప్రదింపులు జరుపుతూనేవుంది"

కామన్వెల్తు సభ ఎదుట స్మిత్ వ్యతిరేక ప్రదర్శనలు

లండన్, సెప్టెంబరు 6

కామన్వెల్తు ప్రధానుల సభ నేడిక్కడ ప్రారంభం కాబోయే ముందుగా మార్లబరో హౌస్ ఎదుట రొడీషియాలో స్మిత్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వందమంది ప్రదర్శన జరిపారు.

ప్రదర్శకులు రొడీషియాలోని ఇయాన్‌స్మిత్ శ్వేతజాతి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ, ఘనాలో సైనిక పరిపాలనను వ్యతిరేకిస్తూ, తూర్పు పాకిస్తాన్‌పట్ల అయూబ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు వున్న ప్లేకార్డులను ప్రదర్శించారు.

రోడ్డుకు ఒక వైపునున్న కాలిబాటపై పోలీసు బలగాలున్నాయి. ఎదురుగా ఉన్న కాలిబాటపై నినాదాలిస్తున్న ప్రదర్శకులున్నారు. 'స్మిత్‌ప్రభుత్వంపై బలప్రయోగం చేయాలి' 'విల్సన్ ద్రోహి' 'తూర్పు పాకిస్తాన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి యివ్వాలి' అనే నినాదాలను ప్లేకార్డులపై రాశారు.

దక్షిణాఫ్రికా ప్రధాని హత్యకు విల్సన్ విస్మయం

లండన్, సెప్టెంబరు 7

వెర్వోర్డు హత్యపట్ల బ్రిటిష్ ప్రధానివిల్సన్ తన విస్మయాన్ని, విచారాన్ని వ్యక్తంచేస్తూ నేడొక ప్రకటన చేశారు.

సింగపూర్ ప్రధాని, ఉగాండా అధ్యక్షులు దక్షిణాఫ్రికాలోని వివిధ పక్షాల నాయకులు వెర్వోర్డుహత్యపట్లవిచారాన్ని వ్యక్తంచేశారు.

డాక్టర్ వెర్వోర్డు 1901 లో ఆమ్‌స్టర్‌డామ్‌లో డచ్ దంపతులకు జన్మించారు.

కొంత కాలం మనస్తత్వశాస్త్ర ఆచార్యుడుగా ఆయన పని చేశారు. తర్వాత రాజకీయరంగంలో ప్రవేశించి ప్రధాని అయ్యారు.

దక్షిణాఫ్రికా శ్వేతజాతి ప్రభుత్వం అవలంభించుతున్న జాతివివక్షవిధానాన్ని రూపొందించడంలో ఈయనకు ప్రముఖపాత్రవుంది.

రంగుజాతి ప్రజలపట్ల ప్రదర్శించుతున్న శ్రద్ధను వెర్వోర్డు ప్రభుత్వం పేదవాళ్ళయిన తెల్లవాళ్ళ పట్ల చూపటంలేదని, వెర్వోర్డును చంపిన వ్యక్తి అంటూవుండేవాడట. అతని పేరు దిమిత్రశ్షాఫెండాస్ అని, అతన్ని క్రిమినల్ నేరపరిశోధకశాఖ ఉద్యోగులు ప్రశ్నలడుగుతున్నారని రాయిటర్ వార్త.

మరో రెండు రోజుల్లో వెర్వోర్డుకు 64 ఏండ్లు నిండి 65వసంవత్సరం ప్రవేశించేది.

ఆర్థిక మంత్రి డాక్టర్ ఎబెన్ డోంజెస్ ప్రధాని బాధ్యతలను తాత్కాలికంగా స్వీకరించారు.

వెర్వోర్డు హత్యకు కారణం ఏమిటో ఇంకాతెలియలేదని, దేశప్రజలు నిగ్రహంగా వుండాలని డోంజెస్ నేడొక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం దక్షిణ ఆఫ్రికాలో భద్రతా చట్టం పేరిట చెలామణిలోవున్న నిరంకుశ చట్టాలను రూపొందించిన న్యాయ శాఖ మంత్రి జాన్ బాల్తజార్ వర్‌స్టర్‌గాని, సభానాయకుడు బెక్ సెహూమెన్‌గాని వెర్వోర్డ్‌వారసులు కావచ్చునని భావిస్తున్నారు.

వెర్వోర్డ్ 1958 లో ప్రధాని అయ్యారు. అంతకుముందు 7 సంవత్సరాలు హోం మంత్రిగా వున్నారు.

1960 ఏప్రిల్ 9 వ తేదీన ఒకసారి వెర్వోర్డ్‌పై హత్యాప్రయత్నం జరిగింది.

జోహన్స్‌బర్గులో ఒక శ్వేత జాతి రైతు ఆ ప్రయత్నం చేశారు. మూర్తీభవించిన జాతి వివక్షతను గురిచూచి కాల్చానని ఆ రైతు తర్వాత కోర్టులో వాఙ్మూలం యిచ్చారు.

కాశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ సదస్సు

శ్రీనగర్, సెప్టెంబర్ 6

జమ్మూ కాశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ మొదటి సదస్సు నేడిక్కడ ప్రారంభమైంది.

కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా కాశ్మీర్ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తంచేస్తూ సదస్సు తీర్మానించింది.

ప్రధాన ఆర్థిక వనరులను జాతీయం చేయాలని కోరుతూ, మిత్ర దేశాలు ముఖ్యంగా సోవియట్ యూనియన్, కాశ్మీర్ సమస్యపై భారతదేశానికి ఇచ్చిన అండదండలకు కృతజ్ఞత వెలబుచ్చుతూ మాజీ ప్రధాని శ్రీ షంసుద్దీన్, సాంఘిక సంక్షేమ మంత్రి శ్రీ తరీక్ ప్రతిపాదించిన సవరణలతో పై తీర్మానాన్ని సభ ఆమోదించింది.

రూకవిలువ తగ్గింపు,విధానాల మార్పుకు సంబంధించిన అతి ప్రధానచర్య:

అంతర్జాతీయ ద్రవ్యసంస్థ వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

"రూపాయి విలువ తగ్గింపు, ఎగుమతి దిగుమతుల తేడాను తగ్గించడానికి ఇటీవలి సంవత్సరాలలో భారతదేశ విధానంమార్పుకు సంబంధించిన అతి ముఖ్యమైన చర్య" అని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నేడు వ్యాఖ్యానించింది.

భారతదేశ విదేశీవ్యాపార చెల్లింపుల పరిస్థితిని సమీక్షిస్తూ ఈ సంస్థ ఇలాచెప్పింది:

"ఈ విషయంలో భారతదేశం 1964 లో తీవ్రమయిన యిబ్బందిలో పడింది. 1966 లో కూడా ఈ చిక్కులుకొనసాగాయి. ఫలితంగా వనరులలో పెద్దభాగం హరించుకొనిపోయింది. ఎన్ని పరిమితులు విధించినా ఉపయోగపడలేదు."

భారతదేశ ప్రభుత్వవర్గాలుక్రింది విధంగా చెప్పినట్లు ఈ సంస్థ ఉదహరించింది.

"మిత్రదేశాలు"విదేశాలలోని మిత్రసంస్థలు తగినంత సహాయంచేస్తే, దిగుమతుల సడలింపు సాధ్యమవుతుంది. అందువల్ల ఆర్థిక వ్యవస్థఅభివృద్ధికిఅవసరమైన ముడిసరుకులు, విడిభాగాలు మొదలగువాటినితెప్పించుకొనడం సాధ్యపడుతుంది."

మిజో కొండల ప్రాంతంలో 32 మంది తిరుగుబాటు దారుల వధ

షిల్లాంగ్, సెప్టెంబరు 6

నిన్న అస్సాం కొండప్రాంతాల్లో రెండు చోట్ల ప్రభుత్వ భద్రతా దళాలకూ, మిజో తిరుగుబాటుదారులకూ ఘర్షణలు జరిగాయి. తిరుగుబాటుదారులు మొత్తం 32 మంది మరణించారు. ప్రభుత్వ దళంలోని ఒక సభ్యుడు కూడా చనిపోయాడు. ఐజల్‌కు 25 మైళ్లలో ఒకచోటా, 10మైళ్ల దూరంలో మరోచోటా [illegible] జరిగాయి.

శచీన్ రాజీనామాకై రాజ్యసభలో భూపేష్ డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

గుత్త పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా తీసుకొనే మొదటి చర్యగా ఆర్థిక మంత్రి శ్రీ శచీన్ చౌదరి రాజీనామా యివ్వాలని కమ్యూనిస్టు పక్షనాయకుడు శ్రీ భూపేష్‌గుప్తా నేడు రాజ్యసభలో డిమాండ్ చేశారు.

స్వర్ణ నియంత్రణ ఉత్తర్వుపై జరిగిన చర్చలలో పాల్గొంటూ పై డిమాండ్ చేశారు.

మెస్సర్స్ ఓర్‌డిగ్నపు కంపెనీ భాగస్తుని యింటిలో సోదా జరిపిన డైరెక్టర్‌ను విచారం తెలుప వలసిందిగా ఆర్థికమంత్రి ఆదేశించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, గుత్తపెట్టుబడిదారుల ప్రతినిధిగా వచ్చి వారికి క్షమాపణలు చెప్పడానికి సంసిద్ధుడైన ఈ ఆర్థిక మంత్రి దొంగ డబ్బునుగాని, దొంగ బంగారాన్ని గాని బయటకు లాగలేడని శ్రీ గుప్తా తెలిపారు.

ఈ సమయంలో ఆర్థికమంత్రి సభలో లేరు.

ఆర్థిక సహాయ మంత్రి శ్రీ భగత్ వైపు తిరిగి శ్రీ గుప్తా మాట్లాడుతూ, "మీరు తప్పుడు బృందంలో వున్నారు. గత ఆర్థికమంత్రులు శ్రీ మురార్జీ దేశాయి, టి. టి. కృష్ణమాచారి, ప్రస్తుత ఆర్థికమంత్రి శ్రీ శచీన్ చౌదరి చేసిన ప్రతి పనియూ సమర్థిస్తున్నారు" అని అన్నారు.

[illegible] వచ్చునని శ్రీ భగత్ అన్నారు.

ఎన్నికలలో కంట్రాక్టర్ల ప్రవేశానికి అవకాశం

ప్రజా ప్రాతినిధ్య సవరణ బిల్లుపై రాజ్యసభలో తీవ్ర విమర్శ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

కంట్రాక్టర్లకు ఎన్నికలలో పోటీచేసేందుకు అవకాశం కల్పించడంపై నేడు రాజ్యసభలో ప్రజా ప్రాతినిధ్యచట్ట (సవరణ) బిల్లుపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు విమర్శించారు. ఇలాంటి అవకాశం కల్పించడం అవినీతికి ద్వారాలు తెరవడమేనని ఖండించారు.

ఈ సవరణబిల్లుపై నేడు రాజ్యసభలో అసమగ్రంగా చర్చ జరిగింది. ఎన్నికల కమిషన్ సిఫారసులను అమలుజరిపేందుకై ఈ బిల్లు ఉద్దేశించబడింది.

కేంద్ర న్యాయశాఖమంత్రి శ్రీ జి. ఎస్. పథక్ ఈ బిల్లును ప్రతిపాదిస్తూ ఎన్నికల ట్రిబ్యునళ్ళ రద్దు, ఎన్నికల పిటీషన్లను సత్వరమే పరిష్కరించేందుకు వాటిని హైకోర్టులలో విచారించడానికి వీలుకలిగించడం ఈ బిల్లులో ప్రధానాంశమన్నారు.

ప్రభుత్వపక్ష, ప్రతిపక్షసభ్యులు అనేకమైన సూచనలు చేస్తూ వాటిని సెలెక్టు కమిటీకి పరిశీలన దశలో పరిశీలించాలన్నారు.

ఇండిపెండెంట్ సభ్యులు శ్రీ ఎ. డి. మణి మాట్లాడుతూ పార్లమెంటరీ వ్యవస్థలను కించపరుస్తూ హింసా చర్యలకు పూనుకున్న సభ్యులను, ఏడాదికి మూడు సార్లు సస్పెండు చేయబడినవారినీ, సభాధ్యక్షుని ధిక్కరించడమే అలవాటుగాగలవారినీ,సభ్యులుగావుండడానికి అనర్హులుగా ఎలక్షన్ కమిషన్ పరిగణించాలన్నారు.

కాంగ్రెస్ సభ్యులు శ్రీ టి. ఎ. ఆనందన్, ప్రజాసోషలిస్టు సభ్యులు శ్రీ ముల్కాగోవింద రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ట్రిబ్యునల్స్ రద్దుపట్ల హర్షం ప్రకటించారు.

మంత్రి మాట్లాడుతూ జనరల్ ఎన్నికల నిర్వహణకాలాన్ని,ఏడురోజులకుతగ్గించడం, ప్రభుత్వంవద్ద కాంట్రాక్టులు తీసుకొని తమ బాధ్యతలను సక్రమంగా పూర్తిచేసి తమకు రావలసిన బకాయీలను మాత్రమే రాబట్టుకోవలసివున్న కాంట్రాక్టర్లకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కలిగించడం ఈబిల్లులో ఇతర ప్రధానాంశాలన్నారు.

స్వతంత్ర పార్టీ సభ్యులు శ్రీ లోకనాథ మిశ్రా, ఇండిపెండెంటు సభ్యులు శ్రీ మణి కాంట్రాక్టర్లకు ఎన్నికలలో పోటీచేసే అవకాశం కల్పించే అవకాశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎన్నికలనిధులు అపారంగాసంపాదించడానికే ఇది ఉద్దేశించబడిందన్నారు, శాసన సభలకు ఎన్నుకొనబడే కంట్రాక్టర్లు తమ పనులను తమకు అనుకూలంగా పరిష్కరింపచేసుకొనడంకోసం ఈ సభలను ఉపయోగించుకోగలరని విమర్శించారు.

మంత్రి మాట్లాడుతూ ఎన్నికల వ్యయం గురించి పరస్పర భిన్నాభిప్రాయాలు ఉన్నందున ప్రస్తుతం ఉన్నచట్టాన్నే మరికొంత కాలం పరిశీలించి చూడాలన్నారు,

ఎన్నికలలో పోటీచేసేవారు కట్టవలసిన డిపాజిట్‌ను పెంచడం జరగదన్నారు. ఈ డిపాజిట్ మొత్తాన్ని పెంచితే ఎన్నికలలో పోటీచేసేవారి సంఖ్య పరిమితం అవుతుందనీ ఎక్కువ మందికి పోటీచేసే అవకాశం లేకుండా పోతుందనీ అన్నారు.

శ్రీ ముల్కా గోవిందరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిర్మాణ రీత్యా సుసంఘటితమైన పార్టీలు కొన్ని అవసరమనీ, ప్రాధాన్యతా క్రమంలో ఓటింగ్ జరిగే పద్ధతిని ప్రవేశపెట్టాలని, అలా చేస్తే మైనారిటీ ఓట్లతో కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా చేయడానికి అవకాశం వుంటుందనీ అన్నారు.

ప్రభుత్వం పార్లమెంటులో సారెసారెకు చిల్లర మల్లరగా బిల్లులను ప్రవేశ పెట్టడానికి బదులు ఒక సమగ్రమైనబిల్లును రూపొందించడానికి ఎన్నికల లా కమిషన్‌ను నియమించాలని కోరారు.

బడా వాణిజ్య వేత్తలు రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చేపద్ధతిని నిషేధించాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ఎన్నికల వ్యయాన్ని అభ్యర్థులు ప్రభుత్వానికి అందచేసే ఖర్చు పట్టికల్లో చూపించాలన్నారు. శ్రీ టి. వి. ఆనందన్ మాట్లాడుతూ జాతీయ దినోత్సవాల సందర్భంలో జాతీయ పతాకను ఎగురవేయకుండా నల్లజెండాల ప్రదర్శనకు పూనుకొనే రాజకీయ పార్టీలను ఎన్నికల్లో పోటీ చేయనీయకుండా నిషేధించాలన్నారు.

శ్రీ ఎ. డి. మణి మాట్లాడుతూ పరుషమైన భాషను మాట్లాడడంకూడా అనర్హతగా పరిగణించాలన్నారు. సభ్యుని ప్రవర్తన విషయంలో తుదినిర్ణయం సభకే వుండాలన్నారు.

శ్రీ శీలభద్రయాజీ (కాం) మాట్లాడుతూ అవినీతిపరులని రుజువైనవారిని ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించాలన్నారు.

ఎన్నికల వ్యయాన్ని కనీస పరిమితికి తగ్గించాలనీ, ఆ విధంగా తమ డబ్బు సంచులతో ధనాధిపతులు పార్లమెంటుకు అధికంగా ఎన్నికై ప్రజాస్వామ్య వ్యవస్థకూ, సోషలిజానికీ ప్రమాదం తెచ్చిపెట్టడాన్ని నివారించాలని కోరారు.

శ్రీ లోకనాథమిశ్రా (స్వ) మాట్లాడుతూ మూడు జనరల్ ఎన్నికలు ముగిసినా దేశానికి సమగ్రమైన ఎన్నికల చట్టం లేదన్నారు.

ఎన్నికల ఫిర్యాదులను విచారించి తీర్పు చెప్పడానికి ఆరు మాసాలకంటె ఎక్కువ పట్టరాదన్నారు. ఆరు మాసాలలో ఎన్నికల ఫిర్యాదులను హైకోర్టులు విచారించి తీర్పు చెప్పవచ్చునని మంత్రి చెప్పడం అస్పష్టంగా వున్నదన్నారు.

మంత్రి కొంతమంది ఒత్తిడి మూలంగానే కంట్రాక్టర్లు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ బిల్లులో అవకాశం కల్పించారనీ, ఇలా చేయడం అవినీతికి ద్వారాలు తెరవడమేనని విమర్శించారు.

ఎన్నికల అనంతరం పార్టీ మారే సభ్యుల ఎన్నికను రద్దుచేసి, ఆసభ్యుడు తిరిగి ఎన్నిక కావాలన్న నిబంధన వుండాలన్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణాధికార్లను ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల నుండి కాక న్యాయశాఖ నుండి తీసుకోవాలన్నారు.

శ్రీ పి. సి. మిత్రా (కాంగ్రెసు) ఎన్నికల ట్రిబ్యునళ్ల రద్దును వ్యతిరేకించారు. ఎన్నికల ట్రిబ్యునల్‌లోని ముగ్గురు సభ్యులలో ఒకరు హైకోర్టు న్యాయమూర్తి వుండాలన్నారు. సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం వుండదన్నారు.

దీనికి మంత్రి శ్రీ పథక్ సమాధానం చెబుతూ సుప్రీంకోర్టు అధికారాలను తగ్గించరాదన్నారు.

దీనిపై శ్రీ మిత్రా మాట్లాడుతూ అయితే ఇలాంటి సందర్భాలల్లో సుప్రీంకోర్టు ఒక్క న్యాయ సూత్రాలను మినహాయించి ఇతర అంశాలను పేటనీ విచారించరాదన్నాడు.

శ్రీ అబ్దుల్ గనీ (ఇండిపెండెంట్) మాట్లాడుతూ రూపాయి నోట్లను ముద్రించేతీరులోనే ఓటింగ్ పత్రాలను సైతం ముద్రించాలనీ, ఈ విధంగా చేస్తే నకిలీ ఓటింగ్ పత్రాలను నివారించడానికి వీలౌతుందనీ అన్నాడు.

శ్రీ నిరేన్ ఘోష్(మార్క్సిస్టు) ఎన్నికలకు ముందుగా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఆపద్ధర్మ ప్రభుత్వాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. దామాషా ప్రాతిపదికపై ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలని కోరారు.

దీనిపై శ్రీ వి. కె. పి. సిన్హా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సవరించకుండా దామాషా పద్ధతిని ప్రవేశపెట్టడం సాధ్యంకాదన్నారు.

ఢిల్లీ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి

రాజ్యసభలో కాల్ అటెన్షన్ నోటీసు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

నేడు రాజ్యసభలో ఢిల్లీలో న్యాయ కళాశాల విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జీతో సహా బోనస్ చెల్లింపు చట్టానికి సవరణలు, స్టేషన్ మాష్టర్లు ఉద్దేశించిన ఆందోళన, హిందుస్థాన్ అల్యూమినియం ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె మొదలగు అంశాలపై ప్రతిపక్ష సభ్యులు కాల్ అటెన్షన్ నోటీసులు యిచ్చారు.

ఈ సమస్యలపై సావధాన తీర్మానాలను అనుమతించాలా, వద్దా అనే విషయంగురించి తన నిర్ణయాన్ని తరువాత తెలియజేయగలనని సభాపతి చెప్పారు.

ఎస్. ఎస్. పి. సభ్యుడు శ్రీ గౌరీ మురహరి మాట్లాడుతూ, గత శనివారంనాడు న్యాయ కళాశాల విద్యార్థులు ఢిల్లీలో జరిపిన ప్రదర్శనపై పోలీసులు లాఠీఛార్జీ జరిపిన ఫలితంగా అనేక మంది విద్యార్థులు గాయపడ్డారని చెప్పారు. న్యాయ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందువల్ల ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులందరూ సమ్మెకు పిలుపుయివ్వటం జరిగిందని, వారి యిబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు జరపాలని ఆయన కోరారు.

హోంశాఖ స్టేట్‌మంత్రి శ్రీ జె. ఎల్. హాథీ సమాధానంచెపుతూ, కేంద్ర హోంశాఖ మంత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు తలపెట్టిన సమ్మెపై, ఢిల్లీ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌తో సంప్రదింపులు జరిపారని తెలిపారు. విద్యార్థుల యిబ్బందులు గురించిఆయనప్రస్తావించి అదిన్యాయమంత్రిత్వశాఖకుసంబంధించిన అంశమని అన్నారు

నైజీరియాలో ఆనందాతిశయం

లాగోస్, సెప్టెంబరు 6

దక్షిణాఫ్రికా ప్రధాని వెర్వోర్డును పార్లమెంటులో హత్య చేశారని నైజీరియా రేడియో ప్రకటించగానే లాగోస్ వీధుల్లో ఆనందాతిశయంతో చేతులు ఎత్తి కేకలు వేస్తూ ప్రజలు గంతులు వేశారు.

వెర్వోర్డు హత్యపై నైజీరియా ప్రభుత్వం యింతవరకుఅధికారప్రకటనఏదీచేయలేదు.

మరో 2 సంవత్సరాల వరకు ఐరాస కార్యదర్శిగా ఉథాంట్

భద్రతా సమితి కోరితే ఉండవచ్చునని వార్త

న్యూయార్కు, సెప్టెంబరు 6

భద్రతా సంఘం అభ్యర్థించితే ఐ. రా. స. కార్యదర్శిగా మరో రెండు సంవత్సరాలపాటు పనిచేయటానికి ఉథాంట్ అంగీకరించవచ్చునని విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తున్నదని రాయిటర్ విలేకరి వ్రాస్తున్నాడు.

నవంబరు 3 వ తేదీ తర్వాత పదవీ విరమణ చేయాలనే మీ నిర్ణయానికి తిరుగులేదా? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఉథాంట్ అవుననిగానీ కాదనిగానీ సమాధానం చెప్పలేదు.

అయిదు రోజుల విశ్రాంతి అనంతరం ఉథాంట్ ఈ రోజే ఐ. రా. స. కార్యాలయానికి వచ్చారు. గత గురువారం చేసిన ప్రకటన గురించి వివరించటంగాని, వ్యాఖ్యానించటంగానీ చేయనని ఆయన విలేకరులతో చెప్పారు.

సెప్టెంబరు 20 వ తేదీన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశం ప్రారంభం కావటానికి ముందు పత్రికా గోష్ఠి జరుపుతానని, ప్రధానమైన ప్రశ్నలకు అప్పుడు జవాబు చెప్తానని అన్నారు.

భార్యల ఉత్తరాల సెన్సార్

లోక్ సభలో సభ్యుల ఫిర్యాదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6

ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులపై గూఢచారిశాఖ నిఘా గురించి నిన్న లోక్ సభలో చర్చ జరిగినప్పుడు శ్రీయన్.జి. రంగా, శ్రీ హేంబారువా, తమ భార్యలు రాసే పుత్తరాల్నిసైతం పోలీసుశాఖవారు తొక్కిపట్టేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సెన్సార్ వాళ్ళ మతిమాలిన ప్రవర్తనకు విసిగిపోయి మా ఆవిడ ఉత్తరాలు రాయడమే మానేసింది అని శ్రీరంగా చెప్పారు.

స్వర్గీయ నెహ్రూ హయాంలో తానూ యిలాంటి ఫిర్యాదులే చేయవలసివచ్చింది అని ఆచార్యకృపలానీ చెప్పారు.

రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇరువర్గాల మధ్య రాజీకి ప్రయత్నం

ఉభయవర్గాల నాయకులతో శ్రీ కామరాజ్ చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

ఆంధ్ర కాంగ్రెసులోని రెండువర్గాల మధ్య రాజీ కుదర్చడానికి కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కామరాజ్ మరొకసారి ప్రయత్నం ప్రారంభించినట్లు తెలుస్తున్నది.

శ్రీ కామరాజ్ నేడు వేరు వేరుగా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డితోను, కేంద్ర మంత్రి శ్రీ సంజీవరెడ్డితోను చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు యింతవరకు ఒక కొలిక్కి రాలేదని తెలుస్తున్నది.

ఆంధ్ర నాయకులిద్దరు తిరిగి రేపు శ్రీ కామరాజ్‌తో చర్చించగల అవకాశంవుంది.

శ్రీ కామరాజ్ రేపు శ్రీనగర్‌కు పయనం కావలసివుంది. అయితే వాతావరణం సరిగా లేనందున ఆయన ప్రయాణం కొనసాగుతుందో లేదో ఇదమిద్ధంగా తేలలేదు.

శ్రీ కామరాజ్ రేపు శ్రీనగర్‌కు బయలుదేరపోయేముందే ప్రదేశ్‌కాంగ్రెసు ఎన్నికల సంఘానికి ఎన్నిక తేదీని నిర్ణయిస్తారని ముఖ్యమంత్రి వర్గంవారు ఆశిస్తున్నారు. ఈ ఎన్నిక తేదీని ఎలాగైనా వాయిదావేయించాలని శ్రీ సంజీవరెడ్డివర్గం ప్రయత్నిస్తున్నది.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ సెప్టెంబరు 14 నాయంత్రం అలహాబాద్ వెళ్ళి, అక్కడనుంచి 17 న లక్నో వెళతారు.

ఆదిలాబాద్ జిల్లాకు బయటి ప్రపంచంతో సంబంధాలులేని స్థితి

భారీవర్షాల ఫలితంగా పలుచోట్ల రోడ్లకు గండ్లు

హైదరాబాద్, సెప్టెంబరు 7

భారీ వర్షాలవల్ల కడెం ప్రాజెక్టుకు అటూయిటూ వున్న రోడ్లకు గండ్లు పడటంతో ఆదిలాబాద్ జిల్లాకు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో సంబంధం లేకుండాపోయింది అని నిన్న ఆ జిల్లా కేంద్రంనుండి రాష్ట్ర రాజధానికి వైర్లెస్ ద్వారా సమాచారం అందింది.

రాష్ట్రమంతటా యీవారం బాగా వానలు పడ్డవి. ఇది పంటలకు లాభకారిగావుంటుంది అని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు పత్రికలవారికి చెప్పారు.

మధ్యరైల్వేలో రైళ్ళకు అంతరాయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

న్యూఢిల్లీ మద్రాసుల మధ్య,మధ్య రైల్వే మార్గానికి అనేకచోట్ల భారీవర్షాలవల్ల గండ్లు పడ్డవి. ఫలితంగా ఈ మార్గంలో రైళ్ళరాకపోకలకు పెద్దగా అంతరాయం ఏర్పడింది.

జి. టి. ఎక్స్‌ప్రెస్‌ను నాగపూర్, రాయ్‌పూర్, విజయనగరం, విజయవాడ మీదుగా నడుపుతున్నారు. సదరన్ ఎక్స్‌ప్రెస్‌ను ఇటార్సీ, మన్మాడ్, ధోండ్, సికింద్రాబాద్, కాజీపేట మీదుగాను, జనతా ఎక్స్‌ప్రెస్‌ను మన్మాడ్, ధోండ్, రాయచూర్ మార్గానికి మరలించారు.

ఈరోజు ఢిల్లీనుండి మద్రాసుకు బయలుదేరుతున్న ఎయిర్‌కండిషన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రత్యేక వసతులను, భోజనశాల ఏర్పాటును రద్దుచేశారు.

ఈరోజు జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు నరాసరివెళ్ళే పెట్టెల్నికూడా రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

భారతీయ పైలెట్లకు సోవియట్‌లో శిక్షణ పూర్తి

మాస్కో, సెప్టెంబరు 6

సోవియట్ టి. యు. 124 జెట్ ప్రయాణ విమానాలను నడపడంలో 50 మంది భారతీయ పైలెట్లు శిక్షణ పొందడం కొద్ది రోజులలో పూర్తి కావస్తున్నదని నేడిక్కడ అధికారవర్గాలు తెలియజేశాయి.

వాల్కాట్, డోంజేలకు 5 ఏండ్ల జైలుశిక్ష

మద్రాసు, సెప్టెంబరు 7

దొంగపేర్లు చెప్పి మోసపు చర్యలకుపాల్పడినందుకు, మోసపు ప్రయాణ అనుమతి పత్రాలతో దేశంలో ప్రవేశించినందుకు, అమెరికా దేశస్థుడు డానియల్ వాల్కాట్, ఫ్రెంచి దేశస్థుడు డోంజేలకు మద్రాసు సెషన్స్‌జడ్జి శ్రీ యస్. గణేశన్ అయిదేసి సంవత్సరాల చొప్పున యిరువురికి కఠిన శిక్షలు విధించారు.

విదేశీయుల చట్టం, పాస్‌పోర్టునిబంధనలు ఇండియన్ పీనల్‌కోడ్, భారత రక్షణ నిబంధనల క్రింద వీరికి ఈ శిక్షలు విధించబడినాయి.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వాల్కాట్, డోంజేలు 1965 డిశంబరు 31 వ తేదీన దొంగ ప్రయాణానుమతి పత్రాల సహాయంతో చార్లెస్ ఫిలిప్స్ వాలెస్ క్లామెన్, స్టీఫెన్ థామస్‌లాట్ అనే మారుపేర్లతో మన దేశంలో ప్రవేశించారు.

ముద్దాయిలు చేసిన నేర స్వభావం తీవ్రమయినదని,దేశభద్రతకు వారిచర్య ప్రమాదం కల్గించేదిగా వున్న దృష్ట్యా, వారిపట్ల ఉదార వైఖరి అవలంబించటం అసాధ్యమని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు.

తమ చర్యలయొక్క పరిణామాలు తీవ్రంగా వుంటాయని నిందితులకు తెలియని విషయం కాదని న్యాయమూర్తి అన్నారు.

"ఇరుగు పొరుగున గల కొన్ని దేశాలు విశదపడకుండా జరుపుతున్న కవ్వింపు చర్యల వల్ల దేశం అనుక్షణం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటూ మనవలసిన పరిస్థితిలో వుంది. ప్రస్తుతానికి ఈ విదేశీయులు చేసిన నేరం అమాయకమయినదిగా, కనిపించినా నేరం ఉద్దేశ్యపూర్వకంగా చేసినట్లు కనిపించకపోయినా మొగ్గలోనే తుంచివేయకపోతే యిదే భావ్యం ముందు ముందు యెక్కువయి, అదొక పెద్ద తలనొప్పిగానూ, ప్రమాదంగానూ పరిణమించవచ్చు. అందువల్ల ఇటువంటి చర్యల విషయంలో ఉదారంగా వ్యవహరించటం ప్రమాదకరం" అని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టంచేశారు.

కామన్‌వెల్త్ సభ ఎదుట అయూబ్ వ్యతిరేక ప్రదర్శన

లండన్, సెప్టెంబరు 6

కామన్‌వెల్తు ప్రధానుల సభ జరుగుతున్న మెల్బరోహౌస్ ఎదుటవందలాది పాకిస్తానీయులు ఈరోజు అయూబ్ వ్యతిరేక నినాదాలతో నిరసన ప్రదర్శన జరిపారు.

"తూర్పు పాకిస్తాన్‌ను అయూబ్ నాశనం చేయలేడు". "పాకిస్తాన్ అయూబ్‌ఖాన్ గుత్తసొమ్ము కాదు." "తూర్పు పాకిస్తాన్‌కు సంపూర్ణ స్వయం నిర్ణయప్రతిపత్తి ఇవ్వాలి" "అమాయక పాక్ ప్రజలపై సాగుతున్న హత్యాకాండను అరికట్టాలి" అనే నినాదాలు వ్రాసిన ప్లేకార్డులను ప్రదర్శకులు చేతపట్టుకు వచ్చారు.

కామన్‌వెల్త్ సభముందు ఇలా అయూబ్ వ్యతిరేక ప్రదర్శన జరగటం ఇదే ప్రథమం. కామన్‌వెల్త్ సభలో పాల్గొంటున్న పాక్ ప్రతినిధివర్గానికి విదేశాంగమంత్రి పీర్జాదా నాయకత్వం వహిస్తున్నారు.

రొడీషియాలో స్మిత్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ కొంతమంది ఆఫ్రికన్లు మరొక ప్రదర్శన జరిపారు.

స్మిత్‌ను బలపరుస్తూ కొంతమంది శ్వేత జాతీయులు మూడవ ప్రదర్శన చేశారు.

శ్రీ సుబ్రమణ్యం కుంభకోణం

(1వ పేజీ తరువాయి)

అధ్యక్షులు వ్యాఖ్యానించారు.

సభా నాయకుడు శ్రీ చాగ్లా జోక్యం కలిగించుకొని ఇలా అన్నారు:

కోయంబత్తూరుకు చెందిన యంత్ర పరికరాల ఉత్పత్తిదారుల కంపెనీ కిచ్చిన దిగుమతి లైసెన్సు విషయమై వచ్చిన ప్రశ్నకు శ్రీ మనూభాయిషా సమాధానమిచ్చారు.

"అప్పుడు భారీ పరిశ్రమల మంత్రిగా వున్న శ్రీ సుబ్రహ్మణ్యం వ్రాసిన విషయాలను తెలియజేస్తూ కొన్ని ఫైళ్ళను ప్రతిపక్ష సభ్యులు సభ,దృష్టికి తీసుకొని వచ్చారు.

ఈ విషయమై మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యానికి ముందుగా నోటీసు ఇచ్చివుండవలసింది. శ్రీ సుబ్రహ్మణ్యం అప్పుడు ఏదో చేసిన దానికి శ్రీ మనూభాయిషా ఇప్పుడు సమాధానం చెప్పలేరు."

సభలో తీవ్ర వాగ్యుద్ధానికి కారణభూతమైన ఈ సమస్యపై వాదోపవాదాలను ఇక ఆపవలసిందిగా అప్పుడు అధ్యక్షుడు ఇలా అన్నారు.

"లైసెన్సుకు సంబంధించినంత వరకు మంత్రి సంతృప్తికరమైన సమాధానమిచ్చారు. ఇతర విషయాలు పరిశీలించవలసి వుంది. శ్రీ చంద్రశేఖర్ సరిగానే చెప్పినట్లు మనం ఉపేక్షించరాని కొన్ని విషయా లున్నాయి. బాధ్యతగల కొంతమంది సభ్యులు కొన్ని విషయాలు చెప్పారు. వాటిని ప్రభుత్వం గమనించి, వాటిని గురించి ఏమిచేయాలో నిర్ణయించుకోవాలి."

కోయంబత్తూరు కంపెనీకి ఇచ్చిన దిగుమతి లైసెన్సుపై శ్రీ వి. యం. చోర్డియా మొదలగువారు అడిగిన ప్రశ్న పర్యవసానంగా పై విషయాలన్నీ బయటపడ్డాయి.

ఈ ప్రశ్నకు శ్రీ మనూభాయి ఇచ్చిన సమాధానంలో క్రింది విషయాలు చెప్పారు:

"ఈ కంపెనీకి 1961 సెప్టెంబరు 14 న దిగుమతి లైసెన్సు మంజూరు చేసిన విషయంలో ఒక అసిస్టెంట్ కంట్రోలర్ పైన చీఫ్ కంట్రోలర్ ఆఫీసులోని ఒక గుమాస్తా పైన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

కంపెనీ దిగుమతి చేసుకోదలచిన సరకులు దేశంలో లభ్యం కావనే సర్టిఫికెట్ లేకనే ఆ కంపెనీకి దిగుమతి లైసెన్సు యివ్వడానికి వీరు తోడ్పడ్డారు.

ఈ విషయంలో పోలీసుల దర్యాప్తులో తేలినదేమంటే. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించింది అధికారులు కాబట్టి వారి పైననే చర్య తీసుకోవలసింది. ఇందులో కంపెనీ బాధ్యత ఏమీ లేదు.

ఈ కంపెనీ పెట్టుకొన్న దరఖాస్తులు ఫైసల్ కాకుండా వున్న సందర్భాలలో, ఆ ఫైళ్ళను స్పెషల్ పోలీసుశాఖ నుండి కేంద్రం సెక్రటేరియట్‌కు తెప్పించింది. దిగుమతి లైసెన్సుకై ఈ కంపెనీ పెట్టుకొన్న దరఖాస్తును ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రిత్వశాఖ, ఎగుమతి దిగుమతి చీఫ్‌కంట్రోలరు పరిశీలించి, లోగడ మంజూరై ఆపుజేయబడ్డ లైసెన్సును పునరుద్ధరించారు.

కంపెనీ దిగుమతి చేసుకోదలచిన సరకులు దేశంలో లభ్యంకాని సరకుల జాబితా తయారుచేసి దాని ఆధారంగానే లైసెన్సు మంజూరు చేశారు."

ముచ్చటైన ముద్రణకు బహుమతులు పొందిన దినపత్రికలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

1965 లో ముచ్చటైన ముద్రణకు గాను ఆరు దినపత్రికలకు ప్రభుత్వ బహుమతులు లభించాయి.

మద్రాసు నుంచి వెలువడే తమిళ దిన పత్రిక 'నవమణి' కి ప్రథమ బహుమతి లభించింది.

ఢిల్లీనుంచి వెలువడే 'పేట్రియట్' కలకత్తానుంచి వెలువడే 'హిందుస్థాన్ స్టాండర్డు' ఆంగ్ల దిన పత్రికలకు ద్వితీయ బహుమతి లభించింది.

సైన్యాల ఉపసంహరణకు జాన్సన్ షరతు

లంకస్టర్, సెప్టెంబరు 6

దక్షిణ వియత్నాంలోని తమ సైన్యాలను ఉత్తర వియత్నాం ఉపసంహరించడానికి అంగీకరించి, అందుకు కార్యక్రమాన్ని నిర్ణయించితే, అదేపనిని చేయటానికి అమెరికా సిద్ధమేనని జాన్సన్ నేడిక్కడ అన్నారు.

"ప్రత్యేక పరిస్థితులలో యూరప్‌నుండి కొన్ని అమెరికన్ సైన్యాలను ఉపసంహరించటం జరగవచ్చు. అయితే అటువంటి ప్రతిపాదనను మొత్తం నాటో కూటమి దేశాలన్నీ కలిసి చేయాల్సివుంటుంది" అని అమెరికా అధ్యక్షుడు అన్నారు.

గతవారం కాంబోడియాలో మాట్లాడుతూ ఫ్రెంచి అధ్యక్షుడు డిగాల్ వియత్నాం సమస్యా పరిష్కారానికి చేసిన సూచన గురించి జాన్సన్ ప్రస్తావించలేదు.

పోలవరం అసిస్టెంట్ గ్రెయిన్ పర్చేజి ఆఫీసరు రాజమండ్రినుండి లాంచీలలో దొంగరవాణా అవుతున్న 10 బస్తాల బియ్యాన్ని 26 బస్తాల నూకలను పట్టుకొన్నారు.

స్వర్ణకారుల కడుపుకొట్టిన బంగారం కంట్రోల్సు, రద్దు కావాలని శ్రీభూపేష్ డిమాండ్

రాజ్యసభలో మంత్రి నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

లక్షలాది మంది స్వర్ణకార కుటుంబాలకు జీవనభృతి పోగొట్టి నానా అవస్థలపాల్జేసిన బంగారు కంట్రోలు ఉత్తర్వును పూర్తిగా రద్దుచేయాలని, నేడు రాజ్యసభలో కమ్యూనిస్టు పక్ష నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా డిమాండ్ చేశారు.

ఆర్థికశాఖ సహాయమంత్రి శ్రీ భగత్ మాట్లాడుతూ బంగారు కంట్రోలు ఉత్తర్వు రద్దును నిరాకరించారు. ఈ ఉత్తరువును లన్ని దొంగవ్యాపారాన్ని అరికట్టడానికి ఒక సాధనంగా పటిష్టంచేసి కాపాడాలని ఆయన అన్నారు.

రెండు గంటలపాటు జరిగిన ఈ చర్చలో మంత్రి జోక్యంకల్పించుకుంటూ 'మన దేశంలో కొరతగా ఉన్న బంగారాన్ని ఉపయోగించడాన్ని మనం ప్రోత్సహించరాదు. ఆభరణాలుగానూ లేదా సమాజంలో హోదాకు చిహ్నంగానూ బంగారాన్ని ఉపయోగించే పద్ధతికి స్వస్తిజరగాలి" అని అన్నారు.

స్వర్ణకారులను సంతృప్తి పరచడానికే 14 క్యారెట్ల బంగారాన్ని ఉపయోగించాలన్న నిబంధన రద్దుచేయడం జరిగిందన్నారు. ముడి బంగారంపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటన దొంగరవాణాను తగ్గించడానికి ఉద్దేశించినదే నన్నారు,

ఆందోళన సందర్భంలో అరెస్టుచేసిన స్వర్ణకారులందరినీ విడుదల చేయడం జరిగిందన్నారు.

ఈ స్వర్ణ నియంత్రణ ఉత్తర్వు ఈ మూడేండ్లలో దొంగరవాణాను అరికట్టడం గానీ, బంగారుధర తగ్గించడంగానీ చేయలేక పోయిందన్న విమర్శను ప్రస్తావించి ఒక సాంఘిక ఆర్థిక చర్యగురించి న్యాయ నిర్ణయం చేయడానికి మూడేండ్ల కాలం చాల దన్నారు. ద్రవ్యోల్బణ పరిస్థితుల మూలంగా బంగారు ధర పెరిగిందన్నారు.

బంగారు దొంగ వర్తకం మన ఆర్థిక జీవనాన్ని దెబ్బ తీస్తున్నందున ఈ ఉత్తర్వు ఉండాలని సమర్థించుకొన్నారు.

ఈ దొంగ రవాణాను అరికట్టడానికి విదేశీ వర్తకాన్ని జాతీయం చేయాలన్న శ్రీ భూపేష్ సూచనను ప్రస్తావించి ఇది పరిష్కారమార్గం కాదన్నారు. కానీ అది అవసరమైతే క్రమంగా తాము ఆ పని కూడా చేయగలమన్నారు. విదేశీ ద్రవ్య మారకం హరింపును నిరోధించడానికి ఇతర చర్యలేవీ లేకపోతే మేమా పనిచేయగలం అని మంత్రి అన్నారు.

బంగారు అభరణాలపై పరిమితి ఏమేరకు అనుమతించారో మాత్రం మంత్రి చెప్పలేదు. ముడి బంగారంపైనిషేధం బంగారునాణేలకు సైతంవర్తిస్తుందన్నారు. రు. 2 వందల కోట్ల విలువ మేరకు బంగారు అభరణాలు చెలామణిలో ఉన్నాయని అందువల్ల అభరణాల తయారీకి స్వర్ణకారులు బంగారం సంపాదించుకోవడం కష్టమేమీ కాదనీ అన్నారు.

బంగారు కంట్రోలు ఉత్తర్వు మంచి చెడ్డలను విస్మరించి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, స్వతంత్ర పార్టీ సభ్యులు ఈ ఉత్తర్వు రద్దు కావాలని ఏకకంఠంతో డిమాండ్ చేయడం తనకు విస్మయం కల్గిస్తున్నదన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యానే ప్రతిపక్షాలు ఈ బిల్లు రద్దుకోసం డిమాండ్ చేస్తున్నాయంటూ మంత్రి చేసిన ఆరోపణలను శ్రీ భూపేష్‌గుప్తా, తదితర ప్రతిపక్షాల సభ్యులు ఖండించారు.

ఈ బిల్లును మూడేండ్లక్రితం ప్రవేశపెడుతున్న సందర్భంలో శ్రీ భూపేష్‌గుప్తా మొరార్జీదేశాయిని "గుజరాత్ నియంత" అని అభివర్ణించడమూ, ప్రతిపక్ష సభ్యులందరు ఈ బిల్లును వ్యతిరేకించడమూ మంత్రి గుర్తు తెచ్చుకోవడం మంచిదన్నారు.

శ్రీయుతులు భూపేష్‌గుప్తా, దయాభాయ్ పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది మంది స్వర్ణకారుల కుటుంబాలను నాశనం చేసిందనీ, తప్పుడు అంచనాలతో కూడిన ఈ నిరంకుశ చర్యను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేశారు.

కాంగ్రెసు మహిళా సభ్యురాండ్రు శ్రీమతి లలితా రాజగోపాలన్, కుమారి పేరీనాయుడు శ్రీమతి అనీస్‌కిద్వాయ్ స్వర్ణ నియంత్రణ ఉత్తర్వును సమర్థించడానికిప్రయత్నించారు. స్వర్ణకారులు 22 క్యారట్ల బంగారుఅభరణాలు చేసేందుకు అనుమతిస్తూ స్వర్ణ నియంత్రణ ఉత్తర్వును మార్చడంద్వారా ప్రభుత్వం తప్పు చేసిందని శ్రీమతి కిద్వాయ్ అన్నారు.

భూపేష్ ప్రసంగం

దొంగవర్తకాన్ని నిరోధించడానికే బంగారు కంట్రోలు ఉత్తర్వును కొనసాగిస్తున్నామంటూ మంత్రి సమర్థించుకొంటూ వుండగా శ్రీభూపేష్‌గుప్తా లేచిమాజీసంస్థానాధిపతులు, కోటీశ్వరులు దాచివుంచిన బంగారాన్ని వెలికితీయడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుంది?" అని సూటిగా ప్రశ్నించారు.

ఈ కంట్రోలు ఉత్తర్వును సవరించడం మొత్తంమీద మంచిదే అయినప్పటికీ దీనిని మొత్తంగా రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఈబంగారుకంట్రోలుఉత్తర్వు మూడేండ్లుగా అమలులో ఉన్నప్పటికీ దీనివల్ల దొంగరవాణాతగ్గినట్లు ప్రభుత్వకమిటీ తననివేదికలో ఎలాంటి రుజువునూ చూపలేకపోయిందని ఆయన అన్నారు. ఈకమిటీ నివేదికపై శ్రీ భూపేష్ విమర్శిస్తూ దొంగ రవాణా తగ్గిందో లేక పెరిగిందో చెప్పడానికి మాకు ఈ కమిటీ అవసరంలేదు. ఇది పూర్తిగా అనర్థమైన కమిటీ అని అన్నారు.

నిర్బంధ పొదుపు పథకం ఇలాంటి ఉత్తర్వులను ప్రవేశపెట్టడానికి మొరార్జీ దేశాయ్ అహంభావమే కారణం. నిర్బంధ పొదుపు పథకానికి ఆయన పోవడంతోనే స్వస్తి జరిగింది. ఈ నిరంకుశ ఉత్తర్వు ద్వారా ప్రభుత్వం వేలాదిమంది స్వర్ణకారుల జీవితాలతో చెలగాట మాడుతున్నది. హస్తకళలను ధ్వంసం చేస్తున్నది. బంగారు కంట్రోలు ఉత్తర్వు అమలును కొనసాగించడంద్వారాతప్పిదంచేసినందుకుప్రధానమంత్రి దేశానికి క్షమాపణ చెప్పుకోవాలి.

దేశంలో ధనస్వాములు అపారంగా బంగారాన్ని దాచి వుంచారు, 1966-66 మధ్య 2197 కిలోగ్రాములు దొంగ బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం పట్టుకొన్నది. దాచి వున్న బంగారంతో పోల్చినప్పుడు ఇది అతి స్వల్పం మాత్రమే. ఈ బంగారు కంట్రోలు ఉత్తర్వు మూలంగా దెబ్బతిన్నది మధ్య తరగతి ప్రజలు మాత్రమే.

ఈ ఉత్తర్వు అమలులో వున్నప్పటికీ బంగారందొంగరవాణానిరాఘాటంగాసాగింది, విదేశీ వాణిజ్యం ముసుగులో అనేక అక్రమ పద్ధతులద్వారా గుత్త పెట్టుబడిదార్లు బంగారాన్ని బ్లాక్ మార్కెట్టులోకి తెస్తూనేవున్నారు.

ఈ ఉద్యమం అమలులోకి వచ్చిన తరువాత ఎంతమంది తమ వద్దగల బంగారు నిధులను ప్రకటించారు? జైపూర్, బికనీర్ సంస్థానాధీశులూ, హైదరాబాద్ నైజాం నవాబు తమ వద్దగల బంగారు నిధులను గురించి వెల్లడించారేమో నేను తెలుసుకోగోరుతున్నాను. ఈ విధంగా వీరు బంగారు నిధులను దాచడంపై ఆంక్షలు విధించాలి. శిక్షించాలి. ఈ దొంగ బంగారాన్ని వెలికి తేవడానికి అవసరమైనపుడల్లా సోదా చేయడానికి అవకాశం వుండాలి అని శ్రీ భూపేష్ డిమాండ్ చేశారు.

EDUCATIONAL

Account Test (Andhra Pradesh) for Executive Officers, Subordinate officers, Parts: I, II; P. W. D., Headmasters, Deputy inspectors Test, Zilla parishad account Test, Postal Tuition offered. Prospectus Free.

Apply to:—

Account Test Institute,
Egmore, MADRAS—8.

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా దివితాలూకా కోడాలి గ్రామపంచాయతీ పేరియాలోని యీ క్రింది పనులు చేయుటకు, ఈ క్రింది సామానులు సప్లయి చేయుటకు ది 21—9—1966 బుధవారం మధ్యాహ్నం 2 గంటలలోగా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు అదేరోజున మధ్యాహ్నం గం. 2-30 ని. లకు కార్యనిర్వాహక ఉద్యోగి వారిచేగాని లేక వారిచే అధికార మియ్యబడిన వారిచేగాని టెండరుదారుల సమక్షములో తెరువబడును. ఇతర విషయములు ఆఫీసు పనిచేయు సమయములలో తెలుసుకోవచ్చును.

వ. నెం.	ఐటము	ఎస్టిమేటు మొత్తం	డిపాజిట్లు
1.	పాటినుండి శ్రీకాకుళం రోడ్డునకు కంకర వేయుట	రు. 4000-00	రు. 200-00
2.	గౌడబజారు రోడ్డు చివర భాగమునకు కంకర వేయుట	2560-00	125-00
3.	బజారు దీపములకు మెటీరియల్స్		50-00
4.	ఎంద్రిన్‌కు		50-00
5.	స్ప్రేయర్లు 2		25-00
6.	యినుప బీరువా 78″ × 36″ × 20″ (6 అరలు. ప్లెయిన్) 1		25-00
7.	గోడ గడియారము 1		10-00

టెండరులో పూర్తి వివరములు వుండవలెను.

(సం.) టి. రామచంద్రరావు
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు,
కోడాలి గ్రామ పంచాయతీ.

ఆపుల గోపాల కృష్ణమూర్తి మృతి

తెనాలి, సెప్టెంబరు 6

ప్రముఖ రాడికల్ హ్యూమనిస్టు, న్యాయవాది శ్రీ ఆపుల గోపాలకృష్ణమూర్తి నేటి రాత్రి 11 గంటల వేళ ఇక్కడ తమ స్వగృహంలో కన్నుమూశారు.

శ్రీ గోపాల కృష్ణమూర్తి వయస్సు 58 సంవత్సరాలు. వారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు గలరు.

ఈయన కొంతకాలం తెనాలి మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు.

దేశంలో శాంతి భద్రతల పరిస్థితి

ప్రతిపక్షాలపై నందా విసుర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6

ప్రతి ఒక్క విషయంమీదా అల్లకల్లోలాల్ని సృష్టించడమే ధ్యేయంగా పెట్టుకొని పని చేస్తున్న పార్టీలు, గ్రూపులు మన దేశంలో కొన్ని వున్నాయి. ఈ ధోరణిని రాజకీయంగానూ, పరిపాలనా సంబంధమైన చర్యలద్వారా కూడా అదుపులో పెట్టకతప్పదు అని కేంద్ర హోంమంత్రి శ్రీ నందా నేడిక్కడ జరిగిన హోంశాఖ పార్లమెంటరీ సలహాసంఘ సమావేశంలో చెప్పినట్లు తెలియవచ్చింది,

ప్రజల అసంతృప్తికి అనేక కారణాలుండవచ్చు అయినా, మనదేశప్రజలు చాలా సహిష్ణుత కలవారు. కష్టాల్లో వున్నది తామొక్కళ్ళమేకాదనీ, అందరూ వాటిని అనుభవిస్తున్నవారేనని గుర్తించినప్పుడు వారు ఎన్ని కష్టాలనైనా భరిస్తారు.

దేశంలో వివిధ సరుకులకొరతను, అధిక ధరలను, అక్రమలాభార్జన, సరుకులదాచివేత, చీకటి వ్యాపారం లాంటివికూడా [illegible] శాంతి భద్రతల్ని కాపాడ్డం సాధ్యమయ్యే పనికాదు అని ఆయన అన్నారు.

ప్రజల యిబ్బందుల్ని, వారి ఫిర్యాదుల్ని పరిష్కరించేటందుకు అవసరమైన యంత్రాగాన్ని పెంపుచేయాలి. అయితే, పరిపాలనా సర్దుబాటుద్వారా మాత్రమే యిది సాధ్యంకాదు. రాజకీయ ప్రచారంద్వారా, యథార్థ విషయాల్ని ప్రజలకు ఎరుకపరచడంద్వారా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. బంద్ ఉద్యమాల్లాంటి ఆందోళనలకు కారణాలేమో కనిపెట్టాలి. వాటిని నిర్వహిస్తున్న శక్తులు అనుసరిస్తున్న పద్ధతుల్ని గురించి, వారి ఆశయాల గురించీ ప్రజలకు నచ్చచెప్పాలి, అని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో ప్రసంగించిన కాంగ్రెస్ సభ్యులు శ్రీ భగవత్ ఝా ఆజాద్, మరి కొందరు దేశంలో శాంతి భద్రతలకు ముప్పుతెస్తున్న దుర్మార్గ మూలాన్ని శాంతి - భద్రతల రక్షణ చర్యల ద్వారా మాత్రమే పరిష్కరించడం సాధ్యంకాదన్నారు.

సంఘ వ్యతిరేక శక్తులమీద తగినంత గట్టి చర్యలు తీసుకోవడం జరగడం లేదని కొందరు సభ్యులు చెప్పారు. కచ్‌ప్రాంతంలో జాతీయ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఒక వ్యక్తిని ప్రభుత్వం ఉపేక్షించి వదిలి పెట్టిన ఒక ఉదంతాన్ని సభ్యులొకరు పేర్కొన్నారు.

దేశంలో శత్రుగూఢ చారుల కార్యకలాపాలను సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ఎరుక పరచాలి. తద్వారా వారిలో జాగరూకత పెరుగుతుంది. మన గూఢచారిశాఖను బాగా కట్టుదిట్టం చేయాలి అని మరొకరు సూచించారు.

భారత్ పట్ల సోవియట్ ప్రజల ఆప్యాయత

శ్రీ కామరాజ్‌నాడార్ పత్రికా గోష్ఠి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7

భారత్ ప్రజలపట్ల సోవియట్ ప్రజల ప్రేమాభిమానాలు, సానుభూతి నన్ను ఎంతో ముగ్ధుణ్ణి చేశాయి అని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌నాడార్ నిన్న యిక్కడ 'సోవియట్‌భూమి' పత్రికా నిర్వాహకులతో జరిపిన ఒక గోష్ఠిలో చెప్పారు.

ఆ దేశంలో గడిపిన పది రోజుల్లోనూ నాకు అత్యంత ఆప్తులైన మిత్రుల మధ్య వున్నట్లే అనిపించింది అన్నారాయన.

నెహ్రూ నాయకత్వాన భారతదేశం రూపొందించుకొని యీనాటికీ యింటా బయటా అనుసరిస్తున్న విధానాలే భారతదేశం పట్ల వారి ఆప్యాయతకు మూలం. భారత అలీన విధానాన్ని వారు ఎంతగానో హర్షిస్తున్నారని శ్రీ నాడార్ చెప్పారు.

టిక్కెట్లను కొనవలసిన బాధ్యత ప్రయాణీకులదే

ఆర్. టి. సి. మేనేజిమెంటు ఒప్పుదల

హైద్రాబాద్, సెప్టెంబరు 6

ఆర్. టి. సి. బస్సులలో కండక్టర్ల వద్ద నుంచి టిక్కెట్లను డిమాండ్‌చేసి, పొందవలసిన బాధ్యత ప్రయాణీకులదేనని ప్రభుత్వం ఇప్పుడు గుర్తించినదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రోడ్డు రవాణా కార్పొరేషను ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ మఖ్దుంమొహియుద్దీన్ నేడిక్కడ వర్క్‌షాపు కార్మికుల సభలో ప్రసంగిస్తూ వెల్లడించారు.

ఈ సూత్రాన్ని ప్రభుత్వంచేత అంగీకరింపచేయడానికి ఎంప్లాయీస్ యూనియన్ చాలా కాలంగా ఆందోళన చేస్తున్నది.

రవాణాశాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి "ప్రయాణీకుల బాధ్యతా పథకాన్ని" ఆమోదించారని, త్వరలోనే ఆర్. టి. సి. అధికారులకు ఈ విషయం అధికార రీత్యా తెలియ చేయబడుతుందని ఆయన వివరించారు.

ఎ. పి. టి. యు. సి. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.సత్యనారాయణరెడ్డికూడా ఈ సభలో ప్రసంగించారు.

ఈ నెల 7, 8, 9 తేదీలలో ఆర్. టి. సి. సెంట్రల్ వర్క్‌షాపుల ఉద్యోగులు తమ కోర్కెల సాధనకు అసమ్మతి ప్రదర్శనలు ప్రారంభిస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ఆర్. టి. సి. అధికారులు జరుపుతున్న జాప్యానికి నిరసనగా ఈ ప్రదర్శనలు తలపెట్టారు.

సెప్టెంబరు 10 వ తేదీలోగా, ఈ సమస్యలను పరిష్కరించకపోతే, సెప్టెంబరు 12 న సెంట్రల్ వర్క్‌షాపు లన్నింటిలోను సమ్మె బ్యాలెట్ తీసుకోవాలని కూడా నిర్ణయించారు.

ఢిల్లీ - హిమాచల్ ప్రదేశ్ బిల్లు

లోక్‌సభలో ప్రతిపాదన వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

ఢిల్లీ - హిమాచల్ ప్రదేశ్ (న్యాయ - కార్యనిర్వాహక శాఖల విభజన) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు హోంమంత్రి నందా నేడు విఫలయత్నం చేశారు.

ఈ బిల్లు నిబంధనకు వ్యతిరేకంగా వుందనీ, అందుకని దానిని సభలో ప్రవేశపెట్టేందుకు వీల్లేదని శ్రీ హెచ్. వి. కామత్ అడ్డుకున్నారు,

బిల్లుకు అనుబంధంగా సమర్పించిన ఆర్థిక సమాచార నివేదిక సమగ్రంగా లేదని అయన అన్నారు.

అసలు బిల్లుకంటే దానికి జత చేసిన తప్పొప్పుల పట్టికే పెద్దగావుందనీ, యీ బిల్లును యీ రూపంలో సభ్యులెవరూ అర్థంచేసుకోలేరని ఆయన విమర్శించారు. పాలకపక్షం సామర్థ్యం నానాటికీ క్షీణిస్తున్నదని ఆయన అన్నారు.

స్పీకర్ స్థానంలోవున్న శ్రీ కృష్ణమూర్తి రావు శ్రీ కామత్ అభ్యంతరాలను ఆమోదించి బిల్లు ప్రవేశపెట్టడాన్ని మరునటి రోజుకు వాయిదా వేయాలని నిర్ణయించారు.

సాంకేతిక కారణాలవల్ల బిల్లు ప్రవేశం నిలిచిపోవడం పార్లమెంటు ప్రస్తుత సమావేశంలో యిది మూడవసారి.

కిరాణా వర్తకుల ఆందోళనకు స్థానిక వాణిజ్య మండలి వత్తాసు

విజయవాడ, సెప్టెంబరు 7

ఆంధ్రప్రదేశ్ కిరాణా వర్తకుల ఆందోళనోద్యమాన్ని బలపరుస్తూ రేపు, ఎల్లుండి విజయవాడలో పూర్తి హర్తాల్ జరపాలని విజయవాడ వాణిజ్య పారిశ్రామిక మండలి నేడు విజ్ఞప్తి చేసింది.

గత ఆదివారంనాడు ఇక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ కిరాణా వర్తకుల సదస్సులో రాష్ట్ర మంతటా రేపు, ఎల్లుండి హర్తాళ్ జరుపాలని నిర్ణయించిన సంగతి 'విశాలాంధ్ర' పాఠకులకు విదితమే.

ఆహార కల్తీ చట్టంలోని కొన్ని నిబంధనలకు వ్యతిరేకంగా కిరాణా వర్తకులు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు.

రొడీషియా సమస్యపై కామన్వెల్తు నుండి వైదొలగేందుకు భారత్ సిద్ధంకావాలి

శ్రీ వాజ్‌పాయ్ విజ్ఞప్తి

విజయవాడ, సెప్టెంబరు 6

అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గావున్న భారతదేశం వియత్నాం సంఘర్షణ విషయంలో ఎటువైపునకూ మొగ్గరాదని ఖచ్చితంగా తటస్థతనుపాటించాలని పార్లమెంటులో జనసంఘ గ్రూపు నాయకుడు శ్రీ ఎ. బి. వాజ్‌పాయ్ నేడిక్కడ అన్నారు.

శ్రీ వాజ్‌పాయ్ నేడిక్కడ పత్రికా సమావేశంలో ప్రసంగిస్తూ ఈ ప్రాంతపు ఆర్థికాభివృద్ధికి, భద్రతకూ, అభివృద్ధి పొందిన దేశాలు సమిష్టిగా హామీ యివ్వాలన్నారు. ఈ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఇది అత్యవసరమని చెప్పారు.

ఈ సమస్యపై ఆఫ్రికా దేశాలతోపాటు కామన్వెల్తునుండి వైదొలగడానికి భారతదేశం సిద్ధంగా వుండాలన్నారు.

కామన్వెల్తు సమావేశం ప్రారంభం

లండన్, సెప్టెంబరు 6

రొడీషియా సమస్యపై చర్చ జరుగుతున్నప్పుడు బ్రిటిష్ ప్రధాని విల్సన్ సమావేశం అధ్యక్షులుగా వుండటానికి ఆఫ్రికా దేశాలు చివరిక్షణంలో అంగీకరించటంతో, ఈరోజు ఉదయం అనుకున్న కార్యక్రమం ప్రకారం కామన్‌వెల్తు ప్రధానుల మహాసభ మెల్బరీహౌస్‌లో ప్రారంభమయ్యింది.

ప్రారంభోపన్యాసాల అనంతరం ప్రధాన మంత్రులు సమావేశం ఎజెండాను ఆమోదించింది.

ఈ రోజు (6.వ తేది) మధ్యాహ్నం రొడీషియా సమస్యపై చర్చ ప్రారంభం అవుతుంది.

ప్రారంభోపన్యాసాలు పూర్తయి. ఎజెండాపై ఆమోదం కుదిరిన వెంటనే ఉదయం సమావేశం వాయిదా పడింది.

మధ్యాహ్నం రొడీషియా సమస్యపై చర్చ ప్రారంభం అయినపుడు తాము అనుసరించవలసిన ఎత్తుగడలు నిర్ణయించుకోవటానికి ఆఫ్రికా దేశాల ప్రతినిధులు అనాంతిక సమావేశం ప్రారంభించారు.

రొడీషియా సమస్యపై చర్చ జరుగుతున్నప్పుడు బ్రిటన్ అధ్యక్షస్థానంలో వున్నా అభ్యంతరం తెల్పరాదని ఆఫ్రికా దేశాలు చివరి క్షణంలో తీసుకున్న నిర్ణయం దూరదృష్టితో కూడినట్టిదని పరిశీలకులు భావిస్తున్నారు.

ఆతిథ్యం యిస్తున్న దేశ ప్రధాని సమావేశానికి అధ్యక్షత వహించటం అనే ఆచారాన్ని కాదనటం బాగుండదని ఆఫ్రికాదేశాలు భావించాయి. అధ్యక్షులుగా తనకుండే అవకాశాలను విల్సన్ దుర్వినియోగం చేయరనే ఆశాభావాన్ని ఆఫ్రికాదేశాల ప్రతినిధులు వెలిబుచ్చారు. ఇది విల్సన్‌పట్ల విశ్వాసప్రకటన అని కామన్‌వెల్తు ప్రధాన కార్యదర్శి ఆర్నోల్డ్‌స్మిత్ వర్ణించారు. ఆచారాన్ని గౌరవించటం మాత్రమే యిదని ఆఫ్రికాదేశాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

విల్సన్ స్వాగతోపన్యాసం

కామన్‌వెల్తు ప్రధానుల సభ ప్రారంభం కాగానే విల్సన్ స్వాగతోపన్యాసం యిస్తూ రొడీషియా సమస్య మహాసభ ముందున్న అత్యంత ప్రధాన సమస్య అని అన్నారు. మధ్యాహ్నం సమావేశంలో ఈ విషయమై బ్రిటన్ వైఖరిని వివరిస్తూ సుదీర్ఘ ప్రసంగం చేయగలనని సూచన ప్రాయంగా తెలిపారు.

విల్సన్ ప్రసంగం సుమారు 75నిముషాల సేపు సాగింది.

జాంబియాతో విమానాలలో సరుకుల రవాణాను కామన్‌వెల్తు దేశాలు అధికం చేయాలని, దక్షిణ రొడీషియాపై ఆంక్షల్ని తీవ్రం చేయాలని అన్నారు.

రొడీషియాకు వ్యతిరేకంగా ఏమి చర్యలు తీసుకోవాలనే విషయంలో సభ్యదేశాల సలహాలు వినటానికి బ్రిటన్ సిద్ధంగా వున్నదని, ఆయన అన్నారు.

ఐచ్ఛిక ఆర్థిక ఆంక్షలద్వారా స్మిత్ ప్రభుత్వాన్ని కూలదోయాలనే బ్రిటన్ పథకం ఫలప్రదం అవుతుందో? లేదో? మరి కొంతకాలం వేచిచూడాలని ఆయన కోరారు.

కామన్‌వెల్తును విచ్ఛిన్నం చేయవద్దని టుంకూ విజ్ఞప్తి

విల్సన్ స్వాగతోపన్యాసానికి మలేషియా ప్రధాని టుంకూ అబ్దుల్ రహ్మాన్ జవాబు చెప్తూ, కామన్‌వెల్తును విచ్ఛిన్నం చేయవలదని ఆఫ్రికా దేశాల ప్రధానులకు విజ్ఞప్తి చేశారు.

టుంకూ తన ప్రసంగంలో యిలా అన్నారు:

"కామన్‌వెల్తు అనేది ఒక కుటుంబం లాంటిది. అందులో పలురకాల అభిప్రాయాలు వ్యక్త అవుతాయి. ప్రపంచశాంతి రక్షణకు ఈ సంస్థ ఎంతగానో ఉపయోగపడింది.

ఉదాహరణకి మీ దేశానికి మాదేశానికి 10 రెట్లు బలసంపన్నమయిన మరోదేశం నుండి ప్రమాదం మేర్పడినప్పుడు బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు మాకు సాయపడ్డాయి. మిగతా కామన్‌వెల్తు దేశాలు పట్టించుకోనేలేదు.

తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దశలో కూడా మిగతా దేశాల వైఖరిని గురించి మేము తప్పుగా అర్థం చేసుకోలేదు. బాధపడలేదు.

బ్రిటన్ కామన్వెల్తుకాదు. అది ఏదీ కాదన్న సంగతి మర్చిపోరాదు. బ్రిటన్‌కూడా కామన్‌వెల్తులో సభ్యదేశం. కామన్‌వెల్తు అందరిదీను.

రొడీషియా సమస్యపై విభేదాలు తలెత్తవచ్చు. అంత మాత్రాన కామన్‌వెల్తు విచ్ఛిన్నంకారాదు."

రొడీషియా సమస్యను తమకి సంతృప్తి నిచ్చే విధంగా బ్రిటన్ సత్వరమే పరిష్కరించకపోతే కామన్‌వెల్తును బహిష్కరిస్తామని జాంబియా, మరికొన్ని ఆఫ్రికా దేశాలు స్పష్టంచేసిన సంగతి పత్రికా పాఠకులకు విదితమే.

టుంకూ తన ప్రసంగంలో యింకా యిలా అన్నారు.

"రొడీషియా సమస్యను పరిష్కరించటానికి చిత్తశుద్ధితో యత్నించాలి. ఆ సందర్భంలో సమస్యను అన్ని దృక్కోణాల నుంచి పరిశీలించటం మంచిది.

స్మిత్ ప్రభుత్వ పతనానికి బ్రిటన్‌ను మనంతీసుకోమని కోరేచర్యలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని చిక్కుల్లో పెట్టేవిగా వున్నదేమో పరిశీలించటం అవసరం. మనం చెప్పే చర్యలు తీసుకుంటే బ్రిటిష్ ప్రభుత్వ ఉనికికి ప్రమాదం ఉన్నదేమో కూడా పరిశీలించాలి.

కామన్వెల్తు సభ్యదేశం ఒకటి తనబాధ్యతల నిర్వహణలో విఫలం అయితే మొత్తం సంస్థకే ముప్పు తలపెట్టడం మంచిదికాదు,

బ్రిటన్‌మీద కోపంవుంటే. లేక విల్సన్ ప్రభుత్వంపై ఆగ్రహంవుంటే వాటిపై నే తీర్చుకుందాం. అంతే గాని కమన్‌వెల్తుపై కాదు."

ఖరీఫ్ పంట పరిస్థితి

సంతృప్తికరమని కేంద్ర వ్యవసాయశాఖ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

దేశం మొత్తంమీద ఖరీఫ్‌పంట పరిస్థితి చాలా బాగుంది. అయితే చాలాచోట్ల సెప్టెంబరులో వర్షాల అవసరం ఎంతైనా వుంది అని కేంద్రప్రభుత్వ ఆహార వ్యవసాయశాఖ పార్లమెంటుకు అందజేసిన ఒక సమాచారపత్రంలో తెలిపింది.

మన దేశంలో లభించే ఆహార ధాన్యాల పంటలో మూడింట రెండు వంతులభాగం ఖరీఫ్‌లోనే లభిస్తుంది.

ఆగస్టుమాసాంతం వరకు సేకరించిన సమాచారం మేరకు, కోస్తాఆంధ్రప్రాంతం, రాయలసీమ, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌లలో ఖరీఫ్ పంట బాగా వుండే సూచనలున్నవి. మధ్యప్రదేశ్‌లో ధాన్యాగారంగా పేరుబడ్డ ఛత్తీస్‌ఘర్ ప్రాంతంలో కూడా వరి పంట సంతృప్తికరంగానేవుంది అని యీ నివేదికలో తెలియ జేశారు.

అయితే, ఖరీఫ్‌పంట మొత్తం యేమాత్రం వుంటుందో అప్పుడే అంచనా వేసుకోవడం తొందరపాటు అవుతుంది. సెప్టెంబర్ అక్టోబర్ మాసాల్లో యెలాంటి వాతావరణ స్థితి వుంటుందో దానినిబట్టే చివరి ఫలితం వుంటుంది అనికూడా ఈ నివేదిక హెచ్చరించింది.

ప్రాంతాలవారీగా యింకా యీ క్రింది సమాచారంకూడా యీ పత్రంలో పొందుపరిచారు.

అస్సాం: ఆగస్టు నెల మధ్య వరకు వరిపంట బాగానేవుంది. అయితే ఆ తరువాత ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో బాగా వానలు పడ్డవి. బ్రహ్మపుత్రకు, మిగతా ఉపనదులకు వరదలు వచ్చాయి. పంటలకు కొంత నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది.

బెంగాల్: వాతావరణం అననుకూలత వల్ల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వరి జనపనార పంటలకు కొంత దెబ్బతగిలింది నాట్లకు కూడా అంతరాయం యేర్పడింది. ఆగస్టు చివరి రెండువారాల్లో భారీవర్షాలు పడ్డవి. వరిపంట కొంత తగ్గేసూచనలు కాన వస్తున్నవి.

బీహార్: ఈ రాష్ట్రంలోనూ భారీగా వరదలు సంభవించాయి. ఒక చెంప వరదలు, మరో చెంప వర్షాభావం స్థితి అపూర్వంగా వుంది. ఈ రెండింటి ఫలితంగా వరిపంట బాగా తగ్గేసూచన లున్నాయి

ఒరిస్సా: వర్షాలు తక్కువగా వున్నా వరిపంట ఆశాజనకంగానే వుంది.

ఆంధ్రప్రదేశ్: స్వల్పకాలపు పంటలు ఖరీఫ్ పంటల నాట్లు తెలంగాణాలో కొంత ఆలస్యంగా జరిగాయి. జూలై వరకు పెద్దగా వర్షాలు లేవు. జూలైమధ్యనుండి పెద్దవానలు పడ్డవి. తెలంగాణాకు వచ్చే వారం పది రోజుల్లో వర్షాలు అవసరం.

మద్రాసు: ఈ రాష్ట్రంలో మొదట వానలు కొంత తక్కువ అయినా పంటల పరిస్థితి బాగానే వుంది.

మైసూరు: ఖరీఫ్‌పంట బాగానేవుంది. వచ్చే రెండు మూడు వారాల్లో వానలు చాలా అవసరం.

కేరళ: ఆగస్టు 17 వరకు పంటలు బాగానే వున్నవి. నెల చివరి రెండువారాల్లో రుతుపవనాలు తగ్గాయి. వచ్చే రెండు మూడు వారాల్లో వర్షాలుపడితే పంటలకు ప్రయోజనకరంగా వుంటుంది.

మధ్యప్రదేశ్‌లోనూ పరిస్థితి సంతృప్తికరంగానేవుంది.

మహారాష్ట్రలోను అదే పరిస్థితి.

గుజరాత్: వచ్చే రెండుమూడు వారాల్లో వానలు లేకపోతే ఖరీఫ్ పంటకు దెబ్బ తగిలే సూచన లున్నవి.

జమ్మూ కాశ్మీర్: మంచి వర్షాలు పడ్డవి. పంటలు బాగున్నవి.

ఉత్తర ప్రదేశ్: వచ్చే రెండు మూడు వారాల్లో వర్షా లెంతైనా అవసరం, పంజాబ్‌లోనూ పరిస్థితి యిదే విధంగా వుంది

రాజస్థాన్: ఆగస్టు 18 దరిమిలా భారీ వర్షాలుపడి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా పరిణమించింది.

వియత్నాం

(1 వ పేజీ తరువాయి)

నిలిపివేయాలని కెనడా ప్రభుత్వం ఇదివరకే కోరింది.

చైనా సరిహద్దు సమీపంలో రాడార్‌పై విమానదాడి

చైనా సరిహద్దుకు 20 మైళ్ళలోగలఉత్తర వియత్నాం రాడార్ కేంద్రంమీద తమ విమానాలు దాడి చేశాయని అమెరికా సైనికశాఖ ప్రతినిధి సైగాన్‌లో ప్రకటించారు.

నిన్న ఉత్తరవియత్నాంపై అమెరికా విమానాలు మొత్తం 152 సార్లు దాడులు చేశాయి.

డిగోల్ ప్రతిపాదనకు వియత్‌కాంగ్ హర్షం

వియత్నాం సమస్యా పరిష్కారానికి ఫ్రాన్సు అధ్యక్షుడు డిగోల్‌చేసిన సూచనపట్ల దక్షిణ వియత్నాం జాతీయ సమైక్య సంఘటన ప్రతినిధి ట్రాన్ హాయ్‌వాన్ ఆల్జీర్సులో హర్షం ప్రకటించారు.

అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణకు మూలం అనే అంశాన్ని డిగోల్ తన ప్రసంగంలో స్పష్టం చేశారని ఆయన అన్నారు.

డిగోల్ ఈ ప్రతిపాదన ద్వారా యదార్థ దృష్టిని ప్రదర్శించారని అన్నారు.

మోసపు ఎన్నికలకు నిరసనగా నిరాహారదీక్ష

దక్షిణ వియత్నాం బౌద్ధుల నిర్ణయం

సైగాన్, సెప్టెంబరు 6

వచ్చే ఆదివారం సైగాన్ సైనిక ముఠా ప్రభుత్వం జరపదలచిన ఎన్నికలకు నిరసనగా తాము 72 గంటల పాటు ఈ వారంలో నిరాహారదీక్ష జరుపుతామని సైగాన్ బౌద్ధ మతాధిపతులు ఈ రోజు ప్రకటించారు.

గురువారం నిరాహారవ్రతం ఆరంభమవుతుంది.

కీ ప్రభుత్వం జరపదలచిన మోసపు ఎన్నికలకు నిరసనగానూ, జూన్ 8 నుంచి నిరాహారదీక్షజరుపుతున్న దిచ్‌ట్రైక్వాంగ్‌పట్ల సానుభూతి సూచకంగానూ ఈ దీక్ష తలపెట్టినట్లు ప్రకటన వెలువడింది.

ఈ ప్రకటనపై దక్షిణవియత్నాం అగ్ర బౌద్ధమతాధిపతి సంతకం చేశారు.

కీ ప్రభుత్వం రాజకీయ, ఆర్థిక, సైనిక, సాంస్కృతిక, సామాజిక రంగాలన్నింటిలో ఘోరంగా విఫలం అయిందని ఆ ప్రకటన పేర్కొన్నది.

ఎన్నికల కార్యాలయం గెరిల్లాలచే పేల్చివేత

సైగాన్ నగరం సరిహద్దుకు 3 మైళ్ళలో వున్న సైగాన్ ప్రభుత్వ ఎన్నికల కార్యాలయాన్ని గెరిల్లాలు పేల్చివేశారు. లౌడ్ స్పీకర్లు, కరపత్రాలు, ఇతర సామాగ్రివున్న భవనం మొత్తంగా ధ్వంసమయ్యింది.

మహారాష్ట్రసమితి, సంయుక్త సోషలిస్టు పార్టీలకుచెందిన సభ్యులు నేడు మహారాష్ట్ర శాసనసభనుండి వాకౌట్ చేశారు.

ఎక్కడ రంగు కావలెనో అక్కడ ఏషియన్ పెయింట్స్
ఏప్‌కోలైట్ సింథెటిక్ ఎనామెల్
Apcolite
Synthetic Enamel
• అతి వేగంగా ఆరిపోతుంది.
• అత్యధిక ఆవరణకు వరిపోయే పరిమాణ శక్తి
• మన్నికకు గ్యారంటి
• 36 ఆకర్షణీయ రంగులలో గలదు.
• బహువిధోపయుక్తమైన పెయింట్
APE Aiyars, A. 34C. Tk.

SOVIET TEXT BOOKS

SCIENCE & TECHNOLOGY

ONLY METRIC SYSTEM USED

Popular Prices

Most of them Prescribed or Recommended by the INDO-SOVIET Text Book Board

Theoretical Physics	Kompaneyets	pp 560	9-00
The Structure of Atoms and Molecules	Kondratyev	544	7-00
Hand book of Elementary Physics	Koshkin	214	3-55
Introduction to Physics	Kitaigorodsky	719	8-00
Theory of Elasticity	Filonenko - Borodich	378	6-00
Quantitative Analysis	Alexeyev	491	7-00
Organic Chemistry	Pavlov and Terentyev	592	7-00
Text book of General Chemistry	Nekrasov	480	6-00
Higher Mathematics	I. Suvorov	310	6-00
Problems in Mathematical Analysis	Demidovich	400	6-00
General Geology	Lange	300	4-50
Reclemative Social Science	Plyusnin	398	6-00
General Metallurgy	N. Sevryukov & others	545	6-00
Metallurgist's Hand book	A. Group of authors	224	5-40
Fundamentals of Electrical Engineering	M. Kuznetsov	460	6-00
Power Stations and Substations	L. Baptidanov & V. Tarasov	462	6-00
Mine Electrician	Y. Mikheyev & I. Fadbizovich	465	6-00
Materials for Eletrical Engineering	B. M. Tarayev	200	4-50
Electric Slag Walding	B. Paton	365	6-00
Heat Treatement of Metals	B. Zakharov	311	6-00
Heat Treatement	Kamenichny	276	3-00
Production of Ferro-Alloys	Piss	278	5-00
Open Hearth Practice	Bornatsky	340	6-00
Gas Welding & Cutting	Glizamenenko	430	6-00
Materials Handling Equipment	Rudenko	335	6-00
Building Construction Drawing	P. Barasukov	302	5-00
Conveyers and Helated Equipment	V. Dyachkov & V. Spivakovsky	375	6-00
Structural Design of Sea Going Ships	N. Barabanov	464	6-00
Marine Power Plant	P. Akimov	580	7-00
Marine Auxiliary Machinery and Systems	M. Khetagurov	498	6-00
Mathematical Control Machines	A. Lasktov	380	6-00
Essentials of Crystallography	Y. Flint	226	4-50
A Course of Mineralogy	A. Betekhtin	643	8-00

POSTAGE EXTRA

Order from:

VISALAANDHRA PUBLISHING HOUSE,
Eluru Road Centre :: Vijayawada - 2

VISALAANDHRA BOOK HOUSE,
Sultan Bazar, Hyderabad.

ADMARK

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4. ప్రధాన సంపాదకులు ఏటుకూరు బలరామమూర్తి.